fb/prajasakti, www.prajasakti.com

S & D

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 01 | విజయవాడ, సోమవారం 01 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



వివాదాస్పద వ్యాఖ్యలపై

వెల్లువెత్తుతున్న ఆగ్రహం

- త్రిపుర సిఎంపై నోరుజారిన బిజెపి నేత 8

సొంతూరికి సేవ

రేపటి నుంచి జన్మభూమి

కొత్త ఏడాదిలో రాజధాని పనులు

నూతన సంవత్సరం సందర్భంగా

సిఎం చంద్రబాబు బహిరంగ లేఖ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ సొంత గడ్డ రుణం తీర్చుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 2018 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ఆయన ఆదివారం బహిరంగ లేఖ రాశారు. 'అధికారం చేపట్టిన 42 నెలల కాలంలో పరిపాలనా యంత్రాంగాన్ని మిషన్ మోడ్‌తో పనిచేయించాం. అనితర సాధ్యమైన ఫలితాలు సాధించాం.. రాష్ట్రపతి చేతుల మీదుగా దేశంలోనే మొట్టమొదటి సారిగా ప్రతి ఇంటికీ నెట్ కనెక్టివిటీని అందించే ఫైబర్ గ్రిడ్‌ను ప్రారంభించాం' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. 'సంక్రాంతికి ముందు వచ్చే పెద్ద పండుగ 'జన్మభూమి-మా ఊరు' ఈ పండక్కి తెలుగువారు ఎక్కడున్నా సొంత ఊరుకు రావాలి. సంబరాలు జరుపుకోవాలి. సొంతగడ్డ రుణం తీర్చుకోవాలి' అని ఆయన కోరారు. నూతన సంవత్సర ఆరంభంలోనే ప్రపంచశ్రేణి రాజధాని నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 'కొండలను పిండి చేయగల శక్తి తెలుగువారిది. ఆ శక్తి యుక్తులతో ప్రపంచాన్ని ఏనాడో గెలిచారు.' అని పేర్కొన్నారు. మన రాష్ట్రం ప్రపంచంలో అందరి దృష్టినీ ఆకర్షిస్తోందని తెలిపారు. పరిశ్రమలు నెలకొల్పడానికి అనేక సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయన్నారు. 1996 నుంచి 2004 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధికి బలమైన పునాదులు వేశామని, దేశంలోనే అగ్ర రాష్ట్రంగా ఎదిగామని తెలిపారు. ఆ తర్వాత పదేళ్లలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. 2014లో చేసిన రాష్ట్ర విభజనతో కుదేలయ్యామని పేర్కొన్నారు. '60 ఏళ్లుగా శ్రమించి నిర్మించుకున్న, సంపాదించుకున్న సంస్థల్ని కోల్పోయాం. రాజధాని ఎక్కడో తెలియని పరిస్థితుల్లో అప్పుల భారంతో దిక్కుతోచని స్థితిలో బయటకు వచ్చాం' అని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షోభాన్ని అధిగమించి ప్రపంచశ్రేణి రాజధానిని నిర్మించడానికి కృషి చేస్తున్నామన్నారు.. 'రూ. 16 వేల కోట్ల లోటు బడ్జెట్, చిన్నాభిన్నమైన పాలనా వ్యవస్థ, అంతటా అయోమయం నెలకొన్న సమయంలో రాష్ట్ర పగ్గాలు చేపట్టి పాలించడం సామాన్యమైన విషయం కాదు. అయినా, కాంగ్రెస్ పాలకులు మన గుండెల్లో దించిన కత్తుల్ని అధిగమించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలని నిర్ణయించుకున్నాం. ఆ దిశలో కృషి చేస్తున్నాం' అని పేర్కొన్నారు. ఆర్థికరంగం మిగతా 9లో



పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు ప్రజాశక్తి నూతన సంవత్సర శుభాకాంక్షలు
- సంపాదకులు

నేనొచ్చేశా!

రజనీ రాజకీయ అరంగేట్రం

త్వరలోనే పార్టీ

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ

సంబరాల్లో తలైవా అభిమానులు

ప్రజాశక్తి ప్రతినిధి - తిరుపతి, చెన్నయ్

దీర్ఘకాలిక ఉత్కంఠతకు తెరదించుతూ తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ తన రాజకీయ రంగ ప్రవేశాన్ని అధికారికంగా ప్రకటించారు. ఆదివారం కొడంబాకంలోని రాఘవేంద్ర కళ్యాణమండపంలో నిర్వహించిన సమావేశంలో వేలాది మంది అభిమానుల సమక్షంలో రజనీ తన రాజకీయ అరంగేట్రాన్ని ప్రకటించారు. అభిమానులు 'తలైవా' (నాయుకుడు)గా పిల్చుకునే రజనీ ప్రసంగం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. వ్యవస్థలో మిగతా 8లో



అభిమానుల సమావేశంలో అభివాదం చేస్తున్న రజనీకాంత్

సిఆర్‌పిఎఫ్ క్యాంప్‌పై దాడి

నలుగురు జవాన్లు మృతి

ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్ : జమ్ముకశ్మీర్‌లోని పుల్వామాలోని సిఆర్‌పిఎఫ్ శిక్షణ కేంద్రంపై ఉగ్రవాదుల బృందం శనివారం అర్ధరాత్రి కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నలుగురు భద్రతా దళ సిబ్బంది మృతి చెందగా, ముగ్గురు ఉగ్రవాదులు కూడా హతమయ్యారు. పాకిస్తాన్‌కు చెందిన జైష్ -ఈ- మహమ్మద్ ఈ ఘటనకు బాధ్యత వహించారు. ఈ మధ్యకాలంలో ఈ గ్రూపు అనేక భారీ చేదు అనుభవాలను ఎదుర్కొంది. నాలుగు రోజుల క్రితం జైషీ అగ్రనేత నూర్ మహమ్మద్ తంత్రి(చోటా నోరా) పుల్వామా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. అలాగే నవంబర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టు పెట్టారు. వీరిలో జైష్ నేత మసూద్ అజర్ మేనల్లుడు తల్హార్ రసీద్ కూడా ఉన్నాడు. ఆదివారం ఉదయం సుమారు 2 గంట సమయంలో185వ బెటాలియన్ సిఆర్‌పిఎఫ్ శిక్షణా కేంద్రం భవనాన్ని చుట్టు ముట్టి ఉగ్రవాదులు దాడులు చేశారు. గ్రెనేడ్లను విసిరి, విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ దాడిని గమనించిన సిఆర్‌పిఎఫ్ పోలీసులు అప్రమత్తమై వెంటనే ఆపరేషన్‌ను ప్రారంభించారు.

ఆ సమయంలో ఎంత మంది సిఆర్‌ఫిఎఫ్ పోలీసులు విధుల్లో ఉన్నారో తెలియనప్పటికీ, కొంత సమయానికే భద్రత దళాలు అక్కడకు చేరుకున్నాయి. కాల్పులు జరిపిన గంటలో సరూపుద్దీన్ గణై అనే సిఆర్‌పిఎఫ్ జవాన్ మృతి చెందారు. ముగ్గురు గాయపడ్డారు. తరువాత కొనసాగుతున్న ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు జవాన్లు మృతి చెందగా, ఒక భవంతిలో చిక్కుకున్న జవాన్ గుండె పోటుతో మృతి చెందారు. సిఆర్‌పిఎఫ్ శిబిరాన్ని లక్ష్యంగా చేసుకుంటారనే హెచ్చరికలు ముందుగానే తెలిసినప్పటికీ ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై ముందస్తు నిఘా హెచ్చరికలు చేరాయని పోలీసులు కూడా పేర్కొన్నారు. దాదాపు పది గంటలపాటు జరిగిన ఈ కాల్పుల్లో ముగ్గురు తీవ్రవాదులను తుద ముట్టించారు. గత రెండు మూడు రోజులుగా కాల్పులు చేయడానికి తీవ్రవాదులు ప్రయత్నిస్తున్నారని, వారు సరైన సమయం కోసం వేచి చూసి శనివారం రాత్రి దాడులకు పాల్పడ్డారని పోలీస్ డైరెక్టర్ జనరల్ సూపరింటెండెంట్ వాయిద్ ఈ ఘటన అనంతరం పేర్కొన్నారు. గత ఆగస్టులో కూడా ఉగ్రవాదులు ఇదే తరహా దాడులు చేసిన ఘటనలో ఎనిమిది మంది భద్రతా దళ సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. రెండు నెలల క్రితం శ్రీనగర్ విమానాశ్రయానికి దగ్గరలో ఉన్న బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బిఎస్ఎఫ్)పై ఆత్మాహుతి దాడులకు పాల్పడగా, ఆ ఘటనలో ఒక జవాన్ మృతి చెందారు.



బహిష్కరణకు గురైన దళితులు

కర్నూలులో దళితుల గ్రామ బహిష్కరణ

అగ్రవర్ణాల శవం ఖననం చేసే గుంత తవ్వమన్నందుకే..

విద్యుత్, తాగునీటి సరఫరా నిలిపివేత

స్పందించని పోలీసులు

ప్రజాశక్తి - రుద్రవరం (కర్నూలు)

కర్నూలు జిల్లాలో పెత్తందారులు దళితులను గ్రామం నుండి బహిష్కరించారు. నిత్యావసర సరుకులు, తాగునీరు, విద్యుత్ సరఫరాను సైతం నిలిపేశారు. కేవలం అగ్రవర్ణాల శవాన్ని ఖననం చేసే గుంత తవ్వలేదన్నే కారణంతోనే ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన రుద్రవరం మండలం నక్కలదిన్నెలో ఆదివారం వెలుగుచూసింది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలో పూర్వకాలం నుంచి దాదాపు 20 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయి. వారిలో ఆచారం ప్రకారం 4 కుటుంబాలు సూది జయన్న, లేగల ఎలీషా, జవాధి పుల్లన్న, దేవరాజులు మాత్రమే ఎత్తి (మనిషిని ఖననం చేసే గుంత తవ్వడం) పనులు చేసేవారు. కాలక్రమేణా దళితులు అక్షరాస్యులుగా మారి ఎత్తిపనులకు వెళ్లడం మానుకున్నారు. దీంతో ఆగ్రహించిన అగ్రవర్ణాల వారు నాలుగేళ్ల క్రితం మిగతా 9లో

నేరాల కట్టడే ప్రథమ ప్రాధాన్యం

నూతన డిజిపి మాలకొండయ్య

పోలీసుబాస్‌గా బాధ్యతల స్వీకరణ

సాంబశివరావుకు వీడ్కోలు



నూతన డిజిపిగా బాధ్యతలు చేపడుతున్న మాలకొండయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నేరాలను కట్టడి చేయడమే తన ప్రథమ ప్రాధాన్యమని రాష్ట్ర నూతన డిజిపిగా ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎం.మాలకొండయ్య తెలిపారు. మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సాంబశివరావు వీడ్కోలు సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పాటు పడతానన్నారు. సాంబశివరావు తనకు పెద్ద సోదరునితో సమానమని, తాను ఇప్పటి వరకు ఆర్టీసీ ఎండి, పోలీస్ అకాడమి ఇన్చార్జితో పాటు మెదక్, గుంటూరు ఎస్పీగా ఆయన నుంచే బాధ్యతల్ని తీసుకున్నానని వెల్లడించారు. డిజిపిగా కూడా ఆయన నుంచే బాధ్యతలు తీసుకుంటున్నానన్నారు. ఇద్దరమూ ఒకే ఎస్పీ దగ్గర శిక్షణ పొందామన్నారు. సాంబశివరావు తనకు మిగతా 9లో



బహుళధృవ ప్రపంచావిష్కరణ

2017 వార్షిక నివేదికలో ఐరాస

ఐక్యరాజ్యసమితి: పెను సవాళ్లతో పాటు భారీ ప్రమాదాలను సైతం ప్రపంచానికి చవిచూపిన 2017 ఐక్యరాజ్యసమితిలో 'బహుళధృవ ప్రపంచాన్ని' ఆవిష్కరించిందని చెప్పవచ్చు. ఏడాది మొత్తమ్మీద ఏకధృవవాదం (ఒంటరి తనం) ప్రపంచ వ్యాప్తంగా ప్రమాద ఘంటికలు మోగించినప్పటికీ దీనితో ఎదురవుతున్న ముప్పును అనేక దేశాలు ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నాయి. ఎదురయ్యే సవాళ్లను, ముప్పులను ఏ ఒక్క దేశమూ తన స్వశక్తితో అధిగమించే పరిస్థితులు ఇప్పుడు లేవని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న పరస్పర స్నేహపూర్వక సహకారం ఈ విషయాన్ని మనకు తేటతెల్లం చేస్తోందని ఆయన ఐరాస వార్షిక నివేదికలో పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఉగ్రవాదం, అనేక ప్రాంతాల్లో తలెత్తుతున్న కొత్త తరహా ముప్పులను ఎదుర్కొనేందుకు సమిష్టి కృషి అత్యంత ప్రభావవంతమైన ఫలితాలనిస్తుందని ఆయన వివరించారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా తలెత్తుతున్న వలసల సమస్యను మానవీయ కోణంలో ఎదుర్కొనేందుకు ఇదొక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఈ ఏడాది మొత్తమ్మీద ప్రపంచ దేశాలు అనేక సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ బహుళపక్ష ప్రపంచ ఆవిష్కరణ కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమాలు పెరగటం విశేషం. ఈ ఏడాది అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ సాధించిన విజయం అంతర్జాతీయ సహకార విస్తరణకు మరో అవకాశమని ట్రంప్ గెలుపు అనంతరం అమెరికా విదేశీ సంబంధాల మండలి తన వెబ్‌సైట్‌లో ప్రచురించిన కథనంలో పేర్కొంది. గత జనవరిలో అధికార బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ట్రంప్ అందుకున్న 'అమెరికా ఫస్ట్' నినాదం, అమలులోకి తెచ్చిన విధానాలు అమెరికా నాయకత్వ రూపురేఖలనే మార్చివేశాయి. బహుళపక్ష సహకార విస్తరణ ఆకాంక్షకు విరుద్ధంగా పారిస్ వాతావరణ మార్పుల ఒప్పందం నుండి వైగొలగటం, ఇతర దేశాల నుండి వచ్చే పర్యాటకులపై ఆంక్షలు విధించటం వంటి చర్యలు కొనసాగాయి. దీనితో అమెరికా ఏకాకిగా మారుతున్న పరిస్థితుల్లో బహుళధృవ ప్రపంచ నాయకత్వ బాధ్యతలను అందుకునేందుకు ఇతర దేశాలు పోటీ పడటం ప్రారంభించాయి. ఎన్ని మిగతా 9లో

కాంగ్రెస్ పోరాటం విడ్డూరం : ముద్దుకృష్ణమ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిన కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని టిడిపి ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు ఎద్దేవా చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఏపిలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎజెండానే కాంగ్రెస్ నేతలు అమలు చేస్తూ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని విమర్శించారు. లోటు బడ్జెట్టున్నా రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు తీసుకెళ్తుంటే విపక్షాలు అడ్డుపడుతున్నాయన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ఏపీ హక్కులపై పార్లమెంట్‌ను స్తంభింపజేసేలా అధిష్టానంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

పుస్తక సంబరం



విజయవాడలోని స్వరాజ్య మైదానంలో నవ్యాంధ్ర పుస్తక సంబరాలకు ముస్తాబవుతున్న ప్రధాన ద్వారం.

నేటి నుంచి విజయవాడలో పుస్తక ప్రదర్శన

ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి, సిఎం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే పుస్తక ప్రదర్శన నేటి నుంచి స్వరాజ్య మైదానంలో ప్రారంభం కానుంది. 29వ విజయవాడ పుస్తక ప్రదర్శనను ఉదయం 11 గంటలకు ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ప్రదర్శన ప్రారంభించిన అనంతరం ప్రారంభ సభ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షులు వెంకట నారాయణ, కార్యదర్శి కె.లక్ష్మయ్య విలేకరులతో మాట్లాడుతూ.. ప్రదర్శనలో 290 స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. జనవరి 1 నుంచి 11వ తేదీ వరకు మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు పుస్తక ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ప్రదర్శనలో పుస్తక ప్రియులకు కావాల్సిన విధంగా అన్ని రకాలైన పుస్తకాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పుస్తక మహోత్సవంలో ప్రాంగణాలకు ప్రత్యేక పేర్లనునిర్ణయించామన్నారు. ప్రధాన పుస్తక మహోత్సవ ప్రాంగణానికి మహాలక్ష్మీ బుక్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత యుఎస్.యోగి పేరును పెట్టామని, సాహిత్య వేదికకు చిత్తజల్లు వరహాలరావు (సివి) పేరును పెట్టామని తెలిపారు. పుస్తక ప్రదర్శనలో ప్రతిరోజూ సాహిత్య కార్యక్రమాలు, చర్చాగోష్టులు, పుస్తకావిష్కరణలు, రచయితలతో సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ప్రతిభా వేదికపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రతిరోజూ వివిధ అంశాలపై పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు.



పొడి వాతావరణమే..

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

ఆగ్నేయ బంగాళాఖాతంలో దక్షిణ అండమాన్, హిందూ మహా సముద్రంలోని భూమధ్యరేఖకు ఆనుకుని అల్పపీడన ద్రోణి ఏర్పడినట్లు భారత వాతావరణ శాఖ ఆదివారం ప్రకటించింది. మూడు నాలుగు రోజులు కోస్తా, సీమల్లో పొడి వాతావరణం నెలకొంటుందని తెలిపింది. ఆదివారం మధ్యాహ్నం కోస్తాలో ఆకాశం మేఘావృతమైంది. ద్రోణి ప్రభావంతో మన రాష్ట్రంపైకి ఆగ్నేయం, తూర్పు దిశల నుండి గాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. యునెస్కో నుంచి ఇటీవల వైదొలిగిన దేశం?
2. నేషనల్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ ఇనిస్టిట్యూట్ ఎక్కడ వుంది?
3. భారత సాంస్కృతిక సంబంధాల కౌన్సిల్ (ఐసిసిఆర్) నూతన అధ్యక్షులు?
4. జనవరి 10న ఇస్రో ఎన్ని ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపనుంది?
5. ఇటీవల మరణించిన రచయిత్రి సౌ గ్రాఫ్టన్ ఏ దేశానికి చెందినవారు?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ప్రకృతి వ్యవసాయానికి కేరాఫ్ ఏపి

- ప్రకృతి సేద్య నామ సంవత్సరంగా 2018
- రైతు బజార్లు, విలేజ్, షాపింగ్ మాల్స్‌ల్లో వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం
- శిక్షణ ప్రారంభంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

2018లో ప్రపంచంలో ప్రకృతి వ్యవసాయానికి కేరాఫ్‌గా రాష్ట్రాన్ని నిలబెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. 2018 సంవత్సరాన్ని ప్రకృతి సేద్య నామ సంవత్సరంగా ప్రకటించారు. రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న బైబిల్ మిషన్ ప్రాంగణంలో సుభాష్ పాలేకర్ నేతృత్వంలో తొమ్మిది రోజులపాటు నిర్వహించే 'ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ'ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. శిక్షణకొచ్చిన 8 వేల మందిలో 300 మంది ఐటి నిపుణులు ఉన్నారని చెప్పారు. అంతర్జాతీయ సంస్థలైన యుఎన్‌డిపి, ఎఫ్‌ఎఒలు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కనబరుస్తున్నాయని, జూన్ 5న యుఎన్‌డిపితో ఎంఒయు కుదుర్చుకోనున్నామని చెప్పారు. తాను మంచి మార్కెటింగ్ మేనేజర్‌ని అని, సుభాష్ పాలేకర్ మంచి ఉత్పాదకుడని, ఇద్దరం కలిస్తే రైతుల కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా మంచి గిరాకీ ఉందని, ఈ ఉత్పత్తులను



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

మార్కెటింగ్ చేసుకోగలిగితే రైతులు లాభపడతారని చెప్పారు. 2016-17లో రాష్ట్రంలో 700 గ్రామాల్లో 40 వేల మంది రైతులు, 2017-18లో 972 గ్రామాల్లో 1.50 లక్షల మంది జీరో బేస్డ్ వ్యవసాయం చేశారని తెలిపారు. 2018లో అన్ని రైతుబజార్లు, చంద్రన్న విలేజ్‌మాల్స్, షాపింగ్ మాల్స్, మార్కెటింగ్ యార్డుల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ.700 కోట్లతో దాదాపు 12.50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యాన్ని అమలు చేస్తామన్నారు. ఇందుకు అజీమ్‌ప్రేమ్‌జీ సంస్థ రూ.100 కోట్లను అందిస్తోందని చెప్పారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విధానాన్ని సుభాష్ పాలేకర్ వివరించారు. కార్యక్రమంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మంత్రులు పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, శాసన మండలి విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఆహార కమిషన్ చైర్మన్ జెఆర్.పుష్పరాజ్, మహిళా చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, రాష్ట్ర వ్యవసాయరంగ సలహాదారు కె.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో అంతర్జాతీయ విద్యుత్తు వ్యవస్థ

రూ.16,383 కోట్లతో ప్రతిపాదనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయి విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేశారు. రూ.16,383 కోట్లతో ప్రతిపాదనల్ని సిద్ధం చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. ఎక్కడా ఓవర్‌హెడ్ లైన్లు కనిపించకుండా భూగర్భంలోనే విద్యుత్ లైన్లు వేయనున్నారు. ప్రతిపాదనలు రూపొందించే క్రమంలో విదేశీ విద్యుత్ రంగ నిపుణులతో వర్క్‌షాపులు నిర్వహించారు. అధికారులు రూపొందించిన విద్యుత్ వ్యవస్థలో రూ. 1,220 కోట్లతో 440 కెవి సామర్థ్యం కలిగిన 4 సబ్‌స్టేషన్‌లు, రూ.2,616 కోట్లతో 222 కెవి సామర్థ్యం కలిగిన 24 సబ్‌స్టేషన్‌లు, రూ.1,276 కోట్లతో 33 కెవి సామర్థ్యం కలిగిన 220 సబ్‌స్టేషన్‌లు, సరఫరాకు సంబంధించి 220 కెవి విద్యుత్ సామర్థ్యం కలిగిన వెయ్యి కిలోమీటర్ల మేర కేబుళ్లు ఏర్పాటు చేయనున్నారు. రూ.2,072 కోట్లతో 33 కెవి సామర్థ్యం కలిగిన 5,600 కిలోమీటర్ల కేబుళ్లు, సివిల్ వర్క్సు, ఆర్సీసీ ట్రెంచ్‌లకు రూ.3,500 కోట్లు, ఇహెచ్‌టి లైన్లకు రూ.1,060 కోట్లు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్కుకు రూ.850 కోట్లు, వీధి దీపాలు, ఇతర పనులకు రూ.1,060 కోట్లు, కంటింజెన్స్, అడ్మినిస్ట్రేటివ్ వ్యయం రూ.927 కోట్లతో కలిపి మొత్తం రూ.16,383 కోట్లు ఖర్చవుతుందని ఈ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

త్వరలో వర్క్‌షాప్‌ల నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తొలి సభ్యత్వాన్ని పవన్ స్వీకరించారు. అనంతరం పార్టీ ముఖ్య నేతలకు సభ్యత్వ నమోదు పత్రాల్ని అందజేశారు. సభ్యత్వ నమోదు కోసం ప్రత్యేకంగా జనసేన ఐటి విభాగం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను పరిశీలించిన పవన్, సంతృప్తిని వ్యక్తం చేశారు. త్వరలో తెలుగు రాష్ట్రాల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకుముందు పార్టీ ముఖ్య నేతలతో పవన్ సమావేశమయ్యారు. పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ పటిష్టత, రెండు రాష్ట్రాల్లో పర్యటనలపై చర్చించారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలు, పార్టీ చేపట్టబోయే కార్యక్రమాలపై ఇటీవల నియమించిన స్పీకర్స్, కంటెంట్ రైటర్స్, అనలిస్ట్‌లు, సమన్వయకర్తలకు అవగాహన కల్పించేందుకుగాను ప్రత్యేకంగా విడతల వారీగా వర్క్‌షాపును నిర్వహించాలని నిర్ణయించారు. ఈ వర్క్‌షాపులను జనవరి మొదటి వారం లేదా రెండో వారంలో ప్రారంభించనున్నారు. పార్టీలో పని చేయడానికి స్వచ్ఛందంగా వచ్చిన వారిని కూడా ఈ వర్క్‌షాపులకు ఆహ్వానించనున్నారు. తొలుత మహిళలు, సీనియర్ సిటిజన్‌లకు ప్రత్యేకంగా ఒక వర్క్‌షాపును ఏర్పాటు



జనసేన పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న పవన్ కళ్యాణ్

చేయాలని నిర్ణయించారు. మరోవైపు గత పదేళ్లకు పైగా తనను అనుసరిస్తున్న వారితో గత మూడు రోజులుగా పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాల్ని వారికి వివరించారు. తమ దృష్టికి రాని ప్రజా సమస్యల్ని తెలుసుకోవడమే కాకుండా పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యాక్రమాలపైనా సుదీర్ఘంగా చర్చించారు.

మేలోగా పోలవరం డయాఫ్రం వాల్ పూర్తి

- జలవనరులశాఖ మంత్రి దేవినేని
- ప్రాజెక్టు ఆపేందుకు జగన్ కుతంత్రం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 2018 మే నాటికి డయాఫ్రం వాల్ పనుల్ని పూర్తి చేయనున్నట్లు జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ సాంకేతిక బృందం, పోలవరం కమిటీ కలసి ఒక నిర్ణయాన్ని తీసుకోనున్నట్లు కేంద్ర మంత్రి గడ్కరీ స్పష్టం చేశారని ఆయన పేర్కొన్నారు. విజయవాడ జలవనరులశాఖ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి కమిటీ చైర్మన్ పాండే ఆధ్వర్యంలో సాంకేతిక కమిటీ చేసిన సూచనలకు అనుగుణంగా పనుల్ని పూర్తిచేస్తామన్నారు. ఇప్పటికే ప్రాజెక్టు పనులు తది దశకు చేరుకుంటున్నాయన్నారు. పోలవరంపై ప్రజల్లో అపోహలు కలిగించేలా జాతీయ ట్రిబ్యునల్‌కు కొంతమంది వెళ్లారన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. 2018 నాటికి గ్రావిటీ ద్వారా నీరందించి, 2019 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. 2018లో మరింతగా పనులు చేపట్టి గోదావరి-పెన్నా నదుల అనుసంధానాన్ని పూర్తిచేస్తామన్నారు. జాతీయ హైడ్రో కార్పోరేషన్ నివేదిక ఆధారంగా ఎగువ కాఫర్ డ్యాం పనులు చేస్తామన్నారు. 42.5 మీటర్ల ఎత్తులో కాఫర్ డ్యాం నిర్మాణం ఉంటుందని, ఇప్పటికే 48 గేట్ల నిర్మాణం పూర్తయ్యాయన్నారు. స్పిల్‌వే, స్పిల్ ఛానల్ పనులు సాంకేతిక కమిటీ సూచనల మేరకు పూర్తిచేయనున్నట్లు చెప్పారు. ప్రతిపక్ష నేత జగన్మోహనరెడ్డి ప్రాజెక్టును అడ్డుకునే పనిలో ఇంకా ఉన్నారన్నారు. ఆయన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మృతి చెందిన రోజే పోలవరం టెండర్ల కోసం జగన్ ప్రయత్నించారని ఆరోపించారు. అయితే కాంగ్రెస్ నాయకులతో బేరం కుదరకపోవడం వల్లే ప్రాజెక్టు పనులు దక్కించుకోలేకపోయారన్నారు.

సుస్థిర ఇంధన సామర్థ్య సంవత్సరంగా 2018

- టెలికాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సుస్థిర ఇంధన సామర్థ్య సంవత్సరంగా 2018ని ప్రకటిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. విద్యుత్తు పొదుపులో రాష్ట్రం ఇప్పటికే ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలే ఇందుకు కారణమన్నారు. ఇంధన రంగానికి సంబంధించి ఆ శాఖ మంత్రి కళా వెంకట్రావు, ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ట్రాన్స్‌కో ఎండి విజయానంద్, ఇతరులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి ఇంటినీ ఇంధన పొదుపు గృహంగా మార్చాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్లల్లో స్టార్ గుర్తింపు ఉన్న ఉపకరణాల వినియోగాన్ని మరింత పెంచాలన్నారు. వీటిని నేరుగా, సులభ వాయిదాల పద్ధతిలో విక్రయించాలన్నారు. వీటి వినియోగంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వీటి వల్ల 30 నుంచి 40 శాతం మేర విద్యుత్తు ఆదా అవడంతోపాటు, పర్యావరణానికి హాని చేసే గ్రీన్ హౌస్ వాయువుల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. విద్యుత్తు రంగంలో ఎపి ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలు, నెడ్‌క్యాప్, సోలార్ పవర్ కార్పొరేషన్‌లు గత మూడేళ్ళలో 20 ప్రతిష్టాత్మక అవార్డుల్ని సాధించడంపై హర్షాన్ని వ్యక్తం చేశారు. అధికారులు, సిబ్బంది పనితీరుకు ఇది నిదర్శనమన్నారు. గ్రామ పంచాయతీల్లో 30 లక్షల ఎల్ఇడి వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో సరికొత్త రికార్డు సృష్టించాలన్నారు. ఏటా రూ.200 కోట్లు విలువైన 333 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఒక అంచనా ప్రకారం రూ.1,800 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఆదా చేయడంతో రూ.900 కోట్లు ఆదా అయ్యాయని, 4.5 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాల్ని తగ్గించగలిగామన్నారు. విద్యుత్తు రంగంలో అమెరికా వంటి అగ్రదేశాలు వినియోగిస్తున్న ఆధునిక మౌలిక సదుపాయాల్ని రాష్ట్రంలోనూ వినియోగిస్తున్నట్లు సిఎం పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు మావోయిస్టులు మృతి

ప్రజాశక్తి - చింతూరు (తూర్పుగోదావరి)



మావోయిస్టు మృతదేహం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా చింతగుప్ప పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. కోబ్రా దళాలు, సిఆర్‌పిఎఫ్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించగా మావోయిస్టులు ఎదురుపడ్డారని, దీంతో ఎదురుకాల్పులు జరిగాయని, ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందగా, ఒకరి మృతదేహం లభ్యమైందని సుక్మా ఎస్‌పి జితేంద్ర శుక్లా తెలిపారు. ఘటనా స్థలంలో 12 బోర్ రైఫిల్, 315 బుల్లెట్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆర్టీసి ఎండి పదవిపై ఉత్కంఠ

రేసులో ఠాకూర్, సవాంగ్ ?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాలకొండయ్యను డిజిపి పదవి వరించడంతో ఖాళీ అయిన ఆర్టీసి ఎండి పదవిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గతంలోనూ ఆర్టీసి ఎండిగా చేసిన వారికే డిజిపి పదవిని కట్టబెట్టడంతో అదో సెంటిమెంట్‌గా మారిపోయింది. దీంతో ఆర్టీసి ఎండి పదవిపై చాలా మంది ఆశలు పెంచుకుంటున్నారు. రాష్ట్ర విభజన తరువాత సాంబశివరావు ఆర్టీసి ఎండి నుంచి డిజిపి అయ్యి, తనదైన ముద్రను వేసుకున్నారు. ఇటీవల ఆర్టీసి ఎండిగా మాలకొండయ్య మృదు స్వభావంతో ఉంటూనే పనుల్ని చక్కబెట్టడంలో మంచి పేరు సాధించారు. ఆర్టీసి ఇప్పుడిప్పుడే నష్టాల్ని తగ్గించుకునే పనిలో ఉన్న నేపథ్యంలో సమర్థతతో పాటు అనుభవం ఉన్న వారికే ఆర్టీసి పగ్గాల్ని అప్పగించాలని ప్రభుత్వం కూడా యోచిస్తున్నట్లు సమాచారం. చాలా కాలంగా ఐపిఎస్ అధికారులే ఆర్టీసి ఎండిలుగా నియమితులవుతున్న నేపథ్యంలో ప్రస్తుతం కూడా రేసులో ఐపిఎస్ అధికారులే ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎసిబి డిజిగా ఉన్న ఆర్పీ ఠాకూర్, విజయవాడ నగర పోలీస్ కమిషనర్‌గా ఉన్న గౌతమ్ సవాంగ్ పేర్లు ఆర్టీసి ఎండి రేసులో ప్రధానంగా వినిపిస్తున్నాయి. సాంబశివరావు డిజిపిగా ఉండగానే ఠాకూర్, సవాంగ్ డిజిపి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు వార్తలొచ్చాయి.

మాలకొండయ్య డిజిపి కావడంతో, ఆర్టీసి ఎండి పదవితో సరిపెట్టుకుని తరువాతనైనా డిజిపి కావాలన్న దానిపై ఇద్దరూ ప్రధానంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఠాకూర్‌కు మంత్రి లోకేశ్ అండదండలు ఉన్నాయని, ఎలాగైనా ఆయనే ఆర్టీసి ఎండి అవుతారని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే గౌతమ్ సవాంగ్‌కు సిఎం చంద్రబాబు దగ్గర మంచి గుర్తింపే ఉందని, అయనను ఎండి చేసే అవకాశం ఉందని మరో చర్చ కూడా సాగుతోంది. ఆశావహులిద్దరూ కూడా 1986 బ్యాచ్‌కు చెందిన వారు కావడంతో ఆర్టీసి ఎండి పదవి ఎవరికి వరిస్తుందన్న విషయం చెప్పడం కష్టమేనని అధికార వర్గాలు చెప్పుకొస్తున్నాయి. ఏది ఏమైనా ఆర్టీసిని నష్టాల నుంచి బయటపడేసేం దుకు ఆర్టీసి పగ్గాల్ని ప్రభుత్వం ఎవరికి అప్పగిస్తుందో వేచి చూడాల్సిందే.

ప్రత్యేకం

అందని చంద్రన్న సంచార చికిత్స

- ప్రయివేటుకిచ్చి చేతులు దులుపుకున్న ప్రభుత్వం
- వాహనాల్లో మందుల కొరత
- మధుమేహ రోగులకూ మందుల్లేవు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కనీస వైద్య సదుపాయాలు అందించాలన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన చంద్రన్న సంచార చికిత్స సేవలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందడంలేదు. పేరుకు మాత్రం ఈ సేవలపై గొప్పలు చెప్పుకొంటున్న ప్రభుత్వం ప్రజలకు కావాల్సిన మందుల్ని అందించడంలో విఫలమవుతోంది. కనీసం మధుమేహం, బిపికి కూడా మాత్రల్ని ఈ శిబిరాల్లో ఇవ్వడంలేదని ఫిర్యాదులొస్తున్నాయి. మాతా శిశు మరణాల రేటు తగ్గించాలని, మహిళలు, చిన్నారుల్లో రక్త హీనత సమస్యను పాలద్రోలాలని ప్రభుత్వం చెబుతున్నా ఆమేరకు గర్భిణిలు, చిన్నారులకు అందించాల్సిన ఐరన్, ఫోలిక్‌యాసిడ్ మాత్రలు కూడా ఈ సంచార చికిత్స శిబిరాల్లో అందుబాటులో ఉండటంలేదు. మధుమేహ రోగులకు వారి షుగర్ లెవల్స్ ఆధారంగా మెట్‌ఫార్మిన్, గ్లిమెపిరైడ్ కాంబినేషన్‌తో రెండు రకాల మాత్రల్ని అందించాల్సి ఉంది. కాని వాటిలో కేవలం మెట్‌ఫార్మిన్ 500 ఎమ్‌జి మాత్రమే ఇస్తున్నారు. హైపర్ గ్లైసిమియా (ఎక్కువ షుగర్ లెవల్స్) ఉన్న వారికి తప్పనిసరిగా ఈ రెండు రకాల కాంబినేషన్ మందులివ్వాలి. కాని చంద్రన్న సంచార సేవల శిబిరాలకు సరఫరా చేసే మందుల్లో మెట్‌ఫార్మిన్ మాత్రమే ఇస్తున్నారు. గ్లిమెపిరైడ్ 2 ఎంజి టాబ్లెట్లు సరిపడా సరఫరా కావడంలేదని,అందువల్లే ఇవ్వలేకపోతున్నామని



ఉండవల్లిలో నిర్వహిస్తున్న చంద్రన్న సంచార చికిత్స సేవలు

సిబ్బంది చెబుతున్నారు. అలాగే రక్తపోటు ఉన్న వారికి తీవ్రతను బట్టి ఎటినలాల్ మాత్రలు 5 ఎంజి నుంచి 50 ఎంజి మోతాదు వరకు రోగులకు ఇస్తారు. కాని 104 వాహనాల్లో 50 ఎంజి మోతాదుతో ఉండే మాత్రల్ని మాత్రమే అందిస్తున్నారు. 2ఎంజి వాడాల్సిన తమకు 5ఎంజి మాత్రలిచ్చి ముక్కలు చేసి వాడుకోమంటున్నారని, చాలా చిన్న మాత్రను ముక్కలు చేయడం సాధ్యం కావడంలేదని రోగులు చెబుతున్నారు. దీంతో కొందరు రోగులు చేసేదిలేక బయట మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసుకుంటున్నారు. ఎనలాప్రిల్ వంటి మందుల్ని హైబిపి రోగులకు ఇవ్వాల్సి ఉండగా వాటిని కూడా చంద్రన్న సంచార వాహనాలకు పంపిణీ చేయడంలేదు. దీంతో ఉన్న మందులతోనే సరిపెట్టుకోవాలని సిబ్బంది సూచిస్తున్నారు. బిపికి ఇచ్చే కాంబినేషన్ మందులు కూడా అందుబాటులో ఉండడం లేదు. గతంలో చంద్రన్న సంచార సేవల నిర్వహణ బాధ్యత ఆయా జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ ఆధీనంలో ఉండేవి. ఆ తర్వాత ప్రయివేటు సంస్థలకు ఈ బాధ్యత అప్పగించినప్పటి నుంచీ వైద్య సేవలు నామమాత్రంగా అందుతున్నాయి. గతేడాది ఆగస్టులో పిరామిల్ స్వాస్థ్య మేనేజ్‌మెంట్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (పిఎస్‌ఎమ్‌ఆర్ఐ) సంస్థకు ప్రభుత్వం చంద్రన్న సంచార చికిత్స నిర్వహణ బాధ్యతను అప్పగించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 277 చంద్రన్న సంచార చికిత్స వాహనాలున్నాయి. ఒక్కోవాహనానికి నిర్వహణ, ఉద్యోగుల వేతనాలు కలిపి నెలకు రూ.2.43 లక్షలు చొప్పున రూ 6.73 కోట్లు ప్రభుత్వం పిరామల్ సంస్థకు చెల్లిస్తోంది. అంటే ఏడాదికి రూ 80.76 కోట్లు ఇస్తోంది. గతంలో ప్రభుత్వమే ఈ సేవలు నిర్వహించినపుడు ఒక్కో వాహనానికి రూ 1.40 లక్షలు చొప్పున నెలకు రూ 3.87 కోట్లు మాత్రమే వెచ్చించేది. అంటే ఏడాదికి 46.44 కోట్లు ఖర్చు చేసేది. పిరామిల్‌కు ఇచ్చినప్పటి నుంచి ఏడాదికి రూ 34.32 కోట్లు అదనంగా ఆ సంస్థకు చెల్లిస్తోంది.

వాహనాల్లో వైద్యులు లేరు

ప్రాథమిక చికిత్సకు అవసరమయ్యే మందులు, వైద్య పరికరాలు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ మాత్రమే గతంలో ఈ వాహనాల్లో ఉండేవారు. కేంద్రం నుంచి నిధులు రావాలంటే వాహనాల్లో వైద్యులు తప్పనిసరి. దీంతో వీటి నిర్వహణను ప్రయివేటు సంస్థకు అప్పగించినా వాహనాల్లో సరిపడినన్ని మందులు కానీ, వైద్యులు కానీ అందుబాటులో లేకపోవడం గమనార్హం. 205 వాహనాల్లోనే ప్రస్తుతం వైద్యులున్నారు. ఇంకా 72 వాహనాల్లో వైద్యులు అందుబాటులో లేరు. దీంతో ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు ఈ సేవల్ని అప్పగించి ఇక సంబంధంలేనట్లు చేతులు దులుపుకుందనే విమర్శలొస్తున్నాయి.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకల్ని పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మేరుగు నాగార్జున కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఈ ఏడాదైనా అబద్ధాలు ఆడడం మాని, సుపరిపాలన అందించాలని కోరారు. ఈ వేడుకల్లో మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, మేడా రమేష్ ప్రభృతులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని పట్టించుకోని బిజెపి: సిపిఐ నారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోవడం లేదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. దక్షిణాదిలో బిజెపికి ఓట్లు రావన్న ఉద్దేశంతోనే పట్టించుకోవడం లేదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలను పట్టించుకోకుండా ఇతర రాష్ట్రాలకు మాత్రం కేంద్రం వేలు, లక్షల కోట్లలో సాయం చేస్తోందన్నారు. పోలవరం విషయంలో కేంద్ర,రాష్ట్రప్రభుత్వాల మధ్య రాజకీయంగా విభేధాలుండడం వల్లే పరిష్కారానికి నోచుకోవడం లేదని, దీనిపై జోక్యం చేసుకోవాలని ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోడీకి స్వయంగా వివరించామన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.33వేల కోట్లు చెల్లించాల్సి ఉన్నందున 2019 నాటికి పోలవరాన్ని పూర్తిచేయడం సాధ్యం కాదన్న విషయాన్ని మోడీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. రాజకీయ పోరాటం ద్వారానే పోలవరం పూర్తవుతుందన్నారు. రాష్ట్రానికి చెందిన వెంకయ్యానాయుడు ఉప రాష్ట్రపతిగా ఉన్నప్పటికీ రాష్ట్రప్రయోజనాల్ని సాధించుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రానికి న్యాయం చేస్తారో లేదో వెంకయ్య నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏపీని అతలాకుతలం చేయాలని బిజెపి కంకణం కట్టుకుందని, దీనికి మోడీనే స్వయంగా దిశానిర్దేశం చేస్తున్నారని విమర్శించారు. బిజెపిని నిలదీసే దమ్ము టిడిపికి లేదన్నారు. ఎఫ్‌ఆర్‌డిఐ చట్టం అమల్లోకి వస్తే సామాన్యులకు కష్టాలు తప్పవన్నారు. బ్యాంకుల నుంచి వేలాది కోట్లు రుణాలు ఎగ్గొట్టే కార్పొరేట్లను కాపాడేవిధంగా ఈ బిల్లును తీసుకొస్తున్నారన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు ఫార్మా కంపెనీల సెగ

గంగపుత్రులకు ఫార్మా కంపెనీల సెగ తగులుతోంది. సముద్ర తీరాన ఏర్పాటైన భారీ మందుల పరిశ్రమలు వాటి వ్యర్థాలను యథేచ్ఛగా సముద్రంలోకి వదిలేస్తుండటంతో మత్స్య సంపద నిర్వీర్యమవుతోంది. ఫలితంగా సముద్రంలో చేపల వేటపై ఆధారపడిన మత్స్యకారులు ఉపాధికి దూరమై, బతుకు భారమై వలసపోతున్నారు. విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో మత్స్యకార గ్రామాల్లో పరిస్థితి ఇది.

- శుద్ధి చేయకుండా నేరుగా సముద్రంలోకి కాలుష్య జలాలు
- అంతరించిపోతున్న మత్స్య సంపద
- ఉపాధి కరువై మత్స్యకారుల వలస
- ఖాళీ అవుతున్న గ్రామాలు


వేట లేక ఖాళీగా ఉన్న మత్స్యకారులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సముద్రంలో నేరుగా ఫార్మా వ్యర్థాలు

పూసపాటిరేగ మండలంలో సుమారు పది భారీ మందుల పరిశ్రమలున్నాయి. వాటిలో మైలాన్, అరబిందో, ఎస్ఎంఎస్, పరాకా, ఎబలర్, వేదా బయోఫ్యూయల్ తదితరమైనవి ఉన్నాయి. పరిశ్రమల వ్యర్థాలు నేరుగా సముద్రంలోకి వదులుతుండటంతో తీరం కలుషితమవుతోంది. దీంతో సముద్ర తీరానికి దగ్గరగా చేపలు రావడం లేదని, ఒకవేళ వచ్చినా చనిపోతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమల నుంచి విడుదలైన వ్యర్థాలను వాటర్ ట్రీట్‌మెంటు ద్వారా శుద్ధి చేసి సముద్రంలో విడిచి పెట్టాలన్నది నిబంధన. ఇలా చేసేందుకు పరిశ్రమల యాజమాన్యాలకు కొంత ఖర్చవుతుంది. ఆ డబ్బులను మిగుల్చుకోవడానికి నిబంధనలు పాటించకుండా వ్యర్థ జలాలను నేరుగా సముద్రంలోకి వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. యాజమాన్యాలు ఇచ్చే తాయిలాలకు కక్కుర్తిపడి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఖాళీ అవుతున్న గ్రామాలు

మత్స్యకార గ్రామాలు వలసలతో ఖాళీ అవుతున్నాయి. పూసపాటిరేగ మండలం బర్రిపేట, చింతపల్లి, తిప్పలవలస, తమ్మయ్యపాలెం, కోనాడ, డిఎపేట గ్రామాల నుంచి వలసల జోరు పెరిగింది. భోగాపురం మండలం మొక్కాం, కొండరాజుపేట, చోడిపల్లిపేట గ్రామంలో 40 శాతానికిపైగా మత్స్యకార కుటుంబాలు ఖాళీ అయ్యాయి. బర్రిపేటలో 315 కుటుంబాలకుగానూ దాదాపుగా 150 కుటుంబాలకుపైగా వలసపోయాయి. ఈ గ్రామానికి చెందిన రాయత రాము తన భార్య పైడమ్మను ఊరులో వదిలేసి గుజరాత్‌లోని హీరావతికి వలస వెళ్లాడు. రాయతి చిన్నప్పన్న, వాసపిల్లి అప్పన్న, వాసపల్లి పైడయ్య, మైలిపిలి అప్పలస్వామి కూడా హీరావతికి వలసపోయారు. మేడ నీలయ్య తన భార్య ధానమ్మ, నలుగురు పిల్లలను వదిలేసి విశాఖ వలస వెళ్లాడు. కర్నాటకు చెందిన మంగళూరు, గుజరాత్‌కు చెందిన పోరుబందరు, ముంబయి వంటి ప్రాంతాలకు అత్యధిక కుటుంబాలు వలసపోయాయి. భార్యా పిల్లలను, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఇంటి దగ్గర వదిలేసి కొంతమంది వెళితే, మరికొన్ని కుటుంబాలే ఏకంగా వలస వెళ్లిపోయాయి. ఫార్మా కంపెనీలను కట్టడి చేయకపోతే భవిష్యత్తులో మత్స్యకార గ్రామాలన్నీ పూర్తిగా ఖాళీ అయ్యే ప్రమాదముంది.

- పూసపాటిరేగ మండలం బర్రిపేట గ్రామానికి చెందిన కొర్లమ్మ భర్త పోలయ్య వలసపోయాడు. దీంతో, తన ఇద్దరి పిల్లలను అంటి పెట్టుకుని కొర్లమ్మ ఇంటికే పరిమితమైంది. తీరంలో వేట సాగక ఉపాధి లేక తన భర్త వలసపోయినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. భర్త తిరిగి వచ్చేందుకు మరో ఎనిమిది నెలలు పడుతుందని తెలిపింది.
- అదే గ్రామానికి చెందిన మహిళ మైలిపిల్లి చిన్నతల్లి భర్త బుల్లోడు కర్నాటకలోని హిరావతికి వలస వెళ్లాడు. అక్కడ ఎనిమిది నెలలు పని చేసి వేట నిషేధ సమయాల్లో ఇంటికి తిరిగొస్తాడు. తన ముగ్గురు చిన్న పిల్లలతోనే చిన్నతల్లి గ్రామంలో ఉంటోంది.
- ఈ ఒక్క గ్రామంలోనే 150 కుటుంబాలకుపైగా మత్స్యకారులు వలసజీవులుగా మారిపోయారంటే తీరంలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.
- విజయనగరం జిల్లా పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 19 మత్స్యకార గ్రామాలున్నాయి. వాటిలో సుమారు 15 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వీరి జీవనోపాధికి సముద్రమే ఒకప్పుడు ఆధారం. కానీ తీరం వెంబడి భారీ ఫార్మా కంపెనీలు ఏర్పాటైన తర్వాత వాటి వ్యర్థ జలాలతో సముద్ర జలాలు కలుషితమై చేపల ఉత్పత్తి తగ్గిపోయింది. గతంలో తీరం నుంచి పది కిలోమీటర్ల దూరం సముద్రంలోకి వేటకు వెళితే మత్స్యకారుల ఉపాధికి డోకా ఉండేది కాదు. ప్రస్తుతం 20 కిలోమీటర్లు వెళ్లినా చేపలు దొరకని పరిస్థితి. రోజుల తరబడి సముద్రంలో ఉండి వేటాడినా అరకొర చేపలు దొరకడం గగనంగా మారింది. ఈ నేపథ్యంలో మత్స్యకారులు గ్రామాలను విడిచి విశాఖ, కర్నాటక, ముంబయి, గుజరాత్ వంటి ప్రాంతాలకు వలసపోవాల్సిన పరిస్థితి ఎదురైంది.

ఉపాధి లేక వలసలు



చేపల వేట కష్టమవడం, ఉపాధి లేకపోవడంతో వలసపోతున్నారు. దీనికి తోడు విశాఖకు చెందిన షిప్పింగ్ బోట్లు వచ్చి ఉన్న చేపలనూ పట్టేస్తుండటంతో మాకు చేపలు దొరకడం లేదు. రోజంతా కష్టపడినా రూ.300 కూడా రాని పరిస్థితి ఉంది. ఫలితంగా గ్రామాలను విడిచిపెట్టిపోతున్నారు.

-ఆకుల రాము, మత్స్యకారుడు

బతకలేక వలస



గ్రామంలో బతకలేక వలసపోతున్నాం. ఏటా మత్స్య సంపద తగ్గిపోతోంది. చేపల వేటకు వెళ్తే రోజు కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు. ఇళ్లు గడవక పిల్లాపాపలను, వృద్ధులను వదిలేసి హీరావతి, ముంబయి వంటి ప్రాంతాలకు వలసవెళ్లి పెద్ద పెద్ద కాంట్రాక్టుల వద్ద కూలికి పని చేయాల్సి వస్తోంది.

-సూరాడ కొర్లయ్య, మత్స్యకారుడు

ప్రభుత్వ భృతి అందడం లేదు



వేట నిషేధ సమయాల్లో సముద్రంలోకి వేటకు వెళ్లనీయకుండా ప్రభుత్వం అడ్డుకుంటోంది. వేట నిషేధ భృతి మాత్రం సక్రమంగా ఇవ్వడం లేదు. అడిగితే బ్యాంకు అకౌంట్లలో పడుతున్నాయని అధికారులు అంటున్నారు. అర్హులైన వారికి వాస్తవానికి భృతి అందడం లేదు.

-రాయతి అప్పయ్యమ్మ, మత్స్యకార మహిళ



నష్టాల బాటలో మామిడి రైతు

- తగ్గుతున్న విస్తీర్ణం
- ఇతర పంటలవైపు మొగ్గు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

శీతాకాలం వచ్చిందంటే తెల్లని పూత, పిందెలతో మామిడి చెట్లు కళకళలాడేవి. అలాంటిది మూడేళ్ల నుంచి పూత తగ్గిపోవటం, తెగుళ్లు పెరిగిపోవటంతో మామిడి రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. మామిడి తోటలను తెగనరికి జామ, నిమ్మ, బొప్పాయి, ఆయిల్‌ఫాం తోటల వైపు మొగ్గు చూపుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే నోరూరించే బంగినపల్లి, చిన్నరసాలు ప్రియమవ్వటానికి ఎంతో సమయం పట్టదని విశ్లేషకులు చెపుతున్నారు. కృష్ణాజిల్లాలోని నూజివీడు, విజయవాడ రెవెన్యూ డివిజన్లలో 1.50 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలున్నాయి. నూజివీడు బంగినపల్లి, చిన్నరసాలకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. అయినా దిగుబడులు తగ్గటం, ఏటా నష్టాలను చవిచూడాల్సి వస్తుండటంతో రైతులు ఇతర పంటల వైపు ఆసక్తి చూపుతున్నారు. గడిచిన మూడేళ్లలో నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు, రెడ్డిగూడెం మండలాలకు చెందిన 30 వేల ఎకరాల మామిడి తోటలను ధ్వంసం చేశారు. విజయవాడ రూరల్, గన్నవరం, ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, మైలవరం మండలాలకు చెందిన మరో 15 వేల ఎకరాలను వివిధ అవసరాల నిమిత్తం కొట్టివేయటం జరిగింది.

తోటలు ముదరటమే దిగుబడులు తగ్గడానికి కారణం

తోటలు ముదరటం, వాతావరణం అనుకూలించకపోవటం మామిడి దిగుబడులు తగ్గటానికి కారణం. గతేడాది తేనెమంచు, పేనుమంగు తెగులు ఆశించటంతో 35 నుంచి 40 శాతం వరకూ దిగుబడులు తగ్గిపోయాయి. ఈ ఏడాది మామిడి పూత ఆశాజనకంగా కనిపించటం లేదు. పాత చెట్లను కొట్టేసి కొత్త వంగడాలను తిరిగి నాటితే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లభించదు. నూజివీడు డివిజన్‌లోని ఎనిమిది మండలాల్లో నూజివీడు డివిజన్‌లో 85 వేల ఎకరాల్లో మామిడి తోటలుండాలి. ఇటీవల రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహించిన లెక్కల్లో 70 వేల ఎకరాల్లోనే మామిడి తోటలున్నట్లు నిర్ధారించారు.

- కంతేటి అజయ్‌బాబు హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్, నూజివీడు

రాబోయే ఐదేళ్లలో 50 శాతం విస్తీర్ణం తగ్గటం ఖాయం

రాబోయే అయిదేళ్లలో 50 శాతం పైగా మామిడి తోటల విస్తీర్ణం తగ్గడం ఖాయం. పంట దిగుబడి తగ్గటం, గిట్టుబాటు ధర లభించకపోవటం, భూముల ధరలు పెరగటం, రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవటం దీనిని ప్రధాన కారణాలు. మోతాదుకు మించి రసాయనాలు వినియోగిస్తుండటంతో కొనుగోలు దారులు మహారాష్ట్ర మార్కెట్‌కు తరలిపోతున్నారు. స్థానిక వ్యాపారుల మాయాజాలం రైతుకు గిట్టుబాటు ధర రాకుండా అడ్డుకుంటోంది.

- వి. రాజారామ్, మామిడి ఉత్పత్తిదారుడు, విజయవాడ

బళ్ళారి రాఘవ జీవిత విశేషాల
ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం


అనంతపురంలో బళ్ళారి రాఘవ జీవిత విశేషాల ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నారాయణ స్వామి తదితరులు.

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కళా ప్రపూర్ణ బళ్ళారి రాఘవ జీవిత విశేషాలను తెలియజేస్తూ రూపొందించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆదివారం అనంతపురంలో లలిత కళాపరిషత్ కార్యదర్శి నారాయణస్వామి ఆవిష్కరించారు.

బళ్లారి రాఘవ రాష్ట్రస్థాయి ప్రజాసాంస్కృతిక ఉత్సవాలు' ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో అనంతపురంలో ఈనెల 2,3,4 తేదీల్లో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి ఉత్సవాల ఆహ్వాన సంఘం అధ్యక్షులు గోవిందరాజులు అధ్యక్షతన వహించారు. నారాయణస్వామి మాట్లాడుతూ.. ప్రజానాట్య మండలి బళ్ళారి రాఘవ చాలా అరుదైన చిత్రాలను సేకరించి ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. ప్రస్తుత సమాజానికి బళ్ళారి రాఘవ కళా సేవలు తెలిపేందుకు నిర్వహిస్తున్న సాంస్కృతిక ఉత్సవాలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, ప్రముఖ రచయిత డాక్టర్ రమేష్ నారాయణ, ఆకాశవాణి ప్రొగ్రాం డైరెక్టర్ శ్యామ్‌సుందర్ శాస్త్రి రచయితలు జెన్నె ఆనంద్, జూటూరి షరీఫ్, అస్లాం బాషా, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాషా, యాదగిరి, ఉపాధ్యక్షులు వీరబాబు, ఎల్‌కెపి. రాము, జానపద వృత్తి కళాకారుల సంఘం నాయకులు సుబ్బారెడ్డి, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.నల్లప్ప, సిపిఎం నగర కార్యదర్శి నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

దశల వారీగా ప్రభుత్వ భవనాల నిర్మాణం

ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు


శంకుస్థాపన చేస్తున్న మంత్రి యనమల రామకృష్ణుడు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఆర్థిక సంస్కరణల్లో భాగంగా రాష్ట్రంలో రూ.80 కోట్లతో జిల్లా కేంద్రాల్లో ఆర్థిక శాఖ కార్యాలయ భవన సముదాయాలను, 66 సబ్ ట్రెజరీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్టు ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కోర్టు కాంపౌండ్ సమీపంలో రూ.10 కోట్లతో నిర్మించనున్న ఆర్థిక శాఖ కార్యాలయాల భవన సముదాయం నిర్మాణానికి యనమల ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లో వేర్వేరుగా ఉన్న ఆర్థిక శాఖ భవనాలన్నింటినీ ఒకేచోట నిర్మించడం వల్ల ఆర్థిక పరమైన లావాదేవీలు సులభతరమవుతాయని చెప్పారు, కాకినాడలో నిర్మిస్తున్న భవనంలో జిల్లా ట్రెజరీ, ఆడిట్, ఎపిజిఎల్ఐ, అస్టిటెంట్ పిఒఒ కార్యాలయాలు ఒకేచోట ఉంటాయని తెలిపారు. ఈ భవన నిర్మాణం ఏడాదిలో పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో సొంత భవనాలు లేక అద్దెభవనాల్లో ఆర్థికశాఖ కార్యాలయాలు కొనసాగడం వల్ల ఖర్చు అధికమవుతోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికశాఖ కార్యాలయాలను దశలవారీగా నిర్మిస్తోందన్నారు. భవనాలన్నింటినీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాపంగా ఆర్థికశాఖ కార్యాలయాల్లో 40 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బిల్లు బకాయిలు రూ.10 వేల కోట్లకుపైగా చెల్లించామన్నారు.

పిల్లల అభిరుచులకు తగ్గట్టుగా పుస్తకాల ముద్రణ

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రావి శారద

ప్రజాశక్తి- మొగల్రాజపురం (విజయవాడ)

పిల్లల అభిరుచులకు అనుగుణంగా పిల్లల పుస్తకాలు ముద్రించాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రావి శారద అన్నారు. విజయవాడ ప్రజాశక్తి నగర్‌లోని శిఖర స్కూల్‌లో ఆదివారం అమరావతి పబ్లికేషన్స్ 'బాలల నీతి కథా స్రవంతి' ఆవిష్కరణోత్సవం జరిగింది. అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో శారద మాట్లాడారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు చిన్న నాటి నుంచే పుస్తకాలను చదవడం నేర్పించాలన్నారు. మాస్టర్ డిగ్రీలు చదివిన వారు కూడా తెలుగు చదవడానికి ఇబ్బందులు పడుతుండటం చూస్తుంటే ఆవేదన కలుగుతుందన్నారు. చిన్నారుల పుస్తకాలను 50 పేజీలకు మించకుండా, ఆకర్షణీయంగా ముద్రించి తక్కువ ధరలకు అందించాలని కోరారు. పిల్లలకు సంబంధించి ఎలాంటి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయో సేకరించే పనిలో ఉన్నామని పేర్కొన్నారు. మూడేళ్లుగా ఉపయోగంలో లేని పుస్తకాలను సేకరించి వాటి అవసరమున్న వారికి అందజేస్తున్నామన్నారు. ఈ విధంగా సుమారు 16 వందల పుస్తకాలను సేకరించామని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అలపర్తి వెంటక సుబ్బారావు మాట్లాడుతూ.. బాలల కథలను తక్కువగా, గేయ రచనలు ఎక్కువ రాసినట్లు తెలిపారు. తన కథలకు పుస్తక రూపం తీసుకువచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు.

ఫిబ్రవరి 16 నుంచి ఎయు దూరవిద్య పీజీ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

ఆంధ్రా యూనివర్సిటీ (ఎయు) దూరవిద్య అందిస్తున్న ఎంఎ ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఎకనామిక్స్ హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్టేషన్, సోషియాలజీ, సైకాలజీ, ఫిలాసఫీ, ఎమ్‌కాం, ఎంఎ, ఎమ్మెస్సీ మ్యాథ్స్, ఎంబిఎ, ఎల్ఎల్ఎం అండ్ ఎమ్మెస్సీ ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ కోర్సుల సప్లిమెంటరీ, స్పెషల్ డ్రైవ్ పరీక్షలు ఫిబ్రవరి 16 నుంచి నిర్వహించనున్నట్లు దూరవిద్య సంచాలకులు ఆచార్య బి.మోహిని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను జనవరి 31లోగా అందించాలన్నారు. అపరాధ రుసుముతో ఫిబ్రవరి 7వ తేదీలోగా పంపవచ్చని పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, విశాఖపట్నం ఎయు దూరవిద్య కేంద్రం, కాకినాడ అచ్చంపేట జంక్షన్‌లోని ఎంఎస్ఎన్ పీజీ సెంటర్, హైదరాబాద్‌లోని ఆర్జీకేడియా కళాశాల, కొత్తవలసలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎంఎ సైకాలజీ, ఎమ్మెస్సీ సైన్స్ కోర్సులకు ఎయు దూరవిద్య కేంద్రంలో మాత్రమే పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్ పరీక్షలు 2004-05 నుంచి 2011-12 సంవత్సరాలలో ప్రవేశాలు పొందిన వారికి నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఎయు www.andhrauniversity.edu.in/webnews dephp వెబ్‌సైట్‌ను, 0225818, 99634 74717, 0891-2844164, 28441432, 2754966, 2844142 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

మార్చి 1 నుంచి ఎయు డిగ్రీ పరీక్షలు

ప్రజాక్తి-మద్దిలపాలెం, విశాఖ

ఆంధ్రా యూనివర్శిటీలో 2009-10 నుంచి 2014-15 వరకు బి.ఎ, బి.కాం, బి.ఎస్సి, (హోంసైన్స్ అండ్ ఫుడ్ టెక్నాలజీ), బిబిఎం. బిసిఎ, బిహెచ్ఎం అండ్ సిటి కోర్సులలో ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు సప్లిమెంటరీ (థియరీ, ప్రాక్టికల్స్) పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కంట్రోలర్ ఆఫ్ ఎగామినేషన్స్ ఎస్‌వి.సుధాకరరెడ్డి తెలిపారు. ఇందుకోసం అభ్యర్థులు జనవరి 1 నుంచి 9వ తేదీ మధ్య తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జనవరి 11 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్ చలానాలు, నెట్ బ్యాంకింగ్ డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. జనవరి 24 నుంచి 30వ తేదీ వరకు రూ.2వేలు అపరాధ రుసుముతో ఫీజు చెల్లించవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు www.aucoe.info వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ప్రత్యేకం

కూలి బకాయి రూ.65 కోట్లు

- 2 లక్షల మంది 9 నెలలుగా ఎదురుచూపు
- విడుదల చేసింది రూ.35 కోట్లే

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసిన కూలీలు తొమ్మిది నెలలుగా కూలి డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఈ ఏడాది 3,64,402 మందికి ఉపాధి పనులు కల్పించారు. వీరిలో సుమారు 2 లక్షల మందికి తొమ్మిది నెలలుగా కూలి డబ్బులు చెల్లించలేదు. జిల్లాలో రూ.65 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం రూ.35 కోట్లే విడుదల చేసింది.

తూర్పుగోదావరి జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 15,14,224 మందికి వ్యక్తిగత జాబ్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఏడాది మరో 26,037 మందికి జాబ్ కార్డులను మంజూరు చేసింది. ఇప్పటివరకు 3,64,402 మందికి జిల్లాలో ఉపాధి పనులు కల్పించింది. వీరిలో సుమారు రెండు లక్షల మందికి రూ.65 కోట్లు కూలిగా చెల్లించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకూ చిల్లిగవ్వ కూడా చెల్లించలేదు. తమకు కూలి డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారని పేదలు ఉద్యోగులను అడుగుతుంటే, కేంద్రం నుంచి నిధులు విడుదల కాలేదన్నారు. అవి విడుదలయ్యాక ఇస్తామంటూ చెబుతూ వచ్చింది. కూలి డబ్బులు వెంటనే చెల్లించకపోవడంతో వేలాదిమంది కూలీలు ఖరీఫ్‌లో వరి కోతలు, రబీలో ఊడ్పులు, భవన నిర్మాణాల వంటి వివిధ పనులకు వెళ్తున్నారు. మన్యంలోను ఉపాధి కూలీలకు సొమ్ములు చెల్లించకపోవడంతో కూలి డబ్బుల కోసం ఆదివాసీలు నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. తొమ్మిది నెలలుగా ప్రభుత్వం అదిగో ఇదిగో అంటూ కాలక్షేపం చేసింది. జిల్లాలో రూ.65 కోట్లు కూలీలకు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం రూ.35 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకుంది. దీంతో తమకు రావాల్సిన కూలి డబ్బులు పూర్తిగా దక్కుతాయో లేదోనని కూలీలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో రబీ పనులు మొదలయ్యాయి. ఉపాధి పనుల్లో రోజు కూలి సరాసరి రూ.162.60 ఉంది. ఊడ్పులు, ఇతర పనులకు వెళ్తే రోజు కూలి రూ.250 నుంచి రూ.300 వరకు ఉంది. ఉపాధి హామీ పథకంలో కూలి డబ్బులు చెల్లించనందున వేలాదిమంది కూలీలు ప్రస్తుతం రబీలో వ్యవసాయ పనులు, భవన నిర్మాణాలు, ఇతర పనులకు వెళ్తున్నారు. గతంలో పోస్టాఫీసుల ద్వారా కూలి డబ్బులు చెల్లించేవారు. ఆ తర్వాత బ్యాంకు ఖాతాలకు జమ చేయడం ప్రారంభించారు. బ్యాంకులతో తమకు చాలా ఇబ్బందులు ఉన్నందున పాత పద్ధతి ప్రకారం తమకు పోస్టాఫీసుల ద్వారా డబ్బు చెలించాలని కూలీలు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదు.మన్యంలోని 120 గ్రామ పంచాయితీల్లో 1,42,344 మందికి జాబ్ కార్డులు మంజూరు చేశారు. వీరిలో 62,898 మందికి ఈ ఏడాది ఉపాధి పనులు కల్పించారు. రంపచోడవరం మండలంలో రూ.2.20 కోట్లు ఉపాధి బకాయిలు చెల్లించాల్సి ఉంది. చింతూరు మండలంలో రూ.1.90 కోట్లు బకాయి చెల్లించాల్సి ఉంది. సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లో ఉపాధి కూలీలకు సుమారు తొమ్మిది నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. కొందరికి 4 నెలలు, మరికొందరికి 6 నెలల నుంచి వేతనాలు చెల్లించడంలేదు. దీంతో కూలీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. రాజానగరం మండలంలో రూ.1.45 కోట్ల బకాయి సొమ్ములను ప్రభుత్వం కూలీలకు చెల్లించాల్సి ఉంది. కోరుకొండ మండలంలో రూ.1.26 కోట్లు, సీతానగరం మండలంలో రూ.54 లక్షలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం రూ.35 కోట్లు మంజూరు చేసింది. ఈ సొమ్ము ఎలా సర్దుబాటు చేయాలో తెలియక అధికారులు తలపట్టుకున్నారు.

సంక్షిప్తం

రైతులకు 24 గంటలూ విద్యుత్ సరఫరా

రణస్థలం :రాష్ట్రంలో ఉన్న రైతులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళావెంకటరావు అన్నారు. మండలంలోని పిషిణి గ్రామంలో రూ.1.45 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం నెలివాడ, పెద్దపిషిణి, చిన్నపిషిణి గ్రామాల్లో రూ.1.9 కోట్ల వ్యయంతో నిర్మించిన వాటర్ ట్యాంకులు ప్రారంభించారు. అలాగే భావరాజుపాలెంలో సెల్‌ఫోన్‌తో ఆపరేటింగ్ చేసే ఐదు నక్షత్రాల మోటార్లను ప్రారంభించి రైతులకు అంకితం చేశారు.

రుగడలో గజరాజుల సంచారం

హిరమండలం: శ్రీకాకుళం జిల్లా రుగడ గ్రామ పంచాయతీ పరిధిలో గజరాజులు సంచరిస్తూ పలు పంటలను నాశనం చేస్తుండడంతో ప్రజలు భీతిల్లుతున్నారు. రెండు రోజుల క్రితం నూర్చిన ధాన్యాన్ని చెల్లాచెదురుగా చేశాయని రైతులు వాపోతున్నారు. ఆదివారం ఉదయం అంగూరు నర్సింహులుకు చెందిన అరటితోటలను నాశనం చేశాయని సంబంధిత గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

సమానపనికి సమాన వేతనమెప్పుడు?

వీరఘట్టం : సమాన పనికి సమాన వేతనం అందించాలని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ తరహాలో విలీనం చేయాలనీ, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వేతనాలు చెల్లించాలనీ, థర్డ్‌పార్టీని తీసివేసి ఆ శాఖే నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఈ నెల 27న పెద్ద ఎత్తున సమ్మె చేయనున్నామని హెచ్చరించారు. అలాగే ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, మెడికల్ అలవెన్స్ కూడా అందజేయాలని డిమాండ్ చేశారు.

S & D

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

అక్షరం

4 | విజయవాడ | సోమవారం 1 జనవరి 2018



'వృద్ధ జగతి సమాధిపై
సమధర్మం ప్రభవించును
నిద్దుర చీకటి వెలుపల
వేకువ మెలకువ పుట్టును.. '

– ఆవంత్స సోమసుందర్



అక్షరార్పణ

కాలపు రెక్కను అలా తెరిచాను అంతే
నా రెప్పనంటుకున్న దృశ్యాలెన్నో
ఒక్కొక్కటీ అలల్లా ఎగిరి పడుతున్నాయి

ఏం చూశావు? ఏం చేశావు? ఏం మోశావు?
ఏ ప్రశ్నకీ సమాధానం రాయలేని బలహీన విద్యార్థిని
తన పనిలో తాను పడిపోయిన ప్రవాహాన్ని
చేతుల్లోకి తీసుకోపోయా ఏం తెలుస్తుంది నాకు!
జారిపోయిన చేపపిల్ల లాంటి జీవన ఘటనలు తప్ప
నన్ను రోజూ మోస్తున్న నేలపై ప్రణమిల్లి
ప్రాధేయపడ్డా కొద్దిగానైనా చెబుతుందేమోనని
నివసిస్తున్న గదిగోడలను ఓరగా చూశా
అవి దాచుకున్న జ్ఞాపకాలేమైనా దొరకొచ్చని
దశాబ్దాలుగా నాతోనే నిశ్శబ్దంగా అల్మారాలో
చలిస్తున్న పుస్తకాల పాదాలు కడిగి తలపై చల్లుకున్నా
ఒక్క గతానుగత సారాన్ని మెదడు పొరలపై
విప్పుతుందేమోనని...

చేతిని ముఖంపై పెట్టి తడుముతుంటే
ఖర్చు చేసిన ఖాతాలోని ఖాళీతనపు గరకు ముడత
ముదిమి తంబూరలా నోరు తెరిచింది
వెతుకుతూ వెతుకుతూ కుతకుత ఉడుకుతూనే ఉన్నాను
దేనికోసమో ఎందుకోసమో ఎవరికోసమో...
వెతకటం ఆపలేదు అదే బతుకయింది!

బతుకంటే కాలపు ల్యాగలకు తగిలించిన
చక్రాలుగా దొర్లిపోవటమా !
బిగించిన పద్యాలకు ఛందస్సులా పూడిపోవటమా!
నాలుగు గీతల నడుమ నాలుగు గోడల మధ్య
నలుగురు నడకలలో ఆలోచనను స్మరించుకోవటమా
పూసి రాలిన పువ్వుముఖాన్ని పలకరించనట్లుగానే
ముగిసిన పుస్తకంలోని చివరి వాక్యాన్ని
మళ్లీ ఎవరు చదువుతారు...అంతే అంతే

మళ్ళీమళ్ళీ ప్రశ్నలు తలెత్తుతూనే ఉంటాయి
జవాబుల జేబులన్నీ ప్రశ్నలతోనే నిండి వుంటాయి
అందుకే నువు చిగురిస్తున్న మొక్కవైపే చూడు
ఉదయిస్తున్న దినకరున్ని వెంటాడు
పసిబాలుని పచ్చిపాల వాసనకను
నువ్విక నిత్యనూతనమై బతుకు గుమ్మాన్ని దాటు
తలుపులు తెరుచుకున్న లోకపు గీతంలోకి
నీవైన కొన్ని అక్షరాల్ని అర్పించి...

– కె.ఆనందాచారి

సమాచారం

డాక్టర్ పత్తిపాక మోహన్‌కు 'జానుడి – 2017' పురస్కారం

'జానుడి' సాహిత్య సేవాసంస్థ ప్రతియేటా సాహిత్య సేవను గుర్తించి ఒకరికి పురస్కారం అందచేస్తోంది. 2017 జానుడి సాహిత్య సేవా పురస్కారాన్ని ప్రముఖ రచయిత, సాహితీవేత్త, నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు సంపాదకులు డాక్టర్ పత్తిపాక మోహన్‌కు ప్రదానం చేయాలని నిర్ణయించాం. 'జానుడి' సంస్థ స్ఫూర్తిప్రదాత, ప్రముఖ పద్యకవి మల్లవరపు జాన్ జయంతి సందర్భంగా జనవరి 22న ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేస్తాం.

– జానుడి – సాహిత్య సేవా సంస్థ

జనవరి 2 నుంచి విజయవాడలో పుస్తక మహోత్సవం

జనవరి 2 నుంచి 11 వరకూ విజయవాడ స్వరాజ్య మైదానం (పీడబ్ల్యూడీ గ్రౌండ్స్)లో పుస్తక మహోత్సవం జరుగుతుంది. అన్ని రాష్ట్రాల నుంచి ప్రచురణకర్తలు, నిర్వాహకులు పాల్గొని, 300 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. జనవరి 1న ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పుస్తక మహోత్సవంపై సదస్సు జరుగుతుంది. దీనిలో ఉపరాష్ట్రపతి పాల్గొంటారు. పుస్తక ప్రియులు కోరుకునే అన్ని రకాల పుస్తకాలూ అందుబాటులో ఉంటాయి. రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకూ ప్రముఖ రచయితలతో సమావేశాలు ఉంటాయి. ప్రముఖ తెలుగు రచయితలు ఒక్కోరోజు ఏడెనిమిది మంది చొప్పున పుస్తక మహోత్సవం సాహితీ కార్యక్రమంలో పాల్గొంటారు. 4వ తేదీన వాక్ ఫర్ బుక్ కార్యక్రమం ఉంటుంది.

– విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం


రచనలకు ఆహ్వానం


ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. సమీక్ష కోసం పుస్తకాలను పంపేవారు రెండు కాపీలను పంపాలి. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి.

అక్షరం, ప్రజాశక్తి సాహిత్య పేజీ, ప్రజాశక్తి కార్యాలయం, ఎంబి విజ్ఞాన కేంద్రం, గవర్నరుపేట, విజయవాడ – 2.

prajasavvadi@gmail.com

వర్తమాన కథపై మౌనం వీడాలి







కవిత్వం కంటే కథ సమాజాన్ని ఎక్కువగా పట్టించుకుంటోంది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల మాండలికాలు కథను మరింత ఉద్దీపితం చేస్తున్నాయి. అటు కళింగాంధ్ర, ఇటు రాయలసీమ ప్రాంతాలతో పాటు తెలంగాణలోని వేర్వేరు ప్రాంత మాండలికాలు కథని ఎంతో ఎత్తుకు తీసుకెళుతున్నాయి. కథని జీవితంతో పాటు ప్రయాణింపజేయటంలో, జీవితాన్ని ఉన్నతవంతం చేసే దారులను విశాలం చేయటంలోనూ ఆధునిక కథకులు ఎంతో బాధ్యతాయుతమైన పాత్రని నిబద్ధంగా నిర్వర్తిస్తున్నారు. చివరికి సాహిత్య అకాడెమీలను సైతం అటువైపు ఆలోచించేలా చేస్తున్నారు. ఇలా తొలుత కొంత కవిత్వం రాసినా, తర్వాత కథల వైపు ప్రయాణించి, కథని సమాజంలోని అనేక చీకటి పార్శ్వాలలోకి ప్రవహింపజేస్తున్నారు **ప్రముఖ కథకులు వేంపల్లె షరీఫ్.** ఒక గంభీరమైన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక చింతనతో తనచుట్టూ ఉన్న అనేకానేక సమస్యల వైపు దృష్టి సారిస్తూ కథకు ఉండే ప్రయోజన పరిధిని విశాలం చేస్తున్న షరీఫ్ గతంలో వెలువరించిన 'జుమ్మా ' కథల పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కారం కూడా లభించింది. ఇటీవల ఆయన నుంచి వెలువడిన మరో కథా సంపుటి 'టోపీ జబ్బార్'. 2002 నుంచి మీడియాలో ఉన్న షరీఫ్ ప్రింట్, టివి, రేడియో రంగాల్లో పనిచేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ వెలువరిస్తున్న 'కస్తూరి' పత్రికకు వర్కింగ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.

'ఈ నీళ్లు ఎంతపని జేచ్చాండాయి నాజియా.. తల్లికి బిడ్డను గాకండా చేస్తున్నాయి. బిడ్డను తల్లికి గాకండా చేస్తున్నాయి. పక్షి, పురుగు, చెట్టు, పుట్ట అన్నీ మలమలా మాడి సచ్చిపోతాండాయి. మనోళ్ళకేమో కలలు గుడక ఎట్ట గనాల్నో తెలియడం ల్యా. నీ వొదినేమో... మొగపిల్లోడు ఉంటే బావుండును అంటుంది. నీ కూతురేమో గోషా కావాల్ల... అంటూంది. మనగ్గావాల్సింది నీళ్ళు కదూ.. అయ్యుంటే యియన్నీ ఎందుకు? మల్ల నీళ్ళ గురించి ఎవరూ ఎందుకడగరు? మనం కనాల్సిన కలను వదిలేసి ఇంకేదో కలను కంటున్నాం. అది గదా కరవాడే ఆట. ఈ సత్యం వెళ్లిపోయిన చాందిని గానీ, నీ వొదినగ్గానీ ఎట్టా తెలియాల?' ఇది షరీఫ్ 'దారి తప్పిన కల' కథలోని ఒక పాత్ర ఆవేదన. ఇది షరీఫ్ ఆవేదన కూడా.

షరీఫ్‌కు తాను నడిసొచ్చిన దారి మీద ఒక స్పష్టత ఉంది. అవును కదా.. ముస్లిములు ఎక్కువగా ఉన్న రాయలసీమలో కరువు ప్రభావం వారి మీద కూడా ఉంటుంది కదా. మరి ఆ ప్రభావం ఇన్నాళ్లు ఎందుకు ఎక్కడా రికార్డు కాలేదు. కరువు ఆడే వింత నాటకంలో అన్నీ ఆర్థిక ఇబ్బందులేనా? ఇతర ఇబ్బందులు లేవా? అసలు ముస్లిముల ఇళ్లలోకి నేరుగా జొరబడి వారి సాంస్కృతిక జీవితాన్ని ఇంతగా ధ్వంసం చేస్తున్న కరువును ఏమనాలి? 'టోపీజబ్బార్' కథా సంకలనాన్ని చదివితే ఎన్నో ప్రశ్నలు మనల్ని ముప్పిరిగొల్పుతాయి. రాయలసీమ మాండలికంలో మంచి కథలు రాసిన, రాస్తున్న షరీఫ్‌తో కాసిని మాటలు...

కవి నుంచి కథలోకి ప్రయాణం ఎందుకు?

నేను చెప్పాలనుకున్నది మరింత వివరంగా చెప్పొచ్చు. కథలో నన్ను నేను ఆవిష్కరించుకునేందుకు అవకాశం ఉంది. ఆపుకోలేని నా ఎమోషన్సే నేను రాసిన కథలు.

కథానికా విమర్శ ఇప్పుడెట్లా ఉంది?

నిజం చెప్పనా. సంకుచితంగా ఉంది. నిజానికి రచయితలే సంకుచితంగా ఉన్నారని, సార్వజనీనంగా ఉండకుండా ఏ వర్గం వైపో, మతం వైపో, ఏ భావజాలం వైపో మొగ్గు చూపుతున్నారని చాలామంది అంటుండగా విన్నాను. ఇప్పుడు నేను ఏమంటానంటే– మంచి కథ లేదా సాహిత్యం ఏ వర్గంలో ఉన్నా ఏ భావజాలంలో ఉన్నా ఆయా వర్గాల, భావజాలాల పరిమితుల్లోనే వాటి గురించి మాట్లాడమంటున్నాను. మౌనం అనేది ప్రమాదకరం. అది ఇటు రచయితలకూ అటు సమాజానికి మంచిది కాదు.

ఎందుకిట్లా జరుగుతోంది?

చెప్పాను కదా. వాళ్లు సంకుచితమని వీళ్లు.. వీళ్లు సంకుచితమని వాళ్లు. పైగా విమర్శిస్తే తట్టుకునే శక్తి రచయితలకు లేదని కూడా విమర్శకులు అంటుండగా విన్నాను. కావొచ్చు. అలా అని ఇగ్నోర్ చేయడం ప్రమాదకరం. ఎవరేమనుకున్నా.. రాయల్సినవాళ్లు రాయాల్సిందే.. మాట్లాడాల్సిన వాళ్లు మాట్లాడాల్సిందే. సాహిత్యంలో వీళ్లిద్దరూ బ్యాలెన్స్ కోల్పోకూడదు.

ఎక్కువగా ఏ రకమైన సాహిత్యం వివక్షకు గురవుతోందని మీ అభిప్రాయం?

ఇలా ప్రత్యేకించి చెప్పాల్సి వస్తే నేను నిస్సందేహంగా ముస్లిం సాహిత్యమే అని చెబుతాను. అది నిజం కూడా. మెయిన్ స్ట్రీమ్ పత్రికలు ముస్లిం సమస్యల మీద వస్తున్న సాహిత్యాన్ని ప్రచురించేందుకు వెనకాడుతున్నాయి. ఒక అక్షరం అటు దొర్లితే మెజార్టీ సమాజంతో ఇబ్బంది అంటున్నారు. ఇంకో అక్షరం ఇటు తూలితే మీ ముస్లిములతో ఇబ్బంది అంటున్నారు. మరి సృజనకారులు ఏమైపోవాలి? ఎవరినీ నొప్పించకుండా రాసేది సాహిత్యం అవుతుందా?

సరే... మెయిన్‌స్ట్రీమ్ పత్రికలు వేయకపోతేనేమి చిన్నచిన్న పత్రికలకు, వెబ్ మ్యాగజైన్లకు కథలు పంపుకుని పుస్తకంగా అచ్చేస్తే దాని గురించి కూడా మాట్లాడ్డానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఇటు ముస్లిం మేధావులు అనుకున్నవాళ్లలో (నాతో సహా) ఒకరంటే ఒకరికి పడటం లేదు. వాళ్లు వాళ్ల సాహిత్యం గురించే తప్ప ఇతరుల సాహిత్యం గురించి మాట్లాడేంత విశాలంగా లేరు. ఇక మెజార్టీ భావజాల రచయితలు, విమర్శకులు మాట్లాడాలనుకోవడం అత్యాశే అవుతుంది. కొంచెం అటూ ఇటుగా ఉన్న రచయితలు, విమర్శకులు కూడా ఈ సందిగ్ధ వాతావరణంలో 'ఎందుకొచ్చిన గోల' అని వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తున్నారు. ఈ మౌనం ఎక్కడో ఒక చోట బద్దలు కావాలని నేను బలంగా కోరుకుంటున్నాను. ఒకరకంగా చెప్పాలంటే ముస్లిముల పట్ల వివక్ష సమాజంలో కన్నా ఎక్కువగా సాహితీలోకంలో ఉంది.

మీకు సాహిత్య అకాడెమి అవార్డు వచ్చింది కదా? అది ముస్లిం కథలకు వచ్చిన గుర్తింపు కాదా?

కచ్చితంగా ముస్లిం కథలకు వచ్చిన గుర్తింపే. అప్పుడప్పుడు ఇలాంటి అద్భుతాలు జరుగుతుంటాయి. కొన్నిసార్లు కొన్ని అనివార్యతలు మనకు నచ్చని సమూహాలకు కూడా కొన్ని అవార్డులు ఇవ్వమని చెబుతుంటాయి. అంతమాత్రాన ఆయా వర్గాలకు విపరీతమైన ఆదరణ ఉన్నట్టు కాదు.

సంభాషణ

ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పుకోవాలి. దురదృష్టవశాత్తు ఈ దేశంలో రచయితల ప్రతిభ అవార్డులతో కొలవబడుతోంది. అందుకే చాలామంది అవార్డులు వస్తే మంచి రచనలు అని, రాకపోతే లేదనే అపోహలో ఉన్నారు. అవార్డులు రాని ఉత్తమ సాహిత్యం ఈ తెలుగు గడ్డ మీద కొండంత ఉంది.

మీ కథలపై మీ అభిప్రాయం?

వివేచనాపరులు మాట్లాడాల్సిన అగత్యాన్ని నా కథలు కల్పించాలని కోరుకుంటున్నాను. ఇవాళ కాకపోతే, రేపైనా ఈ కథలపై మాట్లాడతారు. అలా మాట్లాడే పరిస్థితిని నా కథలు కల్పిస్తాయనే నమ్మకం కూడా నాకు గట్టిగా ఉంది.

రాయలసీమ మాండలికంలో రాయటానికి కారణం?

నేను ఆ నేల బిడ్డని. రాయలసీమ అంటే నాకు ప్రత్యేక గౌరవం. అక్కడి భాషలో రాస్తే నా కథలకు జవం, జీవం.

ఎందుకు రాస్తున్నారు?

నన్ను నేను, మనల్ని మనం కడిగేసుకోవాలి. ఏదైతే మంచి సాహిత్యం ఉందో దానిని అడిగి తీసుకుని చదవాల్సిన అవసరం ఉందని అనుకుంటున్నాను. దాన్ని చదువుకుని నలుగురితో మాట్లాడుకోవాలి. ఆ రాసిన రచయితని అభినందించాలి. అటువంటప్పుడే మంచి రచనలు వస్తాయని నమ్ముతున్నాను.

అస్తిత్వం కోసం మీరు కొన్ని పొలిటికల్ కథలు రాస్తున్నారని విమర్శ? దీనికేమంటారు?

అస్తిత్వం లేకుండా మనిషి లేడు. ప్రతి మనిషికి ఒక అస్తిత్వం ఉంటుంది. కొన్నిసార్లు ఒకే మనిషికి రెండు మూడు అస్తిత్వాలు కూడా ఉంటాయి. అంటే ఒక తండ్రిగా, భర్తగా, అన్నగా ఒక వ్యక్తి కుటుంబంలో రకరకాల అస్తిత్వాలు ఎలా కలిగి ఉంటాడో అలా అన్నమాట. నాకు పుట్టుకతో ముస్లింగా ఒక అస్తిత్వం ఉంది. రాయలసీమ వాడిగా ఇంకో అస్తిత్వం ఉంది. రాయలసీమ అయినా, ముస్లిమైనా రెండు కూడా వెనకబడ్డవే కాబట్టి– రెండింటినీ ఏకం చేసి మాట్లాడాలంటే వెనకబడ్డ లేదా అణచివేతకు గురవుతున్న మనిషి, ప్రాంతం అస్తిత్వమే నాది. ఈ అస్తిత్వ ప్రకటనలో ఒక్కోసారి పొలిటికల్ కథలు కూడా రాయాల్సి వస్తే నేనేమి వెనకాడను. దాన్ని నేనేమి తక్కువ అనుకోను.

సాహిత్యంలో ముస్లిం కథా రచయితల స్థానం?

ముస్లిం జీవితాల పట్ల సరైన అవగాహన మెయిన్‌స్ట్రీమ్ సమాజానికి లేదమో అని నాకు అనుమానం. అబద్ధాల్లో బతికేవారికి జీవితం తెలీదు. పుస్తకాల్లోంచి ముఖాన్ని బతుకులోకి తీసుకురాకపోతే అర్థం కాదు. సరిగ్గా సాహిత్యంలోనూ ముస్లిం కథా రచయితలకి అదే స్థానం ఉంది. ఇగ్నోరెన్స్ అనేది ముస్లిం మైనార్టీల్లోనూ ఒక సరుకుగా కొనసాగుతోంది. నా జీవితంలోని అనేక దు:ఖ శకలాల నుంచే నా కథలు పుట్టాయి. ఓ రకంగా ముస్లిం సాహిత్యం మెజార్టీగా వస్తూ మైనార్టీగా దిక్కులేని స్థితిలో ఉంది.

సంభాషణ : డాక్టర్ నూకతోటి రవికుమార్

కాకమ్మకు కవితా నీరాజనం



పుస్తకం

ప్రాచీన భారతీయ వాఙ్మయంలో మనువాది స్మృతికర్తలు మనుషులతోపాటు పశుపక్ష్యాదులను కూడా పరమ వ్యూహాత్మకంగా విభజించి జీవకోటిలో అసమానతల పెనుమంటలను రగిలించారు. పక్షుల మధ్య అసహజమైన నిమ్నోన్నతాల కర్ర్యా గీతలు గీచి చివరకు వాటిని కూడా రాచిరంపాన పెట్టారు. కల్లబొల్లి కారణాలతో కొన్ని పక్షులను అసహ్యించుకొని, కట్టుకథలతో మరికొన్ని పక్షులను ఉన్నతీకరించారు. వర్ణవ్యవస్థ నిర్దేశించిన సూత్రాలను, శాసనాలను అన్ని రంగాలకు అన్వయించి తదనుగుణంగా వ్యవహరించాలని పురాతన కవి పండితులు తీవ్రంగా హెచ్చరించారు. 'బహుళ ప్రయోజన ప్రదాత' అయిన కాకిలాంటి పక్షులకు హీనత్వాన్ని, నీచత్వాన్ని ఆపాదించారు. అసత్య ఆరోపణలతో అనేక రకాలుగా కాకిని నిందించారు. కాకి కేంద్రంగా ఎన్నో అనర్థాలను, మరెన్నో అశుభాలను భయాలను, ప్రచారం చేశారు. వేద, శాస్త్ర, పురాణేతిహాసాల్లో, కావ్యాల్లో వివిధ సందర్భాల్లో కాకి ప్రస్తావనలు చోటుచేసుకున్నాయి. కాకిని అంటరాని పక్షిగా చిత్రించటమే అన్నిటా సారాంశమని ముత్తేవి రవీంద్రనాథ్ (పక్షి ప్రపంచం) తన పరిశోధనాత్మక వ్యాసంలో వివరించాడు.

కాకః పికం న సహతే నచ విజ్ఞమజ్ఞః (కథా సరిత్సాగం)

అజ్ఞుడు విజ్ఞుడిని సహించనట్లే కాకి కోకిలను సహించదు

దుగ్ధ ధౌతో పి కిమ్ యాతి వాయసః కలహంస తామ్ఎఎ (హితోపదేశమ్)

పాలల్లో కడిగినంత మాత్రాన కాకి కలహంస అవుతుందా?

ప్రాసాద శిఖరస్థోపి కాకః కిమ్ గరుడాయతే

ఎత్తైన మేడపై కూర్చున్న మాత్రాన కాకి గరుడపక్షి కాగలదా?

అంటూ ఎన్నో వ్యర్థమైన నిర్ధారణలు చేశారు ప్రాచీన పండితులు. కోకిల విజ్ఞానానికి కాకి అజ్ఞానానికి ప్రతీకలని కుహనా తీర్పులు చెప్పారు. స్వభావాన్ని గాలికొదిలేసి, కేవలం స్వరూపాన్ని అనుసరించి, బుద్ధిబలంతో కాకుండా, కండబలంతో అంచనా వేస్తూ కాకి – హంస, గరుడ పక్షులనడుమ పొసగని పోలికలు చెప్పారు.

నరాణామ్ నాపితో ధూర్తః పక్షిణామ్ చైవ వాయసః

పక్షుల్లో కాకి టక్కరి నైజం కలిగినదని, వస్తువులను దొంగిలించిన వారు మరుజన్మలో కాకిగా పుడతారని భయపెట్టారు. కాకి చుట్టూ అవమానాల చరిత్రను అల్లారు. ఇలాంటి అహేతుకమైన, నిరాధారమైన దగా కోరు చరిత్రను 'కృష్ణద్విజ' కవితా సంకలనంలోని కవులు తిరగరాశారు. కాకి బహుముఖీన ఔన్నత్యాన్ని ఔచితీమంతంగా కవిత్వీకరించారు. కృష్ణద్విజ సంకలనం కాకి అందించే బహుళ ప్రయోజనాలను ఉదాత్తమైన దాని వ్యక్తిత్వాన్ని సోదాహరణంగా నిరూపిస్తుంది. కాకి గురించికనీవినీ ఎరగని ప్రత్యామ్నాయ వైఖరి, సామాజిక, సాంస్కృతిక, తాత్విక దృక్పథం కృష్ణద్విజ సంకలనంలో దర్శనమిస్తుంది.

'నేను ప్రవాహంలో కొట్టుకుపోయే మట్టిగడ్డలాగా ఉండను. ఆ ప్రవాహపు గతిని మార్చే పర్వతంలాగా నిలబడతాను' అని డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చెప్పినట్లుగా ఈ సంకలనంలోని కవులు సనాతన పండితులు ప్రవచించిన అంధవిశ్వాసాల వెల్లువలో కొట్టుకుపోకుండా, వినూత్న విశ్వ సత్యాలను ఆవిష్కరించారు. 'మీ పితరుల ఆత్మశాంతికై మీరు పెట్టే/ పిండాకూడు తింటూ/ మీరు బాధల్లో బావురుమంటే / మీతోపాటు ఆవురమని ఏడ్చే / మా కాకుల కథలు మీ కలాలకందవా కవీ' అంటూ మోదుకూరి జాన్సన్ సోకాల్డ్ కవిపుంగవులపై కన్నెర్ర జేశారు. కాకి – కోకిలల వ్యక్తిత్వ తారతమ్యాన్ని సముచితంగా అక్షరబద్ధం చేశాడు. కాకి పేరుతో లోకంలో చెలామణిలో ఉన్న పలుకుబడులను, నుడికారాలను ఈ కవులు తూర్పారబట్టారు. 'మనుషులుచేసే దొంగలెక్కలకు/ 'కాకి లెక్కలు' అని పేరు పెట్టడంలోని ఆంతర్యాన్ని పాడేటి జాన్సన్ నిలదీశాడు. చివరకు భాషలో కూడా చొరబడిన ఆధిపత్య సంస్కృతి ఆనవాళ్ళను 'వర్ణలాభం' కవితాయుధంతో తెగనరికాడు నేతల ప్రతాప్ కుమార్.

సభ్య సమాజం ఈసడించుకున్న గబ్బిలాన్ని 'మౌని ఖగరాజ్ఞి', 'పుల్గుదొరసాని' 'పుల్గు పుణ్యాంగన' అంటూ జాషువా సరికొత్తగా సంభావించి గబ్బిలానికి కావ్య గౌరవాన్ని కలిగించాడు. 'మైలపక్షి'గా నీలాపనిందలను మోసిన కాకిని 'సద్గురువు', 'పరమ సాధువు', 'జ్ఞాన సింధువు (డాక్టర్ కృష్ణ కౌండిన్య) తూరుపు పిట్టను తరుము కొచ్చే సుప్రభాతం' (రత్నాజీ) అంటూ కవులు తమ కవితల్లో అభివర్ణించారు.కాకి అంటరాని పక్షి కాదని అఖిల విశ్వానికి ఆదర్శవంతమైన పక్షిరాజమని ల్యాటిన్ మహాకవి హొరేష్ కార్నిక్స్ చెప్పినట్లు కాకిని ఒక మహా ప్రవక్తగా చిత్రీకరించారు.

'ఓ నా కాకమ్మా/ నా బిడ్డల తేనెలూరే గొంతులను / గానకాకి బిరుదుతో సత్కరిస్తాం/ జాతి కోసం శ్రమించే వేగుచుక్కలను/ కాకిరత్నంగా గుర్తిస్తాం' (కాకులం) అంటూ డాక్టర్ పసునూరి రవీందర్ అపురూపమైన ప్రతిభాశక్తితో నింగిచెవులు మారుమోగేలా చాటింపు వేశాడు. 'గానకోకిల, భారతరత్న' లాంటి బిరుదు వాచకాలకు భిన్నంగా కాకికి అరుదైన గౌరవ మర్యాదలను కట్టబెడుతున్నాడీ కవి. 'రాబోయే బహుజన రాజ్యంలో/ కాకిని జాతీయ పక్షిగా ప్రకటించాలని ప్రతిపాదించాడు ఎజ్రాశాస్త్రి. 'జాతీయ గీతంలో నీ పేరు చేర్చి/ నిత్యం స్మరించేలా చేస్తానని' డాక్టర్ గూటం స్వామి కొనియాడాడు. 'హంసలా ఆర్నెల్లు కాదు/ కాకిలా కలకాలం బతకాలి' అంటూ మద్దూరి నగేష్‌బాబు విలక్షణంగా కాకి జీవన విధానంలోని గొప్పతనాన్ని తెలియజేశాడు. 'కాకిలాగే బతుకుతాను/ సమిష్టి జీవితాన్నే కోరుతాను/ నాకోసం విదిల్చిన ఎంగిలి మెతుకుల్లైనా/ నేను కోరుకునే చికిడెదు గింజల్లైనా/ పదిమందితో కలిసి పంచుకునే/ సమిష్టి జీవితం నాది' (కాకి బతుకు) అంటూ కమనీయమైన కాకి గుణగణాలను మార్గదర్శకంగా భావిస్తే ఆర్థిక అంతరాలకు తావే లేదని హితవు చెప్పారు శీలా వీర్రాజు.

'తిని పారేసే ఎంగిలాకుల్ని సైతం/ తీసిపారేసి/ చచ్చిన కళేబరాలను మాయం చేసి/ ఊరి శుభ్రాన్ని పాటించే కాకి పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నదని నేలపూరి రత్నాజీ నిర్ధారించాడు. 'తిన్న ప్రతి గింజను మొక్కగా మొలిపించి/ కాలుష్య భూతానికి చరమగీతం పాడే పరమవీర ప్రకృతి ధర్మాన్ని' పరిశీలనాత్మకంగా కాకిలో దర్శించాడు చందా అప్పారావు.

అసాధారణమైన కళాతత్వ దృష్టి **(Aesthetic outlook)**తో కాకి ఘనతకు సరికొత్త భాష్యం చెప్పాడు డిఎంఆర్ శేఖర్. కాకి యొక్క సామాజిక, చారిత్రక, సాంస్కృతిక, తాత్విక విశిష్టతను అనేక కవితల ద్వారా అంగీకారయోగ్యంగా నిరూపించాడు. ఏమాత్రం పునరుక్తి దోషం లేకుండా హృద్యమైన ఛందోగతిలో 14 కవితలతో ఈ సంకలనానికి రాశిని వాసిని సమకూర్చాడు. **"To write a good poems is the secret of brevity'** ఉత్తమ కవిత్వాన్ని సృజియించటమంటే సంక్షిప్తతా రహస్యాన్ని గ్రహించటమేనంటాడు రష్యన్ రచయిత **Dejanstojanovic. Brevity is the soul of wit"** అంటాడు షేక్స్‌ఫియర్. ఈ రకమైన రూపపరమైన పరిణితితో శేఖర్ లోకోత్తరమైన కాకి ప్రత్యేకతను కవిత్వీకరించాడు.

కాకి ప్రతినిత్యం అపశకునపు పక్షి అని ఆడిపోసుకుంటూ పిండ ప్రదానాలప్పుడు మాత్రం పితృదేవతలని ఆహ్వానించే పచ్చి అవకాశవాద రాజకీయాలను ఈ కవులు చీల్చి చెండాడారు. సనాతన కాలం నుంచి సమాజంలో స్థిరపడిన నమ్మకాలను, పిడివాదాలను ఈ కవులు సమర్థవంతంగా పూర్వపక్షం చేశారు. కృష్ణద్విజ కవితల్లో ఈనాటి అస్తిత్వ ఉద్యమాల చైతన్యం కనబడుతుంది. సృష్టిలోని సమస్త జీవులు సమానమేనన్న మానవతా శంఖారావం ఈ కవితల్లో వినబడుతుంది. ఒక పక్షి కేంద్రంగా ప్రత్యేకమైన సంకలనం తెలుగులో ఇంతవరకూ రాలేదు. ఆధునిక తెలుగు సాహిత్యంలో వెలువడిన సంకలనాల్లో 'కృష్ణద్విజ' విశిష్టమైనదిగా పేర్కొనవచ్చు. ఎంతో గురుతర బాధ్యతతో సామాజిక పరిణామ పరిశోధనా సంస్థ (ఒంగోలు) ఇలాంటి ప్రయోజనాత్మకమైన గ్రంథాలను ప్రచురించటం అభినందనీయం.

– డాక్టర్ కోయి కోటేశ్వరరావు

9440480274

ఇంగ్లీషు పదాలు లేకుండా మాట్లాడాల్సిందే.. అని నియమం పెడితే.. నోళ్ళకు జిప్ వేసుకుని మూగసైగలతోనే రోజంతా గడిపేయాలి. ఆమాటకొస్తే.. జీవితాంతం.. అలాగే బతకాలి. బస్సు, రైలు, గ్లాసు, రోడ్డు వంటి వేలాది పదాలను మాతృభాషలో తర్జుమా చేసుకుంటూ.. మాట్లాడ్డం.. అంటే అసాధ్యమైన పనే! పోనీ మాట్లాడాలనే ప్రయత్నమే చేస్తే.. వీడెవడో పిచ్చోడిలా ఉన్నాడే.. అనుకునే ప్రమాదమూ ఉంది. ఇప్పుడు న్యూ ఇయర్‌ని జరుపుకోవద్దు అనేమాట కూడా అలాంటిదే!

న్యూ ఇయర్ వద్దంట

కానీ మన సర్కారోళ్ళు మాత్రం.. 'తెలుగు పండగలే చేసుకోవాలి. తెలుగులోనే సంతోషపడాలి. తెలుగులోనే సందడి చేయాలి. తెలుగులోనే ఆనందపడాలి. తెలుగులోనే ఎగరాలి. పరుగెత్తాలి.' అని శాసనాలు చేస్తున్నారు. చివరాఖరికి ప్రపంచమంతా ఒక్కతాటిపైకొచ్చి.. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ నినదించే న్యూ ఇయర్ సరదాలకూ సంకెళ్ళు వేయాలనే ఆంక్షలు పెడుతున్నారు. నిజమే 'హ్యాపీ న్యూ ఇయర్' ఇంగ్లీషు పదమే.. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ అనేవీ విదేశీ పద్ధతులే అనుకుందాం. కానీ, ఏడాదికో పండగలా చేసుకునే న్యూ ఇయర్ సందర్భంతో ముడిపడ్డ అనుబంధాన్ని ఎలా విడదీయగలం?

అసలు ఇది సాధ్యమేనా? హ్యాపీ న్యూ ఇయర్‌తో కలగలిపిన సంతోషపు అనుబంధాలు అన్నీఇన్నీ కావు. మన పుట్టుకే ఒక ఇంగ్లీషు క్యాలెండర్. అందులో పచ్చబొట్టులాంటి తేదీలతో మన అడుగులు పడుతుంటాయి. ఎదుగుతుంటాయి. జీవితానికీ అవి కొలతలు, అందమైన జ్ఞాపకాలుగా మారుతూ ఉంటాయి. అలా మనకు తెలియకుండా సాగిపోయే ప్రయాణంలో ఏడాదికోమారు సంతోషాలను పంచిపెట్టే సందర్భమే హ్యాపీ న్యూ ఇయర్ వేడుక. గడిచిన ఏడాది కాలాన్ని ఒకసారి గుర్తు చేసుకుంటూ.. కొంగొత్త ఆలోచనలు, సంకల్పాలు, లక్ష్యాలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టే సమయాన కొత్తగా, సంతోషంగా ఉండాలనే రోజును ఒక మధురమైన గుర్తుగా మలచుకునే రోజు ఇది. ఇందులో వెలకట్టలేని బాల్యస్మృతులు, అంతకుమించి జీవితాంతం అందంగా వెంటాడే జ్ఞాపకాలు, పలకరింతలు, పాటలు, ఆటలు,

"రోడ్డుమీద నడవవలెను. పేపరుపై పెన్నుతో రాయవలెను. స్కూల్, కాలేజ్‌కి రెగ్యులర్‌గా వెళ్ళవలెను. పైనాపిల్ జ్యూస్‌ని స్టీల్ గ్లాస్‌లోనే తాగవలెను. సేఫ్టీకోసం బస్సు, రైలులో మాత్రమే ప్రయాణించవలెను. కండక్టర్‌ని అడిగిమరీ కచ్చితంగా టిక్కెట్టు తీసుకొనవలెను. గేటుతీసి లోపలికి రావలెను. బాగా చదువుకుని కలెక్టరో, డాక్టరో, యాక్టరో కావలెను. పిల్లలు టీ, కాఫీలకు దూరంగా ఉండవలెను. అప్పుడప్పుడు సరదాకోసం మంచి సినిమా చూడవలెను... " ఈ మాటల్లో తెలుగుపదాలెన్ని ఉన్నాయబ్బాయ్? అనగానే.. 'ఏంటీ.. ఇది తెలుగే కదా?' అని నొసలు చిట్లిస్తాం. అలా నొసలు చిట్లించేటప్పుడు.. ఆ మాటల్లో తెలుగు పదాలెన్నున్నాయి అని నిజంగానే లెక్కలు వేస్తే.. ఏభై శాతానికిపైగా ఆంగ్లపదాలు దొర్లుతుంటాయి. రోడ్డు, పేపరు, స్కూల్, కాలేజ్, రెగ్యులర్, పైనాపిల్, జ్యూస్, స్టీలు, గ్లాసు, సేఫ్టీ, బస్సు, రైలు, కండక్టర్, టిక్కెట్టు, గేటు, కలెక్టర్, యాక్టర్, డాక్టర్, టీ, కాఫీ, సినిమా.. ఇవన్నీ ఆంగ్లపదాలే. సర్కారోళ్ళు కూడా.. ఈ పదాలు రాకుండా తమ పరిపాలనా వ్యవహారాలు సాగించలేరన్నది వాస్తవం. మనిషి నాగరికత, జీవనక్రమంలో అన్యభాష, సంస్కృతి, సంప్రదాయాలను ఆహ్వానించుకోవడం అనివార్యమైన విషయం. ఏమాత్రం నేరం కాదు. అలాంటప్పుడు 'హ్యాపీ న్యూ ఇయర్' అనే వేడుక జరుపుకోవడం ఎలా నేరమవుతుంది? కొత్త సంవత్సరాన కొత్తగా ముందుకొచ్చిన, తెచ్చిన వింత పోకడ అర్థం, పరమార్థం ఏమిటి?



హ్యాపీ న్యూ ఇయర్‌తో మనం



ముగ్గులు, ముచ్చట్లు.. తీపి మిఠాయిలు, దేదీప్యమానపు వెలుగులు ఇలా ఎన్నెన్ని దాగున్నాయని..?!

బాల్యానికి ఓ గ్రీటింగ్

మొన్నటితరంలో మనకు నచ్చినవాళ్ళను, మెచ్చినవాళ్ళను, ఒకరికొకరం అభినందించుకోవడానికి ఒక అందమైన గ్రీటింగ్ కార్డుతో మన మనసులపై పచ్చని తోరణాలు కట్టుకునేవాళ్ళం. మన ప్రేమను, అభిమానాన్ని అక్షరాలుగా రాసులుగా పోసి, అందులోంచి నాలుగుమాటలు పేపరుపై రాసుకుని, దాన్నొక అందమైన గ్రీటింగ్ కార్డుగా మలచుకుని.. 'మై డియర్ ఫ్రెండ్.. విష్ యూ హ్యాపీ న్యూ ఇయర్..' అంటూ సంతోషాన్ని పంచుకోవడంలో.. కవిత్వపు సుగంధాలను జల్లుకోవడంలో ఉన్న మజాయే వేరు. అదొక తిరిగిరాని తరం. తనివి తీరని తరం. ఆతరంలో 'న్యూ ఇయర్ గ్రీటింగ్' అనే బంధంలో ఎన్నో రంగులు, మనలోంచి, మన మనసుల్లోంచి అలా అలా.. పైకి ఎగురుతూ స్నేహితులపై వాలే అందమైన సీతాకోకచిలకలవి. మానవీయ బంధాలను మరింత బలోపేతం చేసే కల్మషం లేని కరచాలనాలవి. అలాంటి బాల్యపు అనుబంధపు గుర్తులెన్నో న్యూ ఇయర్‌తో ముడిపడి ఉన్నాయి. అవి ఇప్పటికీ గుర్తుకొస్తున్నాయి కదూ?!

సీతాలు ముగ్గులేసి.. రంగులద్ది

ముగ్గులంటే సంక్రాంతి.. సంక్రాంతి అంటే ముగ్గులు. అలాంటి ముగ్గుల హరివిల్లు.. ఊరంతా అల్లుకుపోయే విషయంలో ముందస్తుగా వచ్చే హ్యాపీ న్యూ ఇయర్ సందర్భం ఒకటి. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ.. మన అమ్మలు, అక్కలు, చిట్టిచెల్లెలు సీతాలు.. ఇంటివాకిట చేసే ముగ్గుల సందడి అంతాఇంతా కాదు. వెల్కమ్ టు న్యూ ఇయర్ అంటూ చుక్కలతో అక్షరాలు అల్లి.. పసుపు, ఆకుపచ్చ, నీలం, ఎరుపు, వంగపండు రంగుల్లో మెరిసే నక్షత్రాలను కలిపి.. పగటిపూట ఆకాశపు నక్షత్రాలను భూమిపైకి తెచ్చుకునే అందమైన రంగవల్లి విరిసే వేడుకా ఇదే. ఇరుగుపొరుగును.. ముగ్గుల కలబోత చేస్తూ.. హ్యాపీ న్యూఇయర్ అంటూ చెవులు మారుమోగేలా ఆటపాటల కేరింతల మధ్య సంతోషంగా తడిసిపోయే సందర్భమూ ఇదే. అచ్చమైన తెలుగు వాకిట్లో ఇంగ్లీషు స్వాగతాలు.. ఇంద్రధనస్సులా మెరిసిపోవడాన్ని మరచిపోగలమా? కాదని.. గిరిగీసుకుని ఇంట్లోనే కూర్చోగలమా?!



అల్లుకునే బంధాలు

యాంత్రికమైన జీవితంలో కుటుంబవ్యవస్థ బలహీనమైతోంది. బతుకుతెరువు పయనంలో ఎవరిదారి వారిదే. అలా విడివిడిగా.. ఉండేవారంతా ఒకచోట చేరి.. ఒకటి రెండు రోజులైనా కలివిడిగా ఉండేందుకు దోహదపడే సందర్భాల్లో న్యూ ఇయర్ వేడుకా ఒకటి. ఉల్లాసం, ఉత్సాహంతో నింపే గానాభజానాలతో పాటు అమ్మచేతివంట, నాన్న అనురాగం, పిల్లల కేరింతలు, చుట్టాలు, బంధువుల ఆత్మీయ పలకరింపులు, దీవెనలు.. కొత్త సంవత్సరానికి స్వాగత వచనాలవుతుంటాయి.

సోమవారం నుంచి శనివారం వరకూ పనిచేశాక.. ఆదివారం ఒక ఆటవిడుపు. ఏడాదిలో జనవరి నుంచి డిసెంబరు వరకు పన్నెండు నెలల గడిచే సందర్భాన్ని అందంగా ముగించాలి. మరో ఏడాదిని అంతే సంతోషంగా ఆహ్వానించుకోవాలి. ఇలా అనుకోవడం, జరుపుకోవడం మనకు కొత్తేమీ కాదు. ఇది తరాల నాటిదే. భాష, ప్రాంతం, కులం, మతాలకు అతీతంగా 'హ్యాపీ న్యూ ఇయర్' వేడుక అనేది మనతో ఎప్పటినుంచో ముడిపడిపోయింది. దీన్ని భూతద్దంలోంచి చూస్తూ.. ఆంగ్లము, తెలుగు అంటూ వేరుచేసి, భిన్నత్వంలో ఏకత్వాన్ని మరచిపోయి.. మనుషుల్ని, మనసుల్ని విడదీయాలనుకోవడం అర్థం లేనిది. అయ్యా.. మనిషికి సంతోషాన్ని కలిగించే ప్రతి సందర్భమూ ఒక వేడుకే. సో.. లెట్ యూ.. సే..

విష్ యూ హ్యాపీ న్యూ ఇయర్!!

- గంగాధర్ వీర్ల



పాటల పరవళ్ళు

ఏడాది మొత్తంగా బొంగురుపోయిన గొంతులు సైతం.. కొత్త సంవత్సరం రాకను పురస్కరించుకుని.. శృతిపక్వంగా మారి.. 'నాగొంతు శృతిలోనా' అంటూ సందడి చేస్తుంటాయి. చేయీ చేయీ జతకట్టి.. హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, శాండల్‌వుడ్.. ఇలా అరమరికలు లేని.. స్వరాలన్నీ ఒకచోట సవ్వడి చేస్తుంటాయి. కీబోర్డ్, గిటార్, తబల, డోలక్, వీణ, వయోలిన్.. జతకట్టి వీనులవిందవుతాయి. స్వరం, నాదం, గళం కలిసి 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ ఎదురొచ్చే కొత్త కాలానికి వంతపాడతాయి.. 'ఇవన్నీ వద్దంటే ఎలా మామా? కష్టం కదా?!' 'ఇలా స్నేహితులు, పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలనుకోవడం ఏమంత తప్పు బాస్..' 'అయ్యో గుంజీలు తీయస్తావా? అమ్మో.. ఇంకా నయం.. గోడకుర్చీ వేయించి.. వచ్చే ఉగాది వరకూ అలాగే కూర్చోండి భడవల్లారా..! అని శపించలేదుపో..' అని నవ్వుకుంటోంది నవతరం.

అసలు కొత్త సంవత్సం వేడుక ఎంతోమంది గాయనీ గాయకులకు కొత్తజీవితాన్ని పంచుతుంది. ఇలా అనేక రంగాలకు చెందిన వర్ధ, ప్రవర్ధమాన కళాకారులెందరో ప్రతిభకు, ప్రదర్శనలకు న్యూ ఇయర్ సంబరాలు వంతెన కడుతుంటాయి. ఆర్థికపరమైన వెలుగులూ పంచుతాయి. కళాకారుల రెక్కలు విరిచేయాలనుకోవడం ఏమంత న్యాయం బాస్? అనేది కళాకారుల మాట.



16 చుక్కలు 6వరుసలు
6 వచ్చే వరకు



ఎం. రమ్య
జిడి నెల్లూరు,
చిత్తూరు జిల్లా



22 చుక్కలు
2వరుసలు
2 వచ్చే వరకు

బి.హేమవర్షిత
భట్టిప్రోలు
గుంటూరు జిల్లా

జీవన సౌరభం

నలుగురికోసం నడిచే దారిలో నడక కష్టమైనా నడవడం ఆపకు. ఎందుకంటే భవిష్యత్తులో అదే రాచబాట కాగలదు.

'రమణుల రంగవల్లి'

మీ ముత్యాల ముగ్గుల్ని 'జీవన' పాఠకులతో పంచుకోండి. మీ ముగ్గులకు ఇదే మా స్వాగతం. ముగ్గుల్ని తెల్లని కాగితంపై నల్లసిరా బాల్‌పాయింట్ పెన్ లేదా బ్లాక్ స్కెచ్ పెన్‌తో గీసి, రంగులు నింపి పంపండి. ముగ్గు వేసే విధానం అందరికీ అర్థమయ్యేలా ఉండాలి. నిలువు, అడ్డం చుక్కలు ఉంటే అవి కూడా పేర్కొనండి. మీరు పేరు, చిరునామా, ఫొటో, ఫోన్ నెంబరు పంపడం మర్చిపోకండి. ఎంపికచేసిన రంగవల్లులకు బహుమతి ఉంటుంది.

మా చిరునామా:

జీవన,'రమణుల రంగవల్లి',
జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక, హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇమెయిల్: jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006



మీ కోసం

చల్లని నీళ్ళలో కొంచెం ఉప్పు వేసి అందులో గుడ్లను వేస్తే మునిగినవన్నీ తాజావనీ, తేలినవన్నీ పాడైన వనీ అని అర్థం.





బహుమతి పొందిన ముగ్గు

డి. విజయ కుమారి
పాలకొల్లు,
ప.గో.జిల్లా






అన్ని పోటీ పరీక్షలకూ
ఈ ఆరు సబ్జెక్టులే కీలకం

ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి జోరుగా ప్రకటనలు వెలువడుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థల్లో చేరితే ఒత్తిడి తక్కువ, ఉద్యోగ భద్రత ఎక్కువ అనే భావన ప్రస్తుత యువతలో నాటుకుపోయింది. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం, ప్రైవేటు సంస్థలు ఉద్యోగాల సంఖ్యను కుదిస్తుండటం ఇందుకు ప్రధాన కారణాల్లో ముఖ్యమైనవి. ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసినవారు వాటిని రాయడానికి ప్రణాళికాబద్ధంగా చదువుతున్నారు. పోటీ పరీక్షల్లో నెగ్గాలంటే ఆరు సబ్జెక్టులు కీలకం. వీటిపై పట్టు సాధించడం తప్పనిసరి.


ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి తాజాగా ప్రకటనలు వెలువడుతున్నాయి. మరికొన్ని ప్రభుత్వరంగ సంస్థల్లో పోస్టుల భర్తీకి త్వరలో ప్రకటనలు వెలువడనున్నాయి. బ్యాంకు ఉద్యోగాల భర్తీకీ నోటిఫికేషన్లు వెలువడనున్నాయి. డిగ్రీ, పీజీ, సాంకేతిక విద్యనభ్యసించిన యువత చూపంతా వీటిపైనే ఉంది.

వీటికోసం పోటీ పరీక్షలకు హాజరయ్యేవారు అన్ని పోటీ పరీక్షల్లో కామన్‌గా ఉండే అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లీష్, కంప్యూటర్స్, జనరల్ అవేర్‌నెస్, కరంట్ అఫైర్స్ సబ్జెక్టుల్లో పట్టు సాధిస్తే విజయం వరించినట్లే. పైన పేర్కొన్న ఉద్యోగాలతోపాటు సీబీఐ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్, ఆదాయపు పన్నుశాఖ, అబ్కారీ, గణాంక అధికారి, సీఏజీ, ప్రివెంటివ్ ఆఫీసర్(కస్టమ్స్), మినిస్ట్రీస్ ఆఫ్ ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్(ఎంఈఏ), డివిజనల్ క్లర్క్, ఎఫ్‌సీఐ, ఇంటిలిజెన్స్ బ్యూరో, ఇస్రో కేంద్రీయ విద్యాలయం, ఈపీఎఫ్, రిజర్వుబ్యాంకు, బీమా సంస్థల్లో ఏఏఓ, ఎల్ఐసీ, ఓరియంటల్ ఇన్సూరెన్స్, ఆర్ ఆర్ బీ, ఐబీపీఎస్–పీవో, ఐబీపీఎస్–ఎస్ఓ, ఐబీపీఎస్–ఆర్ఆర్‌బీ క్లర్క్, ఐబీపీఎస్–ఆర్ఆర్‌బీ– పీవో, ప్రైవేటురంగ బ్యాంకుల్లో ఉద్యోగాలకు ఈ సబ్జెక్టుల్లో పట్టు అవసరం.



అర్థమెటిక్

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో మూడు రకాల ప్రశ్నలు అడుగుతారు. వీటి ద్వారా 30 నుంచి 50 మార్కుల వరకు సాధించవచ్చు. ఇందులో మూడు రకాలైన న్యూమరికల్ ఎబిలిటీ, అర్థమెటిక్, డేటా అనాలసిస్ నుంచి ప్రశ్నలు అడగవచ్చు. కూడికలు, తీసివేతలు, గుణించడం, భాగించడం, వర్గమూలాలు, భిన్నాల లెక్కలను సాధన చేయడంద్వారా న్యూమరికల్ ఎబిలిటీలో పట్టు సాధించవచ్చు. అర్థమెటిక్స్‌లో 8,9,10 తరగతుల్లోని వ్యాపార గణితం సమస్యలను సాధన చేయాలి. డేటా అనాలసిస్‌లో పట్టికలు, గ్రాఫ్‌లు, చార్టులు, నిష్పత్తులపై కూడా గట్టి పట్టుండాలి.



కంప్యూటర్ విభాగంలో

దాదాపు అన్ని రకాల ఉద్యోగాలకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా మారింది. ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పోటీ పరీక్షల్లో అభ్యర్థి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పరీక్షించే ప్రశ్నలు అడుగుతున్నారు. ఇందుకోసం అభ్యర్థికి కంప్యూటర్ సబ్జెక్టుల్లో ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి. బేసిక్స్ డేటా ఇన్ఫర్మేషన్‌పై పట్టుండాలి. ఔట్‌పుట్, ఇన్‌పుట్ డిజైన్లపైనా పరిజ్ఞానం అవసరం. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరిజ్ఞానంతోపాటు సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ల మధ్య తేడా తెలుసుకోవాలి. వాటిలో కొంత లోతుగా పరిజ్ఞానం ఉంటే మంచిది.



ఇంగ్లీష్

ఇంగ్లీష్‌కు సంబంధించి ముందుగా వ్యాకరణంపై పట్టు సాధిస్తే దీనిలో నైపుణ్యం లభించినట్లే. కాంప్రహెన్షన్, వకాబ్యులరీ, భాష విభాగాలపై కసరత్తు అవసరం. సినోనియమ్స్ కోసం ఆంగ్ల పదాల అర్థాలు, వాటి వ్యతిరేక పదాలను తెలుసుకోవాలి. వాక్యాలను తెలుగులోనుంచి ఇంగ్లీష్‌లోకి అనువదించగలగాలి. ప్రశ్నాపత్రంలోని పాసేజ్‌ను చదివి, సమాధానాలు రాసే విధానాన్ని చక్కగా అలవర్చుకోవాలి.



రీజనింగ్

వివిధ రకాల ఉద్యోగాలకు రాత పరీక్షల్లో రీజనింగ్ సబ్జెక్టు కీలకంగా మారింది. ఇందులో 30 నుంచి 50 వరకు మార్కులు ఉంటాయి. సంఖ్యలు, అక్షరాలు, పదాలపై పట్టు సాధించాలి. వర్గాలు, వర్గమూలాలు, ఘనాల సూత్రాలను నేర్చుకోవాలి. ఈ సబ్జెక్టులో ప్రశ్నలు కాన్సెప్ట్‌తోపాటు జనరల్ టాపిక్స్ పరీక్షించేవిగా ఉంటాయి. కోడింగ్, డీ కోడింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఈ సబ్జెక్ట్ క్యాంపస్ సెలక్షన్స్ నుంచి బ్యాంకింగ్ రంగంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల వరకూ ఉపయోగపడుతుంది.

కరెంట్ అఫైర్స్

పోటీ పరీక్షల్లో పాల్గొనేవారికి అంతర్జాతీయ, జాతీయ, రాజకీయ అంశాలతోపాటు క్రీడలు, సమకాలీన అంశాలపై అవగాహన అవసరం. వార్తా పత్రికలు క్రమం తప్పకుండా చదవాలి. రోజూ ముఖ్యమైన అంశాలను నోట్ చేసుకుని, గుర్తుంచుకోవాలి. అంతర్జాతీయ అంశాలను నోట్ చేసుకుని చదవాలి. వీటితోపాటు జనరల్ అవేర్‌నెస్‌పైనా పట్టుండాలి. జనరల్‌నాలెడ్జ్‌ని జనరల్ అవేర్‌నెస్‌గా వ్యవహరిస్తుంటారు.



★

వెబ్ పోర్టల్ ముఖ్య లక్ష్యాలు



- క్రెడిట్ల ఆధారంగా పురోగమించేందుకు వీలుగా దేశవ్యాప్తంగా ఒకే విధమైన ధ్రువీకరించిన పాఠ్యాంశాల ప్రణాళిక అమలు.
- అభ్యసనం ద్వారా విద్యార్థులు నూతన మెలకువలను అలవర్చుకునేలా సహకరించడం.
- దేశంలో బహుళ భాషా బోధన, శిక్షణాంశాలను అందుబాటులో ఉంచడం.
- పరిశ్రమల అవసరాలకు అనువైన నైపుణ్యాలను అందించే కోర్సులను ప్రవేశపెట్టడం.
- బలమైన సమీకృత పాలనా యంత్రాంగాన్ని అభివృద్ధిపరచడం.
- మూక్స్ కోర్సులకు సంబంధించి వివిధ భాగస్వాములను ఒకే వేదికపైకి చేర్చడం.
- స్వయం సహాయక బోధనాభ్యాస రీతులను పెంపొందించడం.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక సంస్కరణలు



ఎస్.ఎం.సువర్ణకుమార్
డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 9441169869

ఇండియన్ ఎకానమి

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన అస్తవ్యస్త విధానాలను పరిష్కరించేందుకు 1991లో ఆర్థిక సంస్కరణలు అమలుచేశారు. ఇందులో భాగంగా ప్రయివేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలను ఆర్థికవ్యవస్థలో వివిధ రంగాలకు వర్తింపజేసి అమలుచేశారు. కేంద్రంతోపాటు అనేక రాష్ట్రాల్లో 1992 నుంచి సంస్కరణలు అమలుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 1996 నుంచి సంస్కరణలు అమలు చేశారు.

ఆంధ్రప్రదేశ్ అమలవుతున్న సంస్కరణలకు విజన్ 2020 విధానపత్రం ప్రాతిపదిక అని పేర్కొనవచ్చు. 1995 నుంచి 2020 కాలానికి అనగా 25 సంవత్సరాలలో ఆర్థికవ్యవస్థలోని వివిధ రంగాలలో సాధించాల్సిన లక్ష్యాలు, వాటిని సాధించడానికి అనుసరించాల్సిన విధివిధానాలు మొదలైనవన్నీ విజన్ –2020 దార్శనిక పత్రంలో పొందుపరిచారు. ఆంధ్రప్రదేశ్‌లో సంస్కరణలు ప్రధానంగా కోశరంగం, పాలనారంగం, విద్యుత్ రంగం, సామాజిక రంగాలలో అమలవుతున్నాయని పేర్కొనవచ్చు.

కోశపరమైన సంస్కరణలు

ప్రభుత్వపరమైన నియామకాలను నియంత్రించే దిశగా కంప్యూటరైజ్డ్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. వ్యవస్థాపరమైన వ్యయాలను అదుపుచేయడం ద్వారా బడ్జెట్‌ను అమలుచేసి నగదు, రుణ నిర్వహణను క్రమబద్ధం చేశారు. ట్రెజరీ అధికారులకు ప్రత్యేక బాధ్యతను కల్పించి, బడ్జెట్ విధానాన్ని రూపొందించి అమలుచేశారు. దీనివల్ల బడ్జెట్ కేటాయింపులు ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం పథకాల వారీగా, విభాగాల వారీగా సమీక్షించి, తాజాగా నిర్ణయించడానికి వీలవుతుంది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌ను సరళీకృతం చేసి, పారదర్శకంగా ఉండేటట్లు కొన్ని విధానాలను ప్రత్యేకంగా రూపొందించాలి. వీటిని దశల వారీగా అమలుచేయడం జరిగింది. బడ్జెట్ అమలులో పాటించాల్సిన ప్రమాణాల స్థాయి పెంపొందించాలి. దీని ద్వారా ద్రవ్య క్రమశిక్షణకు లోబడి ఆర్థిక కార్యక్రమాల అమలులో వెసులుబాటు కల్పించడానికి ప్రత్యేక విధివిధానాలు రూపొందించారు. 2002–03 వార్షిక ప్రణాళికలో బడ్జెట్ సరళీకృత విధానాలు విస్తృతంగా అమలు చేశారు. దేశంలో మొట్టమొదటగా మనరాష్ట్రమే వివిధ శాఖల పనితీరును ప్రాతిపదికగా తీసుకుంటూ వివిధ రంగాల ప్రాధాన్యతలను, కేటాయింపులను స్పష్టంగా ప్రకటించి ప్రజల నుంచి సలహాలను సూచనలను తీసుకోవడం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమైన పన్నుల విధింపులో క్రమబద్ధీకరణ చేశారు. అమ్మకంపన్ను స్థానంలో దశలవారీగా 'వ్యాట్'ను అమలుచేశారు. కోశపరమైన అంశాలన్నీ సమన్వయం చేసేందుకు 'ఎఫ్ ఆర్ బిఎమ్' చట్టాన్ని మూడు దశలలో అమలుచేశారు. విజన్ 2020 దార్శనిక పత్రం, రాజా చెల్లయ్య కమిటీ సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వరంగ సంస్థల విషయంలో స్పష్టమైన విధానాన్ని రూపొందించారు. సమర్థవంతగా నిర్వహించని ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేయడానికి చర్యలు తీసుకున్నారు. బడ్జెట్ అమలుతీరును నిర్దేశించడం ద్వారా లోటును అదుపు చేయడంపై దృష్టి కేంద్రీకరించారు. సంక్షేమ పథకాల అమలు, నిర్వహణలో విధివిధానాలు రూపొందించారు.

విద్యుత్ రంగంలో సంస్కరణలు

రాష్ట్ర విద్యుత్ రంగాన్ని పటిష్ఠ పరిచేందుకు ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ రంగ సంస్కరణ బిల్లు ఆమోదించింది. విద్యుత్ బోర్డు సర్వీసులను ఉత్పత్తి, సరఫరా, పంపిణీ అనే మూడు విభాగాలుగా మార్చారు. ఈ చట్టం ద్వారా విద్యుత్ రంగంలో ప్రయివేటురంగ సంస్థలు పాల్గొనడానికి అవకాశం ఏర్పడింది. విద్యుత్ సరఫరాలను నియంత్రించి క్రమబద్ధం చేయడానికి 'ఎపి ట్రాన్స్‌కో' సంస్థను, విద్యుదుత్పత్తి పెంపుదల కోసం 'ఎపిజెన్‌కో' సంస్థలను ఏర్పాటు చేశారు. విద్యుత్ సంస్కరణలు రూపొందించడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ విద్యుత్ డిమాండ్, సప్లయిల మధ్య అంతరాన్ని తగ్గించడానికి ఎన్నో సూచనలు చేసింది. విద్యుత్ రంగ పునర్నిర్మాణానికి ప్రపంచబ్యాంకు సహాయం కోరగా ప్రపంచబ్యాంకు సూచనలను అమలు చేయడానికి విద్యుత్‌రంగ ఉద్యోగుల విషయంలో కొన్ని విధానాలు అమలుచేశారు.

పాలనాపరమైన సంస్కరణలు

ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన సేవలు, పారదర్శక పాలన అందించడానికి, ప్రభుత్వ ఆర్థిక కార్యక్రమాలను, విధానాలను ప్రణాళికా ప్రాధాన్యతలను పటిష్టంగా, సమర్థవంతంగా అమలు చేయడానికి 'స్మార్ట్' పాలనా విధానం ప్రవేశపెట్టి పలనా యంత్రాంగాన్ని ఆధునీకరణ దిశగా మళ్లించారు. సుపరిపాలన గ్రామీణ స్థాయికి విస్తరించి, ఎలక్ట్రానిక్ పలనా ఫలాలను సామాన్య ప్రజానీకానికి అందుబాటులోకి తెచ్చేందుకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఏర్పాటు చేశారు. దీనివల్ల సాంప్రదాయకమైన ఫైల్స్ స్థానంలో ఎలక్ట్రానిక్ ఫైల్స్ అమలులోకి వచ్చాయి. 'కార్డ్' పథకాన్ని రిజిస్ట్రేషన్, విభాగంలో ఏర్పాటు చేసి, సబ్ రిజిస్ట్రార్ కార్యక్రమాలలో ప్రజలకు సేవలు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ట్రెజరీలలో కార్యక్రమాలన్నింటిలో జవాబుదారీతనం, పారదర్శకతను ప్రవేశపెట్టడానికి ఇ-ఖజానా వ్యవస్థను ప్రారంభించారు. టెండర్ల విధానంలో ఇ–టెండర్లు విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా వేగవంతంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడానికి వీలు కలుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇ–సేవా కేంద్రాలు వివిధ ప్రభుత్వ సర్వీసులను ప్రజల ముంగిటకు తీసుకొచ్చాయి.



ఐటి రంగంలో సంస్కరణలు

సేవారంగంలో ఐటిరంగ ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం 1999లోనే రాష్ట్ర ప్రభుత్వం ఐటి పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహక విధానాన్ని అమలుచేయడంలో ఐటి రంగంలో అద్భుత ప్రగతి పొందగలిగింది. ఐటి పరిశ్రమలు, ఐటి ఆధారిత సేవలు, మౌలిక సదుపాయాల కల్పనేకాకుండా హార్డ్‌వేర్ పరిశ్రమకు వివిధ ప్రోత్సాహకాలు అందించింది. దీంతో ఐటి రంగం విస్తృతంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడింది. ఐటి రంగ సమగ్రాభివృద్ధికి కొన్నిరకాలైన ప్రోత్సాహకాలు వేగంగా, సులభంగా అందించే ఉద్దేశంతో ఐటి అధికారిక ఏకగవాక్షాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది.

వ్యవసాయరంగంలో సంస్కరణలు

2020 నాటికి వ్యవసాయరంగం ఆరు శాతం వృద్ధి చెందేందుకు వ్యవసాయోత్పత్తి నాలుగు రెట్లు పెరిగేందుకు వ్యవసాయ, దాని అనుబంధ రంగాలలో ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి వ్యవసాయరంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. వ్యవసాయరంగంలో స్త్రీ, పురుషుల మధ్య అసమానతలను తగ్గించే దిశగా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిచేసి, వారి స్థితిగతులను మెరుగుపరిచేందుకు అవసరమైన వ్యూహాలు రూపొందుతున్నాయి. భూగర్భ జలాలనూ వినియోగించేందుకు మైనర్, మేజర్, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను నెలకొల్పారు. జలవనరుల నిర్వహణలో వ్యవసాయదారులను భాగస్వామ్యం చేసేలా పథకాలను అమలుచేస్తున్నారు.

పారిశ్రామిక రంగ సంస్కరణలు

ప్రయివేటు పెట్టుబడులను ఆహ్వానించడానికి వ్యాపార అభివృద్ధికి అనువైన వాతావరణం రూపొందించే దిశగా కొత్త వ్యాపారాల కోసం 'సింగిల్ విండో' పద్ధతిని ఏర్పాటు చేశారు. రాష్ట్ర పెట్టుబడుల అభివృద్ధిబోర్డు ఏర్పాటయ్యింది. సహకార చట్టంలో భారీ మార్పులు తీసుకోవడం ద్వారా పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు రూపొందించబడుతున్నాయి.

సమాజికరంగ సంస్కరణలు

రాష్ట్రం దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న పేదరికం, నిరుద్యోగిత, విద్య, ఆరోగ్యం వంటి అంశాలలో వెనుకబడి ఉండటం వల్ల మానవాభివృద్ధిలో వెనుకబడి ఉంది. విజన్ 2020లో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేలా వ్యవస్థాపూర్వక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. ఉద్యోగ అవకాశాలను పెంచడం ద్వారా, ప్రజాపంపిణీని పటిష్టపరిచేందుకు, బలహీనవర్గాలకు పెన్షన్ పథకాలను ప్రవేశపెట్టడం ద్వారా దారిద్ర్య నిర్మూలన పథకాలు అమలవుతున్నాయి. విద్య, ఆరోగ్య రంగాలలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకాభివృద్ధి చర్యలు తీసుకుంటున్నారు. దారిద్ర్య నిర్మూలనలో భాగంగా ఆదరణ, ముందడుగు, రోష్ని, చైతన్యం, దీపం వంటి పథకాలు అమలు చేస్తున్నారు. ఆరోగ్య రంగంలో అన్ని రకాల ఆధునిక వైద్య వసతులను కల్పించడానికి ఆరోగ్యకల్పన విషయంలో ప్రయివేటు రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆరోగ్య సేవలను పెంపొందించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునీకరిస్తున్నారు.

★

ఉద్యోగాలు

బెంగళూరు మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో 60 ఖాళీలు

బెంగళూరు మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీ).. కాంట్రాక్టు పద్ధతిలో 60 'ఇంజనీర్' ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

పోస్టుల పేరు-ఖాళీలు : అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్–30, అసిస్టెంట్ ఇంజనీర్–30.

వేతనం : అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్– రూ.55,860, అసిస్టెంట్ ఇంజనీర్– రూ.48,280.

వయసు : అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు 40 ఏళ్లు, అసిస్టెంట్ ఇంజనీర్‌కు 35 ఏళ్లు మించకూడదు.

అర్హతలు : అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు సివిల్ ఇంజనీరింగ్‌లో బీఈ /బీటెక్, అసిస్టెంట్ ఇంజనీర్‌కు సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా/ బీఈ/ బీటెక్. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం తప్పనిసరి.

ఎంపిక : మెరిట్ జాబితా, ఇంటర్వ్యూ.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు తదితర అవసరమైన వాటిని జతచేసి, కవరులో ఉంచి 'జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్), బెంగళూరు మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్, థర్డ్ ఫ్లోర్, బీఎంటీసీ కాంప్లెక్స్, కె.హెచ్.రోడ్, శాంతినగర్, బెంగళూరు–560027' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.

దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ : జనవరి 15, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్ : www.bmrc.co.in

నూతన ఆర్థిక విధానాలతో కల్తీ విత్తనాల దిగుమతి : జమలయ్య

ప్రజాశక్తి-తిరువూరు (కృష్ణాజిల్లా)

నూతన ఆర్థిక విధానాలు దేశంలోకి ప్రవేశంచిన తర్వాత విదేశాలు వాడకుండా వదిలేసిన కల్తీ విత్తనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగుమతి చేసుకోవడంతో నేడు రైతులు కల్తీ పంటలతో ఆర్థికంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య అన్నారు. కృష్ణాజిల్లా తిరువూరు నియోజకవర్గంలో కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు మద్దతుగా చేపట్టిన రైతుయాత్ర ఆదివారం తిరువూరు మండలంలోని సూరవరం, రోలుపడి, చింతలపాడు, గానుగపాడు, జి.కొత్తూరు, పల్లేర్లమూడి గ్రామాలలో కొనసాగి ఎ.కొండూరు మండలంలోకి ప్రశేశించింది.



రైతు యాత్ర
కృష్ణా జిల్లా తిరువూరులో కౌలు రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య

మౌజన్ ఫరూఖ్ హత్య దారుణం

వైసిపి కడప ఎంఎల్ఎ అంజాద్‌బాషా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రశాంతతకు మారుపేరుగా నిలిచే తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మసీదులో మౌజన్ ఫరూఖ్ హత్య దారుణమని వైసిపి కడప ఎంఎల్ఎ ఎస్.బి.అంజాద్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘటన జరిగి మూడు రోజులు కావస్తున్నా దోషులను పట్టుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కొంతమంది మతఛాందసవాదులు ఇలాంటి హత్యలు చేసి మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టడం దురదృష్టకరమన్నారు. పుష్కరాల తొక్కిసలాట దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియాగా ప్రకటించారన్నారు. మౌజన్ ఫరూఖ్ కుటుంబానికి లక్ష రూపాయలు ఇచ్చి చిన్నచూపు చూశారని విమర్శించారు. ముస్లిములంతా చందాలు వేసుకుని ఫరూఖ్ కుటుంబాన్ని ఆదుకుంటామని, మసీదు ఆధునీకరణకు సహాయం చేస్తామని చెప్పారు. రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ఎస్‌పి బి.రాజకుమారి నిందితులను మూడురోజుల్లో పట్టుకుంటామని చెప్పినా, ఇప్పటివరకూ ఎటువంటి సమాచారమూ లేదన్నారు. ముస్లిములపై వివక్ష చూపుతున్న బిజెపి, టిడిపి ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో ముస్లిములు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బి.ఎస్.గౌస్ ఆజామ్, వైసిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కరీముల్లా, మైనార్టీ సెల్ కడప నగర అధ్యక్షులు ఎస్.ఎమ్.డి.షఫీ, కడప టౌన్ ప్రధాన కార్యదర్శి వి.గౌస్ అహ్మద్‌ఖాన్, వైసిపి ఫ్లోర్‌లీడర్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను ఉల్లంఘిస్తున్న సర్కారు

- భూ పరిరక్షణ కమిటీ సభలో పలువురు నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు)

సిఆర్‌డిఎ చట్టాన్ని ప్రభుత్వమే ఉల్లంఘిస్తోందని, 15 రోజుల్లో అభ్యంతరాలు చెప్పాలని చట్టంలో పేర్కొన్నా ప్రభుత్వం ఇంకా అభ్యంతరాలను ఎందుకు స్వీకరించడం లేదని పలువురు నాయకులు ప్రశ్నించారు. రాజధాని అమరావతి సీడ్ క్యాపిటల్ పరిధిలోని గ్రామాల్లో భూసేకరణకు ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనకు వ్యతిరేకంగా భూపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఉండవల్లిలో ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. సభకు రైతు సంఘం రాజధాని డివిజన్ నాయకులు కె.జగదీశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంగళగిరి వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1.60 లక్షల ఎకరాలను కాజేసి వాటిని కంపెనీలకు కట్టబెట్టి రాబోయే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మంగళగిరి వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి విమర్శించారు. ల్యాండ్ పూలింగ్‌కు వ్యతిరేకంగా వైసిపి, వామపక్షాలు గళమెత్తి ప్రజల తరపున పోరాడుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని, అక్రమ విధానాల ద్వారా రాజధాని నిర్మాణం చేపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములిచ్చిన రైతులకు ప్లాట్లు ఎక్కడిస్తారో? రిజిస్ట్రేషన్ ఎప్పుడు చేస్తారో? చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధానిలో వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, వృత్తిదారుల గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గ్రామ కంఠాల సంగతీ ఇంకా తేల్చలేదని పేర్కొన్నారు. ఎస్ఆర్ఎం లాంటి ప్రయివేటు వ్యక్తులకు రైతుల భూములను కారుచౌకగా కట్టబెడుతున్నారని, సిఆర్‌డిఎ చట్టంలో పేర్కొన్న సెక్షన్ 10 ప్రకారం మూడు పంటలు పండే భూమి తీసుకోవడానికి వీల్లేదని స్పష్టంగా పేర్కొన్నారని గుర్తు చేశారు. ఏపి భూపరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సిఎం చంద్రబాబుకు భూదాహం పట్టిందని, రాష్ట్రంలో 15 లక్షల ఎకరాలతో భూ బ్యాంకు ఏర్పాటుచేసి విదేశీ కంపెనీలు, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్ట పూనుకున్నారని విమర్శించారు. రాజధాని నిర్మాణానికి 5వేల ఎకరాలు సరిపోతుందని, పూలింగ్ పేరుతో 35 వేల ఎకరాలు సమీకరించారని, ప్రభుత్వ, అటవి భూములు మరో 60 వేల ఎకరాలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేశారని తెలిపారు. సిపిఎం సిఆర్‌డిఎ కన్వీనర్ సిహెచ్.బాబురావు మాట్లాడుతూ.. రాజధాని డిజైన్ల కోసమే మూడేళ్లు పాటు ప్రపంచమంతా తిరిగి వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారని, అసలైన రాజధాని నిర్మాణం పూర్తికి ఎన్నేళ్లు పడుతుందో చెప్పాలని అన్నారు. రైతుల నుంచి సేకరించిన భూముల్లో 1690 ఎకరాలు సింగపూర్ కంపెనీలకు అప్పగించింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. భూ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పూల పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. రాజధాని ప్రాంతంలో రైతులపై తీవ్ర నిర్బంధం కొనసాగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. సభలో ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు పి.నరసింహారావు, వైసిపి రాష్ట్ర నాయకులు టి.రామకృష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం.రవి పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న భూ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వి.వెంకటేశ్వర్లు



విజయవాడలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో 2018 డైరీ, క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు బాబురెడ్డి తదితరులు

అమరావతిలో ప్రభుత్వ విద్యాసంస్థల్ని నెలకొల్పాలి

యుటిఎఫ్ డైరీ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ బొడ్డు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రభుత్వ విద్యాసంస్థల్ని నెలకొల్పాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. యుటిఎఫ్-2018 డైరీని ఆయన విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకు పాఠశాలలు వేదికలుగా మార్చారని, దీనివల్ల విద్యా బోధనకు ఆటంకం కలుగుతోందన్నారు. బోధనేతర పనులకు టీచర్లను పంపుతూ, విద్యార్థుల్ని ర్యాలీలు, సమావేశాల పేరుతో పాఠశాలలకు సంబంధం లేని విషయాల్లో కూడా భాగస్వామ్యం చేసే విధానాల్ని విరమించుకోవాలన్నారు. రాష్ట్రప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు 30 శాతాన్ని కేటాయించాలని యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి పి బాబురెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వమేర్పడి నాలుగేళ్లు కావస్తున్నా విద్యశాఖలో అభివృద్ధి లేదని స్వయంగా ముఖ్యమంత్రే వెల్లడించారన్నారు. అక్షరాస్యతలో రాష్ట్రాన్ని 2029 నాటికి ప్రథమ స్థానంలోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఆచరణలో అందుకు తగ్గట్టుగా బడ్జెట్ కేటాయింపులు లేవన్నారు. కార్పొరేట్‌లను ప్రోత్సహించే సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ చట్టాన్ని విరమించుకోవాలన్నారు. ప్రభుత్వ అనుబంధ సంస్థ పాఠశాలలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తేవాలని కోరారు. కోర్టు కేసుల వల్ల ఉమ్మడి సర్వీస్ రూల్స్ ఆగిపోయాయని, దీనిపై ప్రభుత్వ స్పందన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు కేసు పరిష్కారమయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అధ్యక్షులు షేక్ సాబ్జీ మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నారు. పాత పెన్షన్ సమితి ఆధ్వర్యంలో జనవరి 9న తాలూకా స్థాయిలో జరిగే ధర్నాల్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పిఆర్‌సి అరియర్స్, డిఎ బకాయిలు చెల్లించాలని, 11వ పిఆర్‌సి కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. స్పెషల్ టీచర్ల నోషనల్ ఇంక్రిమెంట్లు, 2008 టీచర్ల హామీ పత్రాల ఫిక్సేషన్ రివైజ్ చేయాలన్నారు. జనవరి 29న ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ర్యాలీ, ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎ కృష్ణ సుందరరావు, కృష్ణా జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ, ప్రాజెక్టుల కోసం పోరాటాలు

ప్రజాశక్తి - కడపఅర్బన్

జిల్లాలో భారీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం, ప్రాజెక్టుల పూర్తి కోసం సిపిఎం పోరాటాలను ఉధృతం చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ, ప్రాజెక్టుల పూర్తి కోసం, జిల్లాకు వనరులు తీసుకురావడానికి చేసిన పోరాటాల్లో పలువురు సహకరించారని తెలిపారు. 2018లో సిపిఎం ఉక్కు పరిశ్రమ సాధన కోసం ఉద్యమాలు చేస్తుందని చెప్పారు. భారీ ఉక్కు పరిశ్రమ వస్తే 30వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. పోలవరంతో పాటు రాయలసీమలోని ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కోసం వైపిసి ప్రయత్నించకపోతే ఈ ప్రాంత ద్రోహిగా భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమ, ప్రాజెక్టుల పూర్తి, ప్రత్యేక ప్యాకేజ్ కోసం పోరాటాలకు జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికులు, వ్యాపారులు సహకరించి భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. పోరాటాలన్నింటికీ అన్ని రకాల అండదండలు అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కర్నూలులో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఓబులు
- కర్నూలు నగర కార్యదర్శిగా ఎం.రాజశేఖర్, కల్లూరు అర్బన్ కార్యదర్శులుగా టి.రాముడు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

వామపక్ష ప్రజాతంత్రవాదులను కలుపుకొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఓబులు కార్యకర్తలకు సూచించారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లోని సుబ్బయ్య ప్రాంగణంలో సిపిఎం నగర 18వ మహాసభ, కల్లూరు 5వ జోన్ సభలు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సభలకు పాణ్యం డివిజన్ కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ముందుగా సుందరయ్య కూడలిలో పార్టీ జెండాని సిపిఎం సీనియర్ నాయకులు ఇ.పుల్లారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం కెకె భవన్‌లో కర్నూలు నగర మహాసభ ప్రారంభమైంది. నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అంజిబాబు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.


సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఓబులు మహాసభలను ప్రారంభించి మాట్లాడారు. కర్నూలు నగరంలో రద్దీ తగ్గించేందుకు ఫ్లైఓవర్ బ్రిడ్జీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలు సర్వజన వైద్యశాలను రూ.200 కోట్లతో నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలన్నారు. రాయలసీమ, ఉర్దూ యూనివర్శిటీలకు ప్రతి సంవత్సరం రూ. 50 కోట్లు కేటాయించి అభివృద్ధితో పాటు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని కోరారు. యూనివర్శిటీలోని అన్ని పోస్టులను భర్తీ చేయాలని, గడియారం ఆసుపత్రిలో వైద్యులను నియమించి రూ.200 కోట్లతో అభివృద్ధి చేయాలన్నారు. ఆర్‌ఎస్ రోడ్డు వద్ద ఇఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, వరద రక్షణ గోడలు నిర్మించాలని తదితర సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఎం నగర కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం 17 మందితో అర్బన్ సిపిఎం నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. అర్బన్ కార్యదర్శిగా రాజశేఖర్ కల్లూరు అర్బన్ కమిటీ కార్యదర్శిగా టి.రాముడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభల్లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.షడ్రక్, జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు పి.నిర్మల, నాయకులు రాముడు, సాయిబాబా, రాజశేఖర్, అబ్దుల్లా, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

హిరమండలంలో మళ్లీ ఇళ్లు కూల్చివేత

'వంశధార' నిర్వాసిత గ్రామాల తరలింపు పూర్తి

ప్రజాశక్తి- హిరమండలం (శ్రీకాకుళం జిల్లా)

వంశధార నిర్వాసితుల పరిహారం, పునరావాసం తదితర సమస్యలను పరిష్కరించకుండానే ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లాలోని వంశధార నిర్వాసిత గ్రామాలన్నింటినీ నేలమట్టం చేసింది. ఇప్పటికే హిరమండలంలో 12, కొత్తూరులో ఆరు, ఎల్ఎన్‌పేట మండలంలో ఒక నిర్వాసిత గ్రామంలోని ఇళ్లను అధికారులు కూల్చివేసి గ్రామస్తులను తరిమేశారు. చివరగా ఆదివారం హిరమండలం మేజర్ పంచాయతీలోని చెరువుగట్టు వీధి, గాంధీనగర్, పెరికి వీధుల్లోని 150 ఇళ్లను కూల్చివేశారు. పాతపట్నం సిఐ బి.ఎస్.ఎస్.ప్రకాష్ ఆధ్వర్యాన పాతపట్నం, హిరమండలం, సారవకోట, మెళియాపుట్టి మండలాల్లోని పోలీసుల బందోబస్తు నడుమ రెవెన్యూ, వంశధార అధికారులు ప్రొక్లెయినర్లతో ఇళ్లను కూల్చివేయించారు. వంశధార జలాశయంలో భాగంగా గట్టు నిర్మాణం నుంచి వంద మీటర్ల దూరం వరకూ గల సేఫ్టీ ప్లేస్‌లోని ఇళ్లను తొలుత నేలమట్టం చేశారు. కొన్నేళ్లుగా నివాసముంటున్న ఇళ్లను కూల్చివేస్తున్న సమయంలో పలువురు నిర్వాసితులు కన్నీటిపర్యంతమయ్యారు. నిర్వాసితుల సామగ్రిని పునరావాస ప్రాంతాలకు ఉచితంగా తరలించేందుకు తహశీల్దార్ కాశీప్రసాద్ వాహనాలను ఏర్పాటు చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని పలువురు నిర్వాసితులు తహశీల్దార్‌ను కోరారు. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో తహశీల్దార్ కార్యాలయం వెనుక భాగాన కేటాయించిన పునరావాస ప్రాంతానికి బాధాతప్త హృదయాలతో నిర్వాసితులు తరలివెళ్లారు. నిర్వాసితుల ఇళ్లను పడగొట్టే ముందు హిరమండలం మండల కేంద్రంలో ఉదయం నుంచే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



శ్రీకాకుళం జిల్లా హిరమండలంలో యంత్రాలతో నేలమట్టం చేస్తున్న ఇళ్లు

విజెఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార, విశాఖ

వైజాగ్ జర్నలిస్టు ఫోరం (విజెఎఫ్) ఆధ్వర్యాన రూపొందించిన జర్నలిస్టుల డైరీ, క్యాలెండర్‌ను ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ హెచ్‌వై.దొర, జాయింట్ పోలీసు కమిషనర్ రవికుమార్ మూర్తి, సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఉప కులపతి జిఎస్ఎన్.రాజు, వైసిపి నాయకులు మళ్ల విజయ్‌ప్రసాద్ తదితరులు ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం జర్నలిస్టులకు డైరీ, క్యాలెండర్, మిఠాయిలు పంపిణీచేశారు. విశాఖ సీతమ్మధారలోని నార్ల వెంకటేశ్వరరావు భవనంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ, విజెఎఫ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయనమన్నారు. సమాజ అభివృద్ధికి కీలకపాత్ర పోషించేది జర్నలిస్టులని, అటువంటి వారి సంక్షేమానికి కృషి చేస్తున్న విజెఎఫ్ క్లబ్‌కు అభినందనలు తెలుపుతున్నామన్నారు. విజెఎఫ్ చేపట్టే కార్యక్రమాల్లో తమను భాగస్వామ్యం చేయడం ఆనందంగా ఉందన్నారు. జర్నలిస్టులందరికి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

భూకబ్జారాయుళ్ల పేర్లు బహిర్గతం చేయాలి

వైసిపి సీనియర్ నాయకులు బొత్స

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖలో సిట్ దర్యాప్తు ముగిసినట్లు పత్రికల్లో వచ్చిందని, దర్యాప్తులో ఉన్న భూకబ్జారాయుళ్ల పేర్లను బహిరంగం చేసి శిక్ష విధించాలని వైసిపి సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. 2017లో విశాఖలో భూ కబ్జాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయని తెలిపారు. విశాఖ జగదాంబ కూడలిలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాస్వామ్యం అపహాస్యమైందని విమర్శించారు.. సిట్ నివేదికను ప్రభుత్వం ముందు పెడితే నిందితులను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు డిమాండ్ చేసే నాయకులు తెలుగుదేశం పార్టీలో ఉన్నారని ఆరోపించారు. అటువంటి వారికి అవకాశం ఇవ్వకుండా సిట్ నివేదికను విశాఖలో బహిర్గతం చేయాలని కోరారు. కబ్జాలను కప్పి పుచ్చుకునేందుకు ఎన్ని విశాఖ ఉత్సవ్‌లను నిర్వహించినా విశాఖ ఇమేజ్ పెరగదన్నారు. 2018లోనైనా ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేసి మంచి పాలనను అందించాలని కోరారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు సరికాదు

ఇసిఆర్‌సిడబ్ల్యూయు అభ్యంతరం

ప్రజాశక్తి- విజయవాడ

విజయనగరం రైల్వే స్టేషన్‌లో ఆరేళ్లుగా పని చేస్తున్న 76 మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులను విధులను నుంచి తొలగించడం సరికాదని ఈస్ట్‌కోస్టు రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు (సిఐటియు) వివిఎల్. నరసింహులు ఆదివారం ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. శ్రీ కృష్ణ కనస్ట్రక్షన్ వర్క్సుకు చెందిన కార్మికులు యూనియన్ పెట్టుకుని జీతాలు, జిఓ రేటు ప్రకారం కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ ఇవ్వాలని మేనేజ్‌మెంటును అడిగితే వారిని విధుల్లో నుంచి తొలగించిందన్నారు. ఈ చర్యలను నిరసిస్తూ మూడ్రోజుల నుంచి నిరసనలు, ధర్నాలు చేపట్టారని తెలిపారు. కాంట్రాక్టర్ మొండి వైఖరితో కార్మికుల ఉపాధి దెబ్బతిందని చెప్పారు. వెంటనే యాజమాన్యం కలుగజేసుకుని కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విశాఖ లోని రైల్వే, లేబర్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే యూనియన్ ద్వారా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

జన్మభూమిని జయప్రదం చేయండి

మంత్రి కాల్వ శ్రీనివాసులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో జన్మభూమి కార్యక్రమం పండగ వాతావరణం తలపించేలా నిర్వహించాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాల్వ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ఆదివారం కర్నూలులో అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఈ నెల రెండు నుంచి జరిగే జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రతిరోజూ ప్రభుత్వం నిర్ధేశించిన అంశాలపై చర్చించాలని సూచించారు. జిల్లాలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని చెప్పారు.

ప్రజ్ఞ

జవాబులు

1. ఇజ్రాయిల్
2. బెంగళూరు
3. వినయ్ సహస్రబుద్ధే
4. 31, 5. అమెరికా

ప్రత్యేకం

కంటి తుడుపుగా మద్దతు ధర

- అప్పులపాలవుతున్న అన్నదాత
- నాలుగేళ్లలో భారీగా పెరిగిన వ్యవసాయ పెట్టుబడులు
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



విజయనగరంలో యంత్రంతో వరి నూర్పు చేస్తున్న రైతులు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

పెరిగిన వ్యవసాయ పెట్టుబడులకు అనుగుణంగా ప్రభుత్వాలు మద్దతు ధరలను పెంచకపోవడంతో రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. గత నాలుగేళ్లలో ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగాయి. ఉబాలు, నాట్లు సమయంలో కూలీల కొరత ఏర్పడుతోంది. ఇటీవల కాలంలో వరి కోత, నూర్పులు, కలుపు మొక్కలు తీయడం వంటి అవసరాలకు కూడా యంత్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. చిన్న భూకమతాలుగల విజయనగరం, శ్రీకాకుళం వంటి జిల్లాల్లో కూడా వ్యవసాయ యాంత్రీకరణ పెరిగింది. దాదాపు 90 శాతం మంది రైతులు ట్రాక్టర్లతోనే దుక్కులు, ఉబాలు పడుతున్నారు. గత నాలుగేళ్లలో డీజిల్ ధర 20 శాతం పెరగడంతో వ్యవసాయ యంత్రాల అద్దె అమాంతంగా పెరిగిపోయింది. 2014లో గంటకు రూ.500 ఉన్న ట్రాక్టర్ అద్దె ప్రస్తుతం రూ.700కు పెరిగింది. ప్రభుత్వం ప్రకటించిన అరకొర మద్దతు ధర కూడా రైతులకు దక్కడం లేదు. రైతులు అప్పుల పాలవుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

ఏటేటా కేంద్రం పెంచుతున్న ధాన్యం మద్దతు ధర కంటితుడుపుగా ఉంది. గతేడాది సాధారణ రకం రూ.1,470, ఎ-గ్రేడ్ రూ.1,510 ఉండేది. ఈ ఏడాది కేవలం రూ.80 పెరిగింది. 2014 నుంచి ఇప్పటివరకు రూ.190 మాత్రమే పెరుగుదల ఉంది. మొక్కజొన్న మద్దతు ధరను ప్రభుత్వం ఈ ఏడాది రూ.60 మాత్రమే పెంచింది. దీంతో క్వింటాల్‌కు రూ.1,425 మాత్రమే ధర చేరింది. పెంచిన పత్తి మద్దతు ధర రూ.160తో కలిపి సాధారణ రకం పత్తి రూ.4,020, ఎ-గ్రేడ్ 4,320 చొప్పున ఉంది. గత నాలుగేళ్లలో పత్తి మద్దతు ధర రూ.270, మొక్కజొన్న మద్దతు ధర రూ.170 నుంచి రూ.275 వరకూ పెరిగింది. రాగులుకు రూ.350, సజ్జలకు రూ.115 చొప్పున మాత్రమే మద్దతు ధరలు పెరిగాయి. విజయనగరం జిల్లాలో ఈ ఏడాది 175 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఆచరణలో సగానికి సగం కూడా ఏర్పాటు కాలేదు. దీంతో రైతుల నుంచి దళారులు 80 కిలోల ధాన్యాన్ని రూ.1500 మించి కొనుగోలు చేయడం లేదు. పత్తి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు కూడా మొక్కుబడిగానే ప్రారంభమయ్యాయి. పత్తిని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులు రూ.3,500 మించి ఇవ్వడం లేదు. మొక్కజొన్న, రాగులు, సజ్జల కొనుగోలులోనూ ఇదే రకమైన దోపిడీ సాగుతోంది.

సంక్షిప్తం

బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దు

సీతంపేట (శ్రీకాకుళం) : బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చవద్దని గిరిజన సంఘం నేత బిడ్డిక అప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పొందిన జాతులను ప్రభుత్వాలు రాజకీయ లబ్ధికోసమే ఇటువంటివి ప్రకటిస్తున్నాయన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు బియ్యం, దుప్పట్లు పంపిణీ

కర్నూలు కార్పొరేషన్ : నగరంలోని లెప్రసీ కాలనీకి చెందిన 50 మంది పేద, కుష్టు వ్యాధిగ్రస్తులకు సాయి ఎడ్యుకేషనల్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ(సెరూడ్స్) స్వచ్ఛంద సేవా సంస్థ, సేవ్ ది చైల్డ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బిస్కెట్లు, బియ్యం, దుప్పట్లు సెరూడ్స్ అధ్యక్షులు మల్లికార్జున ఆదివారం పంపిణీ చేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

వీరఘట్టం (శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మండల కేంద్రంలో ప్రియాంక ఫిల్లింగ్‌స్టేషన్ వద్ద ఎస్ఐ జి.అప్పారావు ఆదివారం ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈయనతో పాటు సిబ్బంది ఉన్నారు

రోడ్డు భద్రత అందరిది

ప్యాపిలి (కర్నూలు) : రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత మన అందరిపై ఉందని జలదుర్గం ఎస్ఐ సురేష్ అన్నారు. ఆదివారం జలదుర్గం గ్రామంలో ప్రధాన కూడలీల్లో పలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. బ్యానర్లల్లో మద్యం తాగి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు.

విద్యార్థి మృతికి ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి

బనగానపల్లె అర్బన్ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి సురేంద్రనాథ్ రెడ్డి మృతదేహన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో బనగానపల్లె టిడిపి ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి సందర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఢిల్లీ పబ్‌లో కాల్పులు
వ్యక్తికి గాయాలు

న్యూఢిల్లీ : దక్షిణ ఢిల్లీ గ్రేటర్ కాలిష్ ప్రాంతంలోని ఓ పబ్‌లో పార్కింగ్ వివాద విషయమై ఉమేష్ అనే వ్యక్తి వినయ్‌పై కాల్పులు జరిపాడని పోలీసులు తెలిపారు. సంఘ వ్యతిరేక శక్తులను బార్‌లోకి అనుమతించినందుకు పబ్ లైసెన్స్‌ను రద్దు చేయడానికి లైసెన్స్ శాఖకు లేఖను రాస్తామని పోలీసులు పేర్కొన్నారు. కాల్పులపై సమాచారం అందడంతో ఘటనాస్థలానికి చేరుకున్న తాము గాయపడిన వినయ్‌ను ఎయిమ్స్ ట్రామా కేర్ సెంటర్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. అతని పరిస్థితి మెరుగుపడిందన్నారు. ఉమేష్‌ను ప్రజలు చితకబాది, తుపాకిని స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. సిసి పుటేజ్ ఆధారంగా మాత్రమే ఈ సంఘటన జరిగిన సమయాన్ని చెప్పగలమని డిప్యూటీ పోలీస్ కమిషనర్ రోమిల్ బానియా పేర్కొన్నారు.

తొలి పర్యటన
ప్రపంచంలోనే పౌరసత్వం పొందిన మొట్టమొదటి రోబోట్‌గా పేరుగాంచిన సౌదీ అరేబియాకు చెందిన సోఫియా తొలిసారిగా భారత్ పర్యటనకు వచ్చింది.



ఆనందం
రాజకీయాల్లోకి వస్తున్నానంటూ సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రకటించడంతో ఆనందంతో చిందులు వేస్తున్న చెన్నైలోని ఆయన అభిమానులు



ఐదు మార్పులనే కోరాం!
పద్మావతి సినిమాపై ప్రసూన్ జోషి

న్యూఢిల్లీ : సంజయ్ లీలా భన్సాలీ నిర్మించిన పద్మావతి సినిమాకు యుఎ సర్టిఫికెట్ ఇచ్చేందుకు గాను ఐదు మార్పులను మాత్రమే కోరామని, ఎక్కడా కట్‌చేయమని కోరలేదని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికెషన్ (సిబిఎఫ్‌సి) చైర్‌పర్సన్ ప్రసూన్ జోషి శనివారం వివరణ ఇచ్చారు. ఈ సినిమా విడుదలపై గత కొన్ని నెలలుగా అనిశ్చితి నెలకొన్న సంగతి తెలిసిందే. దీనిపై శనివారం పరిశీలక కమిటీ సమావేశం నిర్వహించిన తరువాత కొన్ని మార్పుల అనంతరం యుఎ సర్టిఫికెట్ ఇవ్వాలని నిర్ణయించినట్లు సిబిఎఫ్‌సి తెలిపింది. ఇది చారిత్రక సంబంధం లేని కల్పిత కథగా ప్రకటించాలని నిర్మాతను పరిశీలక కమిటీ కోరినట్లు జోషి తెలిపారు. అలాగే సినిమా పేరును కూడా పద్మావతి బదులు పద్మావత్‌గా మార్పు చేయాలని సూచించినట్లు ఆయన చెప్పారు. సినిమాలోని ఘూమర్ పాటను కూడా మార్పు చేయాలని కోరినట్లు జోషి తెలిపారు. పాత్రకు తగినవిధంగా ఘూమర్ పాటను చిత్రీకరించాలని కోరినట్లు చెప్పారు. సినిమాలో తప్పుగా చూపించిన చారిత్రక ప్రదేశాల చిత్రీకరణలను కూడా సరిచేయాలని నిర్మాతలను కోరినట్లు జోషి వివరించారు.

రజనీతో బిజెపి పొత్తు పెట్టుకుంటే రాష్ట్రం వదిలి వెళ్తా : సుబ్రహ్మణ్య స్వామి

చెన్నై : ప్రముఖ నటుడు రజనీ కాంత్‌తో బిజెపి పొత్తు పెట్టుకుంటే తానీ రాష్ట్రం వదిలి మరో రాష్ట్రం వెళ్ళిపోతానని బిజెపి నేత సుబ్రమణ్య స్వామి అన్నారు. రాజకీయాల్లోకి వస్తానని, పార్టీ పెడతానని రజనీకాంత్ చేసిన ప్రకటనపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తమిళనాడులో వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల నాటికి రాజకీయ పార్టీని ప్రారంభిస్తానని ఆదివారం రజనీకాంత్ ప్రకటించారు. ఆయన ప్రకటనపై రాజకీయ నాయకులు తలో రకంగా స్పందించారు. ఇందుకు కొంత భిన్నంగా సుబ్రహ్మణ్యన్ స్వామి పైవ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీ పేరును, అభ్యర్థులను రజనీకాంత్ ప్రకటించిన తరువాత అతని విషయాలు బయట పెడతానని సుబ్రహ్మణ్య స్వామి మీడియాకు తెలిపారు. రజనీ కేవలం రాజకీయాలలోకి ప్రవేశిస్తాననే ప్రకటించారని, దానికి సంబంధించిన పత్రాలు, వివరాలు ఏవీ లేవని, అతను నిరక్షరాస్యుడని పేర్కొన్నారు. మీడియా మాత్రమే అతనికి అత్యధిక ప్రాధాన్యత నిస్తోందని, తమిళనాడు ప్రజలు చాలా తెలివైన వారన్నారు. రజనీకాంత్ రాజకీయాలలోకి వస్తానని ప్రకటించిన వెంటనే తొలిసారిగా ఆయనను నటుడు కమల్‌హాసన్ అభినందించారు. డిఎంకె కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకె స్టాలిన్, టిటివి దినకరన్, తమిళనాడు బిజెపి అధ్యక్షుడు తమిళ్‌సాయ్ సౌందర రాజన్ తదితరులు రజనీకాంత్‌ను అభినందించిన వారిలో ఉన్నారు.

ట్రావెల్ ఏజెంట్ల అక్రమాలు
దర్యాప్తు చేస్తున్న సిబిఐ

న్యూఢిల్లీ : రైల్వే తత్కాల్ బుకింగ్ సిస్టమ్‌ను ట్రావెల్ ఏజెంట్లు చట్ట విరద్ధంగా ఉపయోగిస్తున్నారా? అనే విషయమై సిబిఐ దర్యాప్తు చేస్తున్నది. రైల్వే సొంత భద్రతా తనిఖీలను తప్పించుకుని ఏజెంట్లు అత్యధిక ధరలకు టిక్కెట్లను అమ్ముతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సిబిఐ దర్యాప్తు చేపట్టిందని సంబంధిత వర్గాలు ఆదివారం తెలిపాయి. ఈ వారంలో అజయ్ గార్గ్ అనే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తత్కాల్ అక్రమ సాఫ్ట్‌వేర్‌ను ఒక దానిని తయారు చేసి ట్రావెల్ ఏజెంట్లకు విక్రయించాడన్న ఆరోపణలపై గార్గ్‌ను సిబిఐ అరెస్టు చేసింది. అంతకు ముందు అజయ్ గార్గ్ తమతో కలిసి పనిచేశాడని సిబిఐ ప్రతినిధి అభిషేక్ దయాళ్ చెప్పారు. మరో సాఫ్ట్‌వేర్ వృత్తి నిపుణుడు అనిల్ గుప్తాను కూడా అరెస్టు చేశారు. గార్గ్ అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్‌ను పోలిన సాఫ్ట్‌వేరే ట్రావెల్ ఏజెంట్ల వద్ద ఉన్నట్లు సిబిఐ సందేహిస్తోంది. దీనికి సంబంధించిన కొన్నిఅక్రమ సాఫ్ట్‌వేర్‌లు ఆన్‌లైన్ మార్కెట్‌లో తేలికగా కొనుగోలు చేయవచ్చునని పిటిఐ వార్తా సంస్థ పేర్కొంది.

ముస్లిం మహిళలకు పరిష్కారం
తలాక్ బిల్లు ఆమోదంపై మోడీ



న్యూఢిల్లీ : ముస్లిం మహిళలు సంవత్సరాల తరబడి తాము పొందుతున్న బాధలకు ఎట్టకేలకు పరిష్కార మార్గం లభించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి అన్నారు. లోక్‌సభలో తలాక్ బిల్లు ఆమోదం పొందిన తరువాత మోడి తొలిసారిగా దానిపై వ్యాఖ్యానించారు. ముస్లింలలో నెలకొన్న తక్షణ ట్రిపుల్ తలాక్ ఆచారంతో ఆ మతానికి చెందిన పలువురు మహిళలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఇప్పుడు దాని నుంచి విముక్తి పొందే ఒక మార్గాన్ని కనుగొన్నారన్నారు. 85వ శిగిరి యాత్ర ఉత్సవాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తూ మోడీ మాట్లాడారు. ముస్లిం మహిళల (వివాహ హక్కుల రక్షణ) బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఎఐఎంపిఎల్‌బి) దీనిని వ్యతిరేకించి నప్పటికి బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. లోక్‌సభలో ప్రవేశపెట్టిన తలాక్ బిల్లు షరియా నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నదని, దానిని ఉప సంహరించుకోవాలని ఎఐఎంపిఎల్‌బి కేంద్రాన్ని కోరింది. తలాక్‌ను నాన్ బెయిలబుల్ నేరంగా పరిగణిస్తూ లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు ముస్లిం మహిళలకు చట్టపరమైన హక్కులను కల్పిస్తుంది. ఇదే సమయంలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందేందుకు ప్రజలందరూ కలిసి పనిచేయా లని 2017 ముగుస్తున్న సందర్భంగా ప్రధాని ప్రజలకు విజ్ఞప్తి చేశారు అవినీతి, నల్లధనం, అక్రమ ఆస్తులు, ఉగ్రవాదాలను అరికట్టేందుకు కొత్త సంవత్సరంలో ప్రభుత్వం పలు సంస్కరణల తీసుకురానున్నట్లు చెప్పారు.

మహిళలతోనే హజ్‌యాత్ర
కేంద్ర మంత్రి అబ్బాస్ నఖ్వీ



న్యూఢిల్లీ : ఈ ఏడాది హజ్ యాత్రకు దాదాపు 13 వందల మంది ముస్లిం మహిళలు తమ వెంట పురుషులు లేకుండా వెళ్ళనున్నారు. ముస్లిం మహిళలు హజ్‌యాత్రకు వెళ్ళాలంటే పురుషులు తోడు లేనిదే వెళ్ళే వారు కాదు. ఇప్పుడు దాని నుంచి వారికి మినహా యింపు లభించిందని మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ ఆదివారం ప్రకటిం చారు. లాటరీ సిస్టమ్‌లో వారికి మినహాయింపు లభించిందని, వారు నేరుగా యాత్రకు వెళ్ళవచ్చునని ఆయన తెలిపారు. మగవారి తోడు లేకుండా హజ్‌ర్ వెళ్ళేందుకు దరఖాస్తు చేసుకున్న ముస్లిం మహిళలకు ప్రాధాన్యత కల్పించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్న వెంటనే నఖ్వీ ఈ ప్రకటన చేశారు. మగవారి సమక్షంలోనే హజ్ యాత్రకు వెళ్ళాలన్న నిబంధన చట్ట విరుద్ధమైనదని మోడీ పేర్కొన్నారు. ఒంటరిగా హజ్ వెళ్ళాలనుకున్న మహిళలకు ప్రాధాన్యతనివ్వాలని మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను ఆదేశించినట్లు మోడీ చెప్పారు.

నేనొచ్చేశా !



మొదటి పేజీ తరువాయి

మార్పు అవసరమని, మార్పునకు ఇదే సరైన సమయమని, ఇందుకోసం తన వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తానని చెప్పారు. ఈ క్రమంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. ఏడాది కాలంగా తమిళనాట రాజకీయ పరిణామాలు రాష్ట్రాన్ని నవ్వులపాలు చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు సరైన నిర్ణయం తీసుకోకుంటే ఆ దోషం నన్ను వెంటాడుతుందన్నారు. త్వరలోనే కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తానని ఆయన ప్రకటించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తామని తెలిపారు.

అభిమానులనుద్దేశించి రజనీకాంత్ చేసిన ప్రసంగం కాస్తంత ఆధ్యాత్మిక దోరణిలో సాగింది. భగవద్గీత శ్లోకాన్ని ఉటంకిస్తూ 'వ్యక్తి నిష్కామ కర్మతో తన కర్తవ్యాన్ని నిర్వహించాలి. ఫలితాన్ని దైవానికి వదిలివేయాలి. ఈ శ్లోకం స్ఫూర్తితోనే రాజకీయ ప్రవేశంపై నిర్ణయం తీసుకున్నా' అని ఆయన చెప్పారు. 'మంచి చేయండి, మంచి చేయగలిగినపుడు మాత్రమే మాట్లాడండి..కేవలం నినాదాలకు పరిమితం కావద్దు' అని ఉద్బోధించారు.

2021లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 234 స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని రజనీ ప్రకటించారు. అయితే 2019 పార్లమెంటరీ ఎన్నికల్లో పోటీ చేసే విషయంపై తగు సమయంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోపు ఎన్నికల హామీలను నెరవేర్చలేకపోతే తమ పార్టీ గద్దెదిగుతుందని ఆయన స్పష్టం చేశారు. తాను అధికారం కోసం రాజకీయాల్లోకి ప్రవేశించటం లేదన్నారు. తాను కావాలనుకుంటే ముఖ్యమంత్రి పదవి తన వద్దకు ఎప్పుడో వచ్చి వుండేదని, తాను దానిని దూరంగా వుంచానని ఆయన చెప్పారు. 40వ ఏటే ముఖ్యమంత్రి పదవిని అధిష్టించే అవకాశం వచ్చినప్పటికీ తనకు ఆ వుద్దేశం లేనందున దానికి దూరంగా వున్నానని ఆయన వివరించారు. తమ పార్టీకి 'కేడర్లు' అవసరం లేదని, కావాల్సింది కాపలా దారులని చెప్పారు. తాను ఈ కాపలాదారులకు అధినేతగా వ్యవహరిస్తానన్నారు. ప్రతి గ్రామంలోని ప్రతి ఒక్కరినీ కలుస్తామని, పార్టీ శ్రేణులందరికీ తాను నిర్దేశించే తొలి లక్ష్యం ఇదేనని ఆయన చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ముందు తగు సమయంలో తమ పార్టీ విధానాలను, ఎన్నికల హామీలను వెల్లడిస్తామన్నారు.

పార్టీ మూల సూత్రాలు ఇవే

సొంతంగా కొత్త రాజకీయ పార్టీ పెడుతున్నట్టు ప్రకటించి తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ ఊహాగానాలకు తెరదించారు. తాను స్థాపించబోయే పార్టీ ఎలా ఉంటుందో సూచనప్రాయంగా వెల్లడించారు. సత్యం, కార్యం, అభివద్ధి (ట్రూత్, వర్క్, గ్రోత్) తమ పార్టీ మూల సూత్రాలుగా ఉంటాయని అభిమానులతో చెప్పారు. చెడిపోయిన రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే తాను పాలిటిక్స్‌లోకి వస్తున్నట్టు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిజాయితీ, జవాబుదారితనం పెంచాల్సిన అవసరముందన్నారు.

మీడియా అంటే భయం

రాజకీయాలంటే తనకు భయం లేదని మీడియా అంటేనే భయపడతానని తలైవా అన్నారు. ఈ విషయంలో తాను మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. దీని గురించి చో రామస్వామి గతంలో తనను హెచ్చరించారని, ఆయన లేకపోవడం పూడ్చలేని లోటన్నారు. ఆయన ఉండివుంటే తన కొత్త ప్రయాణంలో అండగా నిలిచేవారని పేర్కొన్నారు.

వివాదాల్లో చిక్కుకోవద్దు

తాను పార్టీ పెట్టే వరకు అభిమానులు ఎటువంటి రాజకీయ విభేదాల్లో చిక్కుకోవద్దని, పార్టీ నిర్మాణంలో పాలుపంచుకోవాలని అభిమానులను రజనీకాంత్ కోరారు. సరైన సమయంలో పార్టీని స్థాపిస్తానని, కలిసికట్టుగా పనిచేసి ముందుకు సాగుదామన్నారు. తలైవా ప్రకటనతో ఫ్యాన్స్ హర్షాతిరేకాలు తెలిపారు. తర్వాత అభిమానులతో రజనీకాంత్ ఫొటోలు దిగారు.

అభినందనల వెల్లువ

రాజకీయ రంగ ప్రవేశాన్ని ప్రకటించిన నటుడు రజనీకాంత్‌కు వివిధ రంగాల ప్రముఖుల నుండి అభినందనలు వెల్లువెత్తాయి. తమిళనాట ఇప్పటికే తన రాజకీయ రంగ ప్రవేశాన్ని ప్రకటించిన మరో ప్రఖ్యాత నటుడు కమలహాసన్ రాజకీయాల్లోకి రజనీ రావడాన్ని స్వాగతించి అభినందనలు తెలిపారు. తమ పార్టీలో చేరాల్సిందిగా గతంలో ఆహ్వానించిన బిజెపి కూడా రజనీ రాజకీయ అరంగేట్రాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపింది. 'రజనీ రాజకీయ ప్రవేశాన్ని ఆహ్వానిస్తున్నాం. అవినీతికి తావులేని స్వచ్ఛమైన పాలనను ప్రజలకు అందించాలన్న ఆయన లక్ష్యంతో ఏకీభవిస్తున్నాం' అని బిజెపి తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు టి సౌందరరాజన్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. బాలివుడ్ సినీ దిగ్గజం అమితాబ్ బచన్ కూడా రజనీ ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. రజనీ రాజకీయ ప్రవేశాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామని, సినీ రంగంలో మాదిరిగానే, రాజకీయాల్లోనూ ఆయన పూర్తి విజయం సాధించాలని అమితాబ్ ఆకాంక్షించారు.

చిత్తూరులో సందడి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తున్నానంటూ ప్రకటించడంతో ఆయన అభిమానుల్లో సందడి నెలకొంది. ఈ సందర్భంగా చిత్తూరులోని రజనీకాంత్ అభిమానులు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర సరిహద్దులో ఉన్న చిత్తూరులో తమిళ ప్రభావం ఎక్కువగా ఉంది. రజనీ రాజకీయాల్లోకి వస్తానంటూ ప్రకటన చేయడంతో ఆయన అభిమానులు స్థానిక గాంధీ విగ్రహం ఎదుట టపాకాయలు కాల్చి పండగ చేసుకున్నారు. ఈ సందర్భంగా రజనీకాంత్ అభిమాన సంఘం నాయకులు



బుల్లెట్ అప్పు మాట్లాడుతూ తమిళనాడు ప్రజలు, అభిమానులు రజనీ కోసం ఎదురుచూస్తున్నారని సూపర్‌స్టార్ ప్రకటనతో తమిళ రాజకీయాల్లో మార్పులు సంభవిస్తాయన్నారు.

ఈ మిలినియం పిల్లలు నవ భారత ఓటర్లు
మన్‌కి బాత్‌లో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : దేశంలో 18 నుంచి 25 సంవత్సరాల వయస్సున యువకులలో ప్రేరణ, శక్తి, ఉత్సుకతలే తాను కలలుగన్న నవ భారతాన్ని నిర్మించగలవని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. మోడీ ఆదివారం రేడియో కార్యక్రమం మన్‌కీ బాత్‌లో ప్రసంగించారు. ప్రతి ఒక్కరి కలలు, ఆకాంక్షలు నెరవేర్చేవిధంగా నవభారతం నిర్మాణమవుతుందన్నారు. ఆ నవ భారతం కుల, మత, అవినీతి, ఉగ్రవాద రహితంగా ఉంటుందన్నారు. నవ భారత మార్గదర్శ శక్తులు శాంతి, సమగ్రత, ఔదార్యాలను కలిగి ఉంటాయన్నారు. మన్ కి బాత్‌లో మోడీ ఈ ఏడాది చివరి ప్రసంగం చేస్తూ ఈ ఏడాది జనవరి 1కి ఒక ప్రత్యేకత ఉన్నదన్నారు. 21వ శతాబ్దంలో జన్మించిన వారందరూ తమ ఓటు హక్కును పొందుతారన్నారు. వారి ఓటు నవ భారత నిర్మాణానికి పునాది వంటిదన్నారు. నవ భారత్ భావనను 2016 నుంచి మోడీ ప్రస్తావిస్తూనే ఉన్నారు. అంతకుముందు మన్‌కి బాత్ కార్యక్రమంలో ఆయన విఐపి సంస్కృతిని ప్రస్తావించారు.అది మన దేశ సంస్కృతిలో భాగం కాదన్నారు. నవ భారతానికి కావలసింది విఐపి సంస్కృతి కాదని, ఇపిఐ (ఎవిరీ పర్సన్ ఈజ్ ఇంపార్టెంట్) సంస్కృతి అన్నారు.

ఈ ఏడాది దేశంలోని ప్రతి జిల్లాలోనూ మాక్ పార్లమెంట్ నిర్వహించాలన్నారు. మాక్ పార్లమెంట్‌లో 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సున్న యువకులు కూర్చుని 2022 నాటికి మన లక్ష్యాలను ఎలా సాధించగలమనే అంశంపై చర్చించి దేశ స్వాతంత్ర్య పోరాట యోధులు కలలు గన్న భారత్‌ను నిర్మిస్తారన్నారు. ఈ ప్రయాణంలో దేశంలోని యువతకు కొత్త అవకాశాలు సృష్టించబడతాయన్నారు. ప్రతి రంగంలోనూ నైపుణ్యాల అభివృద్ధి నుంచి ఆవిష్కరణలు, వ్యవస్థాపకత వరకు యువతకు అనేక అవకాశాలుంటాయన్నారు. నవ భారత నిర్మాణం కోసం యువత కొత్త అభివృద్ధి అవకాశాలను సులువుగా అందిపుచ్చుకునేలా ఒక వ్యవస్థను సృష్టించాల్సిన సమయమిదన్నారు.

బృహన్ ముంబయిలో అక్రమ కట్టడాల కూల్చివేత

ముంబయి : ముంబయి నగరంలో దాదాపు 314 రెస్టారెంట్ల వద్ద నిర్మించిన అక్రమ కట్టడాలను బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు శనివారం కూల్చివేశారు. వాటిల్లో ఏడింటికి సీల్ వేశారు. దాదాపు 624 రెస్టారెంట్లు అనధికార కట్టడాలను కలిగి ఉన్నాయి. నగరంలోని లోయర్ పారెల్‌లో ఉన్న కమలా మిల్స్‌లో ఫలహార శాలల వద్ద సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో 14 మంది మరణించిన ఒక్క రోజు తరువాత కార్పొరేషన్ అధికారులు కూల్చివేత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా 417 ఎల్‌పిజి సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని, 7 హోటళ్ళకు సీల్ వేశామని బిఎంసి అధికారులు తెలిపారు. అక్రమ కట్టడాల కూల్చి వేత కార్యక్రమాన్ని అధికారులు ఆదివారం కూడా కొనసాగించారు. శనివారం నాటి కూల్చివేత కార్యక్రమంలో కనీసం వెయ్యి మంది సిబ్బంది పాల్గొన్నారు. ముంబయిలోని 24 వార్డులకు గాను ఒక్కొక్క వార్డుకు మూడు బృందాలను ఏర్పాటు చేశారు. అగ్ని ప్రమాదం సంభవించిన స్థలాన్ని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ శుక్రవారం సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ కట్టడాలను యుద్ధ ప్రాతిపదికన కూల్చివేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అందులో భాగంగానే శని, ఆదివారాలలో అక్రమ కట్టడాల కూల్చివేత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సంఘటనకు సంబంధించి ఐదుగురు సిబ్బందిని సస్పెండ్ చేశారు.

మధ్యప్రదేశ్ మంత్రి గౌరీశంకర్‌పై లోకాయుక్త దర్యాప్తు

భోపాల్ : మధ్య ప్రదేశ్‌కు చెందిన సీనియర్ కేబినెట్ మంత్రి గౌరీ శంకర్ షెజ్వార్‌పై ఆ రాష్ట్ర లోకాయుక్త పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పన్ను చెల్లింపు దారుని ఖర్చుతో తన కుటుంబ సభ్యులను కలుపుకొని విహారయాత్ర చేశారని వచ్చిన ఆరోపణలపై లోకాయుక్త దర్యాప్తు చేస్తోంది. షెజ్వార్‌పై లోకాయుక్త పోలీసులు కేసు నమోదు చేశారు. షెజ్వార్ రాష్ట్రంలోని ప్రముఖ బిజెపి నేతలలో ఒకరు. ఏడు సార్లు శాసన సభ్యునిగా పనిచేశారు. ఎకో టూరిజం డెవలప్‌మెంట్ బోర్డు మాజీ సిఇఓ వినయ్ బర్మన్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. తమ పదవులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు వీరిపై ఉన్నాయి. షెజ్వార్ తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. తాను కర్ణాటక వెళ్ళానని, తన కుటుంబ సభ్యులు కూడా ఆయనతో పాటు వచ్చారన్నారు. ప్రభుత్వం మాత్రం అర్హులైన వారికి మాత్రమే చెల్లింపులు జరుపుతోందన్నారు. తన కుటుంబ సభ్యులకు తానే ఖర్చు పెట్టినట్లు చెప్పారు.

అమిత్‌షా కాల్ నితిన్ కూల్
తగిన శాఖలను ఇస్తానని హామీ



గాంధీనగర్ : గుజరాత్ డిప్యూటీ ముఖ్యమంత్రి నితిన్ పటేల్ తనకు సరైన శాఖలను కేటాయించకపోవడంతో అసంతృప్తి చెందినట్లు వార్తలు వెలువడ్డాయి. విజయ్‌రూపానీ బిజెపి ప్రభుత్వంలో ఆయనకు ఇచ్చిన కొత్త శాఖల నిర్వహణ బాధ్యతలు చేపట్టేందుకు రెండు రోజులుగా గైర్హాజరు కావడమే దీనికి కారణం. ఎట్టకేలకు ఆదివారం ఆయనకు కేటాయించిన శాఖలకు బాధ్యతలు నిర్వహించడానికి సమాయత్తం అయ్యారు. బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా తనకు ఫోన్ చేసి తగిన శాఖలను కేటాయిస్తానని హామీ ఇచ్చినందుకు సెక్రటరీయేట్ వెళ్ళి ప్రస్తుత శాఖ (రోడ్డు, భవనాలు, ఆరోగ్యం, మెడికల్ ఎడ్యుకేషన్, నర్మద, కాపిటల్ ప్రాజెక్ట్) బాధ్యతలను నిర్వహిస్తానని నితిన్ పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో కేటాయించిన ఆర్థిక, పట్టణాభివృద్ధి శాఖలను నుండి నితిన్ను తొలగించడంతో అసంతృప్తిని వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. శనివారం కూడా పదవి కోసం కాదని గౌరవం కోసం పోరాడుతున్నానని పేర్కొన్నారు. పార్టీలో తన గౌరవ మర్యాదలు తిరిగి పునరుద్ధరించాలని పేర్కొన్నారు.

సంక్షిప్తం

సిఎం కాన్వాయ్‌ను అడ్డుకున్నాడని..

లక్నో : యూపీ సీఎం కాన్వాయ్‌ను అడ్డుకున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. సోన్‌భద్ర ప్రాంతంలో బీజేపీ ఎమ్మెల్యే, అధికారులు కుమ్మక్కై ఇసుక అక్రమ తవ్వకాలకు చేస్తున్నారని..ఈ విషయాన్ని యోగి దృష్టికి తీసుకెళ్లేందుకే తాను ఈ ప్రయత్నం చేసినట్టు అతను తెలిపాడు. ఈ విషయాన్ని బీజేపీ నేతలకు విన్నవించినా ఫలితంలేదని.. ముఖ్యమంత్రికి నివేదించాలనుకున్నానని చెప్పాడు.

ఒకే వ్యక్తికి 42సార్లు 3.5 లక్షల ప్రభుత్వ సహాయం..!

పాట్నా : బీహార్‌కు చెందన ఓ వ్యక్తి 42 మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి రూ.3,49,600 డ్రా చేసిన ఉదంతం వెలుగు చూసింది. వైశాలి జిల్లా హాజీపూర్‌సాదర్ బ్లాక్‌లోని విష్ణుపూర్‌రామ్ గ్రామానికి చెందిన యోగేశ్వర్ చౌదరి తన పేరున వేర్వేరు గుర్తింపు కార్డులను ఉపయోగించి 42సార్లు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందారు.

విశ్వేశ్వర్‌రామ్ అనే మరో వ్యక్తి రూ.91,200కు మరుగు దొడ్ల నిర్మాణం కోసమని ప్రభుత్వానికి టోకరా ఇచ్చారు. ఈయన పదిసార్లు తన పేరున ఈ సొమ్మును డ్రా చేశారు. ప్రభుత్వ నిధుల్ని కైంకర్యం చేసిన ఈ రెండు సంఘటనలు 2015 ప్రథమార్ధంలో జరిగాయి.

ప్రత్యేకం

బిజెపి వ్యాఖ్యలపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం

అగర్తల : త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్‌నుద్దేశించి ఒక బిజెపి నేత చేసిన వ్యాఖ్యలపై ప్రజానీకంలో తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆ నేతకు వ్యతిరేకంగా రాష్ట్రంలో పలుచోట్ల నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. సాధారణ ప్రజానీకం కూడా ఈ ప్రదర్శనల్లో భాగస్వాములవుతున్నారు. ఇతర పార్టీల నాయకులు కూడా బిజెపి నేత తీరును తీవ్రంగా ఖండిస్తున్నారు. త్రిపుర శాసనసభకు ఎన్నికలు సమీపిస్తుండటంతో బిజెపి ఒక వ్యూహం ప్రకారం సిపిఎం పైనా, ఆ పార్టీ నేతల పైన విషప్రచారాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా రెండు రోజుల క్రితం జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న బిజెపి సీనియర్ నేత, అస్సాం ఆరోగ్యశాఖ మంత్రి హిమాంత బిస్వా శర్మ త్రిపుర సిఎం మాణిక్‌సర్కార్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు సంధించారు. మాణిక్‌సర్కార్ సొంత నియోజకవర్గం ధన్‌పూర్‌లోనే ఆ ర్యాలీని బిజెపి నిర్వహించింది. ఈ సందర్భంగా హిమాంత బిస్వా శర్మ మాట్లాడుతూ 'శాసన సభ ఎన్నికల తరువాత మాణిక్‌సర్కార్‌ను బంగ్లాదేశ్‌కు పంపేస్తాం' అని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై మాట్లాడుతూ ఆయన చేసిన ఈ వ్యాఖ్యపై త్రిపుర ప్రజానీకంలో ప్రస్తుతం తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బిజెపి స్థానిక ఉగ్రవాద గ్రూపులతో చేతులు కలిపింది. ఉద్దేశ్యపూర్వకంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నిస్తోంది. అయితే, ఈ తరహా కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. హిమాంత శర్మ వ్యాఖ్యలతో కొన్ని సంవత్సరాలుగా బిజెపి



త్రిపుర సిఎంపై నోరుజారిన బిజెపి నేత హిమాంత శర్మ

చేస్తున్న ఈ కుట్ర అంశం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. బిజెపికి, ఉగ్రవాదులకు ఉన్న సంబంధాలపై స్థానిక ప్రజానీకం పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు. హిమాంత శర్మ వ్యాఖ్యలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బిజన్ ధర్ తీవ్రంగా స్పందించారు. 'రాజకీయ నిబద్ధతకు, సాధారణ జీవితానికి మాణిక్ సర్కార్ నిలువెత్తు నిదర్శనం. దేశంలోనే ఆయనకు ఈ గుర్తింపు ఉంది. ఆయన భారతీయుడు. ఆయన్ను ఎవ్వరూ బంగ్లాదేశ్‌కు పంపలేరు. స్థానికంగా ఉద్రిక్తతలు రేపడానికే బిజెపి నేతలు ఇటువంటి మాటలు మాట్లాడుతున్నారు' అని పేర్కొన్నారు. త్రిపుర కాంగ్రెస్ కూడా హిమాంత శర్మ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. 'అస్సాంలో ఆయన అవినీతి చరిత్ర మాకు తెలుసు. ఆయన ఎందుకు బిజెపిలో చేరాడో కూడా తెలుసు. బిజెపిలో చేరకుండా ఉంటే, ఆయన చేసిన అవినీతికి ఇప్పటికే జైలులో ఉండేవారు' అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బిర్జాత్ సిన్హా పేర్కొన్నారు.

హిమాంత అవినీతి చరిత్ర ఇది!

ప్రస్తుతం అస్సాంలో బిజెపి మంత్రిగా ఉన్న హిమాంత బిస్వా శర్మ వాస్తవానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు. 2010లో కాంగ్రెస్ పార్టీ మంత్రివర్గంలో ఆయన మంత్రి కూడా! అప్పట్లో కేబినెట్ మంత్రిగా ఉన్న ఆయన గౌహతి అభివృద్ధి విభాగంకు ఇన్‌ఛార్జిమంత్రిగా కూడా వ్యవహరించారు. గౌహతి నగరానికి తాగునీటి సరఫరాకు ఉద్దేశించిన పథకంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయి. అమెరికన్ నిర్మాణరంగ బహుళజాతి సంస్థ లూయిస్ బెర్జర్‌తో కలిసి ఈ పథకాన్ని అప్పట్లో ప్రారంభించారు. అయితే, ఈ ప్రాజెక్టులను దక్కించుకోవడానికి ఆ సంస్థ భారీ మొత్తంలో ముడుపులు చెల్లించిందని పేర్కొంటూ అమెరికన్ న్యాయశాఖ 2015లో దర్యాప్తు ప్రారంభించింది. అస్సాం,గోవాలతోపాటు ఇండోనేషియా, కువైట్‌లలో కూడా ఆ సంస్థ ఇదే రకమైన అక్రమాలకు పాల్పడిందని అమెరికన్ న్యాయశాఖ రూపొందించిన నివేదికలో పేర్కొంది. అప్పట్లో ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో ఆ పనులను పర్యవేక్షించిన హిమాంత శర్మకే ఈ ముడుపులు దక్కాయన్నది వీటి సారాంశం. ఇవే అంశాలను పేర్కొంటూ 2015 జులై 21న బిజెపి ఒక బుక్‌లెట్‌ను కూడా విడుదల చేసింది. దేశ ప్రధాని హోదాలో నరేంద్రమోడీ స్వయంగా ఆ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. దీనిపై అస్సాం సిఐడి కూడా విచారణ ప్రారంభించింది.

కెన్యాలో ఘోర రోడ్డు ప్రమాదం

నైరోబీ : సెంట్రల్ కెన్యాలో ఆదివారం జరిగిన ఓ ఘోర రోడ్డు ప్రమాదంలో 30 మంది మరణించగా మరో 16 మందికి పైగా గాయపడ్డారని పోలీసులు చెప్పారు. సెంట్రల్ కెన్యాలో నకురు పట్టణం వద్ద స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 3 గంటల సమయంలో ఒక బస్సు, లారీ ఢీకొన్న ఈ ప్రమాదంలో 30 మంది మరణించారని రిఫ్ట్ వ్యాలీ ట్రాఫిక్ పోలీస్ చీఫ్ జెరో అరోమ్ చెప్పారు. శిథిలాల నుండి మృతదేహాలను తొలగించి, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించామని ఆయన వివరించారు. కెన్యా పశ్చిమ ప్రాంతంలోని బుసియా నుండి ఈ బస్సు ప్రయాణిస్తున్న నకురు ఎల్డోరెట్ హైవైపై ప్రమాదకరమైన మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వివరించారు. ఈ మలుపు వద్ద ఈ నెలరోజుల వ్యవధిలో జరిగిన ప్రమాదాలలో మరణించిన వారి సంఖ్య 100కు చేరిందన్నారు.

వేడుక

కొత్త సంవత్సర వేడుకలను పురస్కరించుకొని సిడ్నిలో ప్రజలు ఆనందోత్సాహాల్లో మునిగితేలుతున్నారు. ఈ సందర్భంగా పేల్చిన బాణా సంచా అకాశనంటుతూ వివిధ రంగుల విందును పంచింది.



దుస్థితి

సిరియాలోని దక్షిణ ఇడిలిబ్‌లోని ఓ గ్రామానికి చెందిన నిర్వాసిత ప్రజల దుస్థితికి చిహ్నం ఈ దృశ్యం. తీవ్రవాదుల కారణంగా శరణార్దులుగా మారి ఇలా టెంట్లు వేసుకొని జీవనం సాగిస్తున్నారు.



సౌదీ చేరుకున్న పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్

లాహోర్ : శనివారం తమ దేశం నుండి బయల్దేరిన పాక్ మాజీ ప్రధాని నవాజ్‌షరీఫ్ సౌదీ అరేబియాకు చేరుకున్నారని పిఎంఎల్-ఎన్ వర్గాలు తెలిపాయి. సౌదీ ఎయిర్‌లైన్స్‌కు చెందిన సంస్థలో ఆయన రియాద్‌కు చేరుకున్నారని పార్టీ వర్గాలు వివరించాయి. ఈ పర్యటనలో ఆయన సౌదీ రాజు సల్మాన్, యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్‌తో భేటీ అయి ప్రధానమైన అంశాలను చర్చించనున్నారని పిఎంఎల్-ఎన్ ఒక ప్రకటనలో తెలిపింది. పనామా పత్రాల కుంభకోణంలో పేరు బయటకు రావటంతో గత జులై 28న పాక్ సుప్రీంకోర్టు నవాజ్‌షరీఫ్‌పై అనర్హత వేటు వేయటంతో ఆయన పదవిని కోల్పోయిన విషయం తెలిసిందే.

నదిలో కూలిన సీ ప్లేన్, ఆరుగురి మృతి

సిడ్నీ : సిడ్నీ నదిలో ఆదివారం నాడు ఒక సీప్లేన్ కూలిన ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. నగరంలో జరుగుతున్న నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా 'వైన్ అండ్ డైన్' అనే ఈ సీ ప్లేన్‌లో వీరు నగర విహారానికి బయల్దేరారు. ఈ ప్రమాదానికి కారణం కానీ, అందులో మరణించిన ఐదుగురి వివరాలు కానీ తమకు తెలియదని పోలీసులు చెప్పారు. మృతులలో ఆరో వ్యక్తి ఆ విమాన పైలట్ కావటం విశేషం. కాగా మృతులలో నలుగురు బ్రిటన్ జాతీయులని ఆస్ట్రేలియన్ మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించినప్పటికీ పోలీసులు మాత్రం దీనిని ధృవీకరించలేదు. అయితే మీడియా కథనాల ఆధారంగా తాము లండన్‌లోని విదేశీ వ్యవహారాల అధికారులను సంప్రదిస్తున్నట్లు సిడ్నీలోని స్థానిక అధికారులు చెప్పారు.

ఇరాన్‌లో ఆగని నిరసనలు

ఇద్దరు ఆందోళనకారుల మృతి

దుబాయ్ : ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రారంభమైన నిరసనలు వరుసగా నాలుగో రోజు కూడా కొనసాగాయి. అంతేకాక రాజధాని టెహ్రాన్ నగరానికి కూడా విస్తరించాయి. వేలాది మంది ప్రజలు భారీయెత్తున నిరసన వ్యక్తం చేస్తూ పోలీసులతో ఘర్షణలకు దిగటంతో పాటు ప్రభుత్వ భవనాలపై దాడులు చేశారని మీడియా తన వార్తా కథనాలలో పేర్కొంది. ఇరాన్‌లో పశ్చిమ ప్రాంతంలో వున్న దోరుద్ పట్టణంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు ఆందోళనకారులు మరణించినట్లు సోషల్ మీడియాలో ప్రసారమవుతున్న కథనాల ద్వారా తెలుస్తోంది. ప్రభుత్వంలో పోటెత్తుతున్న అవినీతి, ఆర్థిక అవకతవకలపై ప్రజల్లో గత కొద్ది నెలలుగా వ్యక్తమవుతున్న అసంతృప్తి ఈ నిరసనలకు దారి తీసింది. వాస్తవానికి 2009లోనే ప్రభుత్వంపై అసంతృప్తి ప్రారంభమైనప్పటికీ ఇటీవల అధ్యక్షుడు మహ్మూద్ అహ్మది నెజాద్ తిరిగి ఎన్నిక కావటంపై చెలరేగిన వివాదం దీనికి మరింత ఆజ్యం పోసింది. ప్రభుత్వ వ్యతిరేక నిరసనలకు ప్రతిగా ప్రభుత్వ అనుకూల వర్గాలు నెజాద్ సర్కారుకు మద్దతుగా టెహ్రాన్‌తో పాటు వివిధ



నగరాలలో ప్రదర్శనలు నిర్వహించాయి. దేశవ్యాప్తంగా దాదాపు 1,200 నగరాలు, పట్టణాలలో ప్రభుత్వ అనుకూల ర్యాలీలు నిర్వహించినట్లు అధికార టీవీ ఛానల్ వెల్లడించింది. అదే సమయంలో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయి. టెహ్రాన్ నగరంలో ఆందోళనకారులు పోలీసులతో ఘర్షణలకు దిగి వారిపై రాళ్లు రువ్వారని మీడియా తన కథనాలలో వివరించింది. నిరసనకారులను తరిమికొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేస్తున్నారని, మరికొంతమందిని అరెస్ట్ చేశారని సోషల్ మీడియాలో ప్రసారమవుతున్న వీడియోల ద్వారా తెలుస్తోంది. ఇతర ప్రాంతాలనుండి ఆందోళనకారులు తరలి రావటాన్ని నిరోధించేందుకు వీలుగా పోలీసులు రెండో మెట్రో స్టేషన్లను మూసివేశారని ఇరాన్ అధికార వార్తా సంస్థ ఇస్నా వెల్లడించింది. రాజధాని టెహ్రాన్‌తో పశ్చిమాన వున్న కరాజ్ నగరంలో కొన్ని ప్రభుత్వ భవనాలను ధ్వంసం చేసిన ఆందోళనకారులు వీధుల్లో చెత్తను దగ్ధం చేస్తూ తమ నిరసన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కాగా రాజధాని నగరంలో పరిస్తితి అదుపులోనే వుదని రివల్యూషనరీ గార్డ్స్ డిప్యూటీ సెక్యూరిటీ చీఫ్ బ్రిగేడియర్ జనరల్ ఇస్మాయిల్ కౌసరి చెప్పారు. నగరంలో అశాంతి ఇదే విధంగా కొనసాగితే ఆందోళనలపై ఉక్కుపాదం మోపాల్సి వస్తుందని ఆయన ఆందోళనకారులను హెచ్చరించారు. ఆందోళనకారులపై ఇరాన్ ప్రభుత్వం కొనసాగిస్తున్న అణచివేతను అమెరికా ఖండించింది. ఇరాన్‌లో ప్రజలు మార్పును కోరుకుంటున్నా రన్న విషయాన్ని యావత్ ప్రపంచమూ అర్థం చేసుకుం టోందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక ట్వీట్‌లో పేర్కొ న్నారు. ట్రంప్ వ్యాఖ్యలను ఖండించిన ఇరాన్ విదేశాంగశాఖ ప్రతినిధి బెహరామ్ కస్సామీ అమెరికా నేతలు చేస్తున్న అవకాశవాద ప్రకటనలను ఇరాన్ ప్రజలు పట్టించుకోబోరని స్పష్టం చేశారు. రాజధాని టెహ్రాన్ నగరంతో పాటు కషన్, అరాక్, అహ్వాజ్, జంజన్, బందర్ అబ్బాస్, కెర్మాన్ వంటి నగరాలలో సైతం భారీయెత్తున నిరసన ప్రదర్శనలు కొనసాగాయి.

పనామా నౌకను స్వాధీనం చేసుకున్న ద.కొరియా



చమురు రవాణా చేస్తున్నదని ఆరోపణ

సియోల్ : ఐరాస ఆంక్షలకు విరుద్ధంగా ఉ.కొరియాకు చమురు ఉత్పత్తులను రవాణా చేస్తున్నదన్న అనుమానంతో పనామాకు చెందిన ఒక వాణిజ్య నౌకను ద.కొరియా అధికారులు ఆదివారం నాడు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 5,100 టన్నుల బరువున్న కోటి అనే ఈ నౌకను ద.కొరియా రేవు పట్టణం ప్యాంగ్‌టేక్- డాంగ్‌జిన్ తీరంలో నిలిపివేసి, ఆ నౌక సిబ్బందిపై అధికారులు దర్యాప్తు జరుపుతు న్నారని స్థానిక నౌకాదళ అధికారులను ఉటంకిస్తూ అధికార యోనాప్ వార్తాసంస్థ వెల్లడించింది. ఉ.కొరియాపై ఐరాస ఆంక్షలు అమలులోకి వచ్చిన తరువాత ఇది రెండో స్వాధీనం కావటం విశేషం. ఉ.కొరియాకు చమురు ఉత్పత్తులు రవాణా చేస్తోందన్న అనుమానంతో గత నవంబర్ నెలలో హాంకాంగ్‌కు చెందిన ఒక వాణిజ్య నౌకను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గత శుక్రవారం నాడు అధికా రులు స్వాధీనం చేసుకున్న పనామా నౌకను ప్రభుత్వ తదుపరి నిర్ణయం వరకూ దేశం వదిలి వెళ్లరాదని అధికారులు ఆదేశించారు. ఈ నౌకకు చెందిన సిబ్బందిని కస్టమ్స్, ఇంటెలిజెన్స్ అధికారులు ప్రశ్నిస్తున్నారని మీడియా వెల్లడించింది.

సెయింట్ పీటర్స్ బర్గ్‌లో దాడి

అనుమానితుడి అరెస్ట్

మాస్కో : సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఒక సూపర్ మార్కెట్‌పై దాడి చేసి 18మంది గాయపడటానికి కారకుడైన వ్యక్తిగా అనుమానిస్తున్న ఒక వ్యక్తిని రష్యన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ దాడిని 'ఉగ్రవాద చర్య'గా అధ్యక్షుడు పుతిన్ అభివర్ణించిన విషయం తెలిసిందే. రష్యాలో రెండో పెద్ద నగరం, పుతిన్ స్వస్థలం అయిన సెయింట్ పీటర్‌బర్గ్ నగరంలోని ఒక సూపర్‌మార్కెట్‌పై ఈ అనుమానితుడు డిసెంబర్ 27న బాంబు దాడి చేసిన విషయం తెలిసిందే. అరెస్ట్ చేసిన అనుమానితుడ్ని తాము ప్రశ్నిస్తున్నామని రష్యా పోలీసు ప్రతినిధి స్వెత్లానా పెట్రెంకో ఒక ప్రకటనలో వెల్లడించారు. నిందితుడు 35 ఏళ్ల డిమిట్రి లుక్యానెంకోగా గుర్తించామని, సెయింట్‌పీటర్స్ బర్గ్ నగరానికే చెందిన ఇతడు 'న్యూయేజ్' జాతీయవాద ఉద్యమంలో సభ్యుడని అధికారులు చెప్పారు.



ఆఫ్ఘనిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి

15 మంది మృతి

కాబూల్ : ఆఫ్ఘనిస్తాన్ తూర్పు ప్రాంతంలో ఆదివారం జరిగిన ఒక ఆత్మాహుతి దాడిలో కనీసం 15 మంది మరణించారని, మరో 14 మందికి పైగా గాయపడ్డారని అధికారులు చెప్పారు. నన్గర్‌హర్ ప్రావిన్స్ రాజధాని జలాలాబాద్ సమీపంలోని బెహసుద్ జిల్లాకు చెందిన ఒక గ్రామంలో జరుగుతున్న అంత్యక్రియల కార్యక్రమంపై జరిగిన ఈ దాడిలో మృతుల సంఖ్య 15కు చేరిందని నన్గర్‌హర్ గవర్నర్ ప్రతినిధి ఆయతుల్లా ఖోగ్యాని మీడియాకు చెప్పారు. ఈ దాడిలో మరో 14 మంది గాయపడ్డారని, వీరంతా సాధారణ పౌరులేనని ఆయన వివరించారు. హస్కామినా మాజీ గవర్నర్ అంత్యక్రియల సందర్భంగా ఈ ఆత్మాహుతి దాడి జరిగిందని ఆయన వివరించారు. కాగా ఈ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు తాలిబన్‌లు కానీ, మరే ఇతర మిలిటెంట్ గ్రూప్ కానీ ప్రకటించలేదు.

మొదటి పేజీ తరువాయి

కర్నూలులో దళితుల గ్రామ బహిష్కరణ

జయన్న, సుబ్బరాయుడు కుటుంబాలను గ్రామం నుంచి బహిష్కరించారు. మిగతా రెండు కుటుంబాలకు చెందిన ఎలీషా, దేవరాజులు కూడా ఎత్తి పనులకు వెళ్లకుండా గ్రామంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం నక్కలదిన్నె గ్రామంలో అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తి చనిపోయాడు. ఎత్తి పనులకు రావాలని దళితులను పిలిచారు. దీంతో ఎవరూ వెళ్లకపోవడంతో అగ్రవర్ణాల వారే స్వయంగా జెసిబి సహాయంతో గుంతను తవ్వుకొని, చనిపోయిన వ్యక్తిని పూడ్చుకున్నారు. ఆగ్రహించిన అగ్రవర్ణాల వారు జెసిబితో ఎస్సీ కాలనీకి వెళ్లే పైపులైన్‌ను ధ్వంసం చేశారు. విద్యుత్, నిత్యవసర సరుకుల సరఫరాను నిలిపివేశారు. 20 కుటుంబాల దళితులు గ్రామం విడిచి వెళ్లకపోతే దాడులు తప్పవని హెచ్చరించారు. దీంతో దళితులు రుద్రవరం పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించారు. సత్యం, ఏసు, తిరుపాలు, ఓబులేసు, పుల్లన్న, శేఖర్, దానం, వెంకటసుబ్బయ్య, నాగార్జున, మాలమహానాడు, దళిత సమాఖ్య నాయకులు చంటి ఓబయ్య, గుర్రప్పల ఆధ్వర్యంలో ఎస్ఐ హనుమంతయ్యకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులు ఆదివారం సాయంత్రం వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.


బహుళధృవ ప్రపంచావిష్కరణ

సవాళ్లు ఎదురైనా ప్రపంచం బహుళపక్ష వాదాన్ని ముందుకు తీసుకెళ్లటంలో అనేక విజయాలు సాధించిందని ఐరాస నివేదిక వెల్లడించింది. పారిస్ వాతావరణ మార్పుల ఒప్పందం నుండి అమెరికా వైదొలగినప్పటికీ గత నవంబర్‌లో బాన్‌లో జరిగిన వాతావరణ మార్పుల సదస్సు పారిస్ ఒప్పందాన్ని ఖరారు చేయటం ప్రధానమైన విజయం. వాతావరణ మార్పులనుఎదుర్కొనే విషయంలో ఈ ఒప్పందంలోని భాగస్వామ్య దేశాలకు అదనపు నిధులు సమకూర్చటంతో పాటు వ్యవసాయం, దేశీయ హక్కుల పరిరక్షణ, లింగసమానత్వం వంటి లక్ష్యాల సాధనకు సమిష్టి కృషికి అంగీకారం తెలియచేయటం మరో విజయమని ఐరాస పేర్కొంది. పారిస్ ఒప్పంద లక్ష్యాల సాధనకు అవసరమైన నిధుల సమీకరణ కోసం ఈ డిసెంబర్‌లో మరో వాతావరణ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ కృషిని ఐరాస తన నివేదికలో అభినందించింది. అదే విధంగా ట్రాన్స్‌పసిఫిక్ భాగస్వామ్య ఒప్పందం (టిపిపి)తో పాటు ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (నాఫ్టా) నుండి వైదొలగాలని అమెరికా నిర్ణయించినప్పటికీ అంతర్జాతీయ వాణిజ్యంలో పురోగతి సాధించటం అంతర్జాతీయ సమాజం సాధించిన మరో గొప్ప విజయమని ఐరాస తన నివేదికలో పేర్కొంది. వలసల నియంత్రణ, వలసదారులను ఆదుకోవటంలోనూ, నిరాయుధీకరణ విస్తరనతో పాటు ప్రపంచ సంస్థలను సమర్థించటంలోనూ అంతర్జాతీయ సమాజం గణనీయ విజయాలను నమోదు చేసిందని ఈ నివేదిక తెలిపింది.

టిడిపి పాలనలో ప్రచార్భాటమే

పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



టిడిపి పాలనలో ప్రచారం ఎక్కువ, పని తక్కువ అని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. 2017 సంవత్సరం వైఫల్యంగా ముగిసిందన్నారు. సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన టిడిపి గడచిన మూడున్నరేళ్లలో ప్రచారంపై తప్ప అభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. ప్రచారంపై చంద్రబాబుకున్న ఆసక్తి వల్ల కోట్ల రూపాయల ప్రజాధనం వృధా చేస్తున్నారన్నారు. ప్రత్యేక హోదాపై చంద్రబాబు ఎన్నోసార్లు మాట మార్చారన్నారు. చంద్రబాబు అధికారంలోకొస్తే ఐటి రంగం పరుగులు పెడుతుందని, పరిశ్రమలు క్యూ కడతాయని ప్రచారం చేశారన్నారు.

ఈ మూడున్నరేళ్లలో ఒక్క ఐటి కంపెనీ కూడా ఏపీవైపు చూడలేదన్నారు. తొలుత గూగుల్ వంటి కంపెనీలొస్తాయని ప్రచారం చేసినా అదీ బోగస్ అని తేలిపోయిందన్నారు. చంద్రబాబు అధికారంలోకొచ్చాక ఎంవోయు జరిగిన హీరో వంటి పెద్ద కంపెనీల జాడ కూడా లేదన్నారు.

నేరాల కట్టడే ప్రథమ ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నోసార్లు మార్గదర్శకత్వం చేసే వారని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర పోలీస్ శాఖలోని అన్ని సంక్షేమ పథకాలనూ మరింత సమర్థవంతంగా కొనసాగించేందుకు కృషి చేస్తానన్నారు. పోలీస్ శాఖను మరింత బలోపేతం చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తానన్నారు. పదవీ విరమణానంతర జీవితాన్ని సాంబశివరావు సుఖ, సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఉదయం జరిగిన వీడ్కోలు సభలో ఎనిమిది బెటాలియన్ల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం మధ్యాహ్నం 12.15కు డిజిపి సాంబశివరావు లాంఛనంగా నూతన డిజిపి మాలకొండయ్యకు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతల స్వీకరణానంతరం ఆయన సీనియర్ ఐపిఎస్ అధికారులతో కొద్ది సేపు సమావేశమయ్యారు.

పదవికే అలంకారం:మాజీ డిజిపి సాంబశివరావు

పదవి తనకు అలంకారం కాదని, పదవికే తాను అలంకారమని డిజిపిగా పదవీ విరమణ చేసిన సాంబశివరావు అన్నారు. బెటాలియన్ల గౌరవ వందనం అనంతరం ఆయన కొద్ది సేపు ఉద్వేగంగా మాట్లాడారు. పెద్దోళ్లు తప్పు చేస్తే చెల్లుతుందని, చిన్నవారు చేస్తే చెల్లదన్నారు. తాను విధులు నిర్వహించిన 18 నెలల్లో సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదన్నారు. చిన్ననాటి గురువులు బాలకృష్ణమూర్తి, రామకృష్ణారావులతో



మాజీ డిజిపి సాంబశివరావును పూలతో అలంకరించిన జీపులో పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఊరేగిస్తున్న దృశ్యం

పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సహకారం వల్లే తానీ స్థాయిలో ఉన్నానన్నారు.

33 ఏళ్ల తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో మాటల ద్వారా ఎవరినైనా నొప్పించి ఉండొచ్చేమో కానీ, చేతల ద్వారా మాత్రం ఎవరికీ నష్టం చేయలేదన్నారు. పోలీస్ శాఖలోని 50 వేలకుపైగా ఉన్న కుటుంబసభ్యులందరూ కొత్త సంవత్సరంలో సంతోషంగా ఉండాలని కోరారు. కార్యక్రమం అనంతరం మాజీ డిజిపి సాంబశివరావును పూలతో అలంకరించిన జీపులో ఎక్కించి ఎపి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఊరేగించారు.

వైసిపి నేత హత్య కుట్ర కేసులో 8 మంది అరెస్టు

ప్రజాశక్తి -ధర్మవరం టౌన్

అనంతపురం జిల్లా ధర్మవరంలో వైసిపి నాయకుడు వడ్డే శీన హత్యకు పన్నిన కుట్ర కేసులో పోలీసులు 8 మందిని ఆదివారం అరెస్టు చేశారు. వివరాలను విలేకరుల సమావేశంలో ఇన్‌ఛార్జి డీఎస్పీ రామవర్మ వెల్లడించారు. ధర్మవరంలో బోయ వీధిలో నివసిస్తున్న వైసిపి నాయకుడు వడ్డే శీన, సమీప బంధువైన ఉపేంద్రకు ఓ ఇంటి విషయంలో కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో వడ్డే శీనను అడ్డు తొలగించాలని ఉపేంద్ర కుట్ర పన్నాడు. చిత్తూరు జిల్లా మదనపల్లెలో ఉన్న స్నేహితులతో కలిసి శీనను హత్య చేయాలని నిశ్చయించుకున్నాడు. డిసెంబర్ 23వ తేదీన ఐదు మందితో కలసి ధర్మవరానికి వచ్చాడు. శీన ఇంటిపై బాంబులతో దాడి చేశారు. బాంబుల శబ్దానికి జనం రావడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఘటనపై పూర్తి సమాచారం సేకరించిన పోలీసులు ఆదివారం శారదానగర్‌లోని తిక్కస్వామి ఆలయం వద్ద మారణాయుధాలతో మహీంద్రా రెనాల్ట్ కారులో వస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

సొంతూరికి సేవ

(మొదటిపేజీ తరువాయి)

ఎంతో క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నప్పటికీ రైతు రుణభారాన్ని ఉపశమనం చేశామన్నారు.సంక్షోభానికి పెద్ద పీట వేస్తూ పింఛన్లు ఐదు రెట్లు పెంచామని తెలిపారు. అస్తవ్యస్థంగా ఉన్న విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టామన్నారు. నిరంతరం వెలుగులు నింపే రాష్ట్రంగా నిలిపామన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే కృషిని ముమ్మరంగా సాగిస్తున్నామన్నారు. సేంద్రియ, గోదావరి, కృష్ణా పుష్కరాల్ని వైభవంగా నిర్వహించామని తెలిపారు.45 శాతం వృద్ధిరేటుతో ఆంధ్రప్రదేశ్ ఆక్వాహబ్‌గా నిలవడం మనందరికీ గర్వకారణమన్నారు. నీటిపారుదల రంగంలో పట్టిసీమకు ముందు, పట్టిసీమకు తర్వాత అని చెప్పుకునేలా కొత్త శకాన్ని ఆరంభించామన్నారు. దేశ సాగునీటి పారుదల చరిత్రలో అద్భుతంగా చెప్పతగ్గ పోలవరం ప్రాజెక్టును నిరంతర, నిశిత పర్యవేక్షణతో శరవేగంతో నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. దేశంలోనే కాకుండా ప్రజారోగ్య రంగంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి ఎన్టీఆర్ వైద్యసేవ, తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వంటి వినూత్న పథకాల్ని తీసుకొచ్చామన్నారు. రాష్ట్రాన్ని ఫార్మా హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్‌ను మేటి రాష్ట్రంగా నిలపాలన్నదే ధ్యేయమన్నారు. ఐఐటి, ఎన్ఐటి, ఐసర్, నల్సర్, ఎయిమ్స్ వంటి జాతీయ స్థాయి అత్యున్నత విద్యాసంస్థల ఏర్పాటుతో నవ్యాంధ్రప్రదేశ్ నాలెడ్జ్ హబ్‌గా మారుతోందన్నారు. ప్రసిద్ధ వైద్య కళాశాలలు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు.పెట్టుబడుల్లో స్నేహ పూర్వక వాతావరణాన్ని నెలకొల్పి ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాల్ని ఆకర్షిస్తున్నామన్నారు.ఆటోమొబైల్ రంగంలో ఇసుజు, కియా, హీరో తదితర దిగ్గజ సంస్థలు వచ్చాయన్నారు. విశాఖ, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామన్నారు. .సముద్ర ఆధారిత వాణిజ్యాన్ని పెంపొందించి మన ఆంధ్రప్రదేశ్‌ను తూర్పు తీరపు ముఖద్వారంగా మార్చాలన్న ఆశయంతో పనిచేస్తున్నామని తెలిపారు. విశాఖ, అమరావతి, తిరుపతి నగరాల్ని మెగాసిటీలుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ గ్యాస్, విద్యుత్ కనెక్షన్లు అందించామన్నారు. గ్రామాల్లో 10,444 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లను నిర్మించామన్నారు. మరో 3 వేల కిలోమీటర్ల రోడ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. మూడేళ్ల క్రితం 22.5 మిలియన్ యూనిట్ల లోటులో ఉన్న మన రాష్ట్రం ప్రస్తుతం మిగులు విద్యుత్ సాధించిందని తెలిపారు.. ఇ-ప్రగతితో పాలనలో పారదర్శకత తీసుకొచ్చామన్నారు. ప్రభుత్వ శాఖలన్నింటినీ నూరు శాతం కంప్యూటరీకరించామన్నారు. ప్రతి కుటుంబానికీ నెలకు కనీసం నెలకు రూ.10 వేల ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. మహిళా సాధికారిత సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. 45 లక్షల పింఛన్లు ఇస్తున్నామన్నారు. పేదలకు 'చంద్రన్న కానుక' పేరుతో పండుగ సరుకుల్ని పంపిణీ చేస్తున్నామన్నారు. 28 వేల చౌకధరల దుకాణాల్ని చంద్రన్న విలేజ్ మాల్స్‌గా తీర్చిదిద్దామన్నారు. ఇందులో 500 వస్తువుల్ని రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. పెద్ద ఎత్తున చేపట్టిన పట్టణ, గ్రామీణ గృహ నిర్మాణాలతో కొత్త ఏడాదిలో గృహ ప్రవేశాలు చేయనున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా రాష్ట్రంలో 16,36,713 మరుగుదొడ్లను నిర్మించామన్నారు. ఇప్పటి వరకు 6 వేల జిల్లాలను, 5,746 గ్రామాలను ఓడిఎఫ్‌గా ప్రకటించామన్నారు. మార్చి నాటికి మిగిలిన 7 జిల్లాలను ఓడిఎఫ్‌గా మార్చేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నామని పేర్కొన్నారు. ఎపిని 2022 నాటికి దేశంలోని మూడు అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా, 2029 నాటికి దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా, 2050 నాటికి అత్యున్నత ప్రమాణాలు కల్గిన ప్రపంచ గమ్యస్థానంగా మలచాలన్నదే తన విజన్ అని ఉద్ఘాటించారు. అపారమైన యువశక్తి, మహిళా శక్తి , ఖనిజ సంపద, అన్నింటినీ మించిన ఆత్మవిశ్వాసం, వీటన్నింటినీ అనుసంధానం చేసుకోగల్గితే రానున్న 50 ఏళ్లలో తెలుగువారికి తిరుగులేదన్నారు. రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా తనతో పాటు పనిచేస్తున్న వారందరికీ అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలో అత్యుత్తమ నమూనాగా నిలపాలన్నదే తన ఆకాంక్షని పేర్కొన్నారు.

రైతన్నలు, చేనేతలకు తోడుగా ఉంటా

చిత్తూరు పాదయాత్రలో జగన్

ప్రజాశక్తి-తంబళ్ళపల్లె, మదనపల్లె రూరల్ (చిత్తూరు)

రైతన్నలు, చేనేత కార్మికులకు తోడుగా ఉంటానని ప్రతిపక్ష నేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రజా సంకల్ప యాత్ర 48వ రోజైన ఆదివారం చిత్తూరు జిల్లా తంబళ్ళపల్లె మండలంలో ఉదయం 8.45 గంటలకు మూలపల్లెమిట్ట నుండి ప్రారంభమైంది. ఎర్రసానివారిపల్లె, దిగువముత్రవానిపల్లె, గజ్జలవారిపల్లెమిట్ట, ఎద్దులవారిపల్లె, గుట్టమీదపల్లె, మటం, కన్నెమడుగు, కె.రామిగానిపల్లె, రెడ్డివానిపల్లె, జోగివానిబురుజు మీదుగా తిమ్మఇండ్లు వరకు సాగింది. ఈ యాత్రలో మహిళలు, రైతులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ చంద్రబాబును నమ్మి ప్రజలు మోసపోయారని, టిడిపి పాలనలో ప్రజలు సంతోషంగా లేరన్నారు. వైఎస్ఆర్ పాలనలో రైతన్నలు, చేనేత కార్మికులు సంతోషంగా ఉండేవారని గుర్తు చేశారు. టిడిపి ప్రభుత్వంలో రైతులు ఆత్మహత్యలకు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. అంతకుముందు తంబళ్ళపల్లె మండలం ఎర్రసానివారిపల్లెలో వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పంట పొలాలను పరిశీలించారు. కనీసం గిట్టుబాటు ధర కూడా రాలేదని, లక్ష రూపాయల వరకు నష్టపోయారని రైతులు వాపోయారు. తాను అధికారంలోకొచ్చాక రైతులకు అండగా ఉంటూ గిట్టుబాటు ధరతో పాటు వ్యవసాయ రుణాలకు వడ్డీ లేకుండా ఇస్తానని హామీ ఇచ్చారు. జానపద కళాకారులను, చేతివృత్తిదారులను ఆదుకుంటానన్నారు. వైసిపి ఉపాధ్యాయ సంఘనేతలు మూలపల్లె వద్ద జగన్‌ను ఘనంగా సన్మానించారు. పాదయాత్రలో ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాజంపేట మాజీ ఎంఎల్ఎ అమరనాథరెడ్డి, జిల్లా కన్వీనర్ నారాయణస్వామి, ఎంపిపి వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపిపి వెంకటరమణారెడ్డి, మండల కన్వీనర్ తాళ్ళ చంద్రశేఖర్. రైతు విభాగం కన్వీనర్ కొండ్రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.



జగన్‌కు మేకపిల్లను అందిస్తున్న రైతులు


కొత్త సంవత్సరం కబుర్లు

ఏడాది ప్రారంభం అంటే ఫ్యాన్స్ కోసం అభిమాన హీరోలు ఏదో సందేశాలు, సమాచారాలు ఇస్తుంటారు. ఈ ఏడాది వారు చేయబోయే సినిమా గురించి అప్‌డేట్స్ చెబుతారు. అభిమానులు కూడా తమ అభిమాన హీరోలు ఏం చెబుతారా అని ఆతృతగా ఎదురు చూస్తుంటారు. ప్రస్తుతం అంతా సోషల్ మీడియాయే కీలక పాత్ర పోషిస్తుండడంతో ఆ మాధ్యమం ద్వారానే చెప్పాల్సిన విషయాన్ని చెబుతున్నారు. కొంతమంది తారలు తాము చేస్తున్న సినిమాలు, రిలీజ్ డేట్ వెల్లడించారు. కొందరు పాత్రలను పరిచయం చేశారు. పవన్ కల్యాణ్ లాంటి వారు ఆయన పాడిన పాటను న్యూ ఇయర్ గిఫ్ట్‌గా ఫ్యాన్స్‌కు అందించారు.


రజనీకాంత్, శంకర్

మనుషులు కాదు...చెట్లే లోకల్

హీరో నాని ఇటీవలే ఓ కథ నచ్చి ఆ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. రవితేజ, కాజల్, నిత్యామీనన్, రెజీనా తదితరులు నటిస్తున్న ఈ సినిమాలో రోజుకొకరి పాత్రను పరిచయం చేస్తున్నారు. ఇది వరకూ రెజీనా, నిత్యా మీనన్, అవసరాల శ్రీనివాస్ క్యారెక్టర్స్ ఎలా ఉంటాయో చెప్పారు. కొత్త సంవత్సరం సందర్భంగా కాజల్ ఎలా ఉండబోతుందో ఓ పోస్టర్ విడుదల చేశారు. గులాబీ పువ్వును పట్టుకుని దిగాలుగా చూస్తున్న కాజల్ ఫొటోను వివిధ ఫ్రేమ్‌లలో చూపించారు. ఇందులో కాజల్ కాళీ పాత్రలో నటిస్తుంది. ఇందులో నాని ఓ చేపకు, రవితేజ ఓ మొక్కకు వాయిస్ ఓవర్ ఇస్తున్నాడు. మొక్కతోనే రవితేజ పాత్రను పరిచయం చేశారు. ఈ పాత్రల్లోనూ విభిన్నత కన్పిపించింది. ' సిటీకి ఎంతోమంది మనుషులు వస్తుంటారుపోతుంటారు. కానీ చెట్లు లోకల్ అంటూ రవితేజ పాత్రను పరిచయం చేస్తూ పోస్టు చేశాడు నాని. ప్రశాంత్ వర్మ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తయింది. ఫిబ్రవరిలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.


పవన్ కల్యాణ్

'2.0' రిలీజ్ డేట్ ఫిక్స్

రజనీకాంత్ రాజకీయాల్లో వస్తున్నట్టు ఆదివారం ప్రకటించారు. ఈ ఆనందంలో అభిమానులు ఉండగానే మరో శుభవార్తను చెప్పారు కూడా చెప్పారు. '2.0' విడుదల తేదీన ఖరారు చేసినట్టు చిత్రబృందం సామాజిక మాధ్యమంలో ప్రకటించింది. శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 'రోబో'కు సీక్వెల్‌గా చేశారు. గత ఏడాది దీపావళికే విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించినా విజువల్ ఎఫెక్స్ పనులు పూర్తి కాలేదని అందుకే ప్రేక్షకుల ముందుకు తీసుకురాలేకపోయామని పేర్కొన్నారు. తర్వాత డిసెంబర్‌లో అన్నారు. మళ్లీ జనవరిలో రిలీజ్ చేస్తామని చెప్పారు. ఇవన్నీ కాదు ఏప్రిల్ 28న కచ్చితంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఏప్రిల్ 14న రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేశామని చిత్రబృందం ఆదివారం సామాజిక మాధ్యమంలో ప్రకటించింది. కథానాయికగా అమీ జాక్సన్ నటించారు. అక్షయ్ కుమార్ ప్రతినాయకుడిగా చేశాడు. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజు మహాలింగం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దాదాపు రూ.450 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించారు.

తెలుగు, తమిళం, హిందీతో కలిపి మొత్తం 15 భాషల్లో ఈ చిత్రం విడుదల కాబోతోంది. ఏ.ఆర్ రెహమాన్ ఈ చిత్రానికి స్వరాలు అందించారు.



కాజల్

కొడకా కోటేశ్వరరావు...

పవన్ కల్యాణ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'అజ్ఞాతవాసి' ఈ నెల 10 ప్రేక్షకుల ముందుకు రానుంది. అనుఇమ్మాన్యుయేల్, కీర్తిసురేశ్ హీరోహీరోయిన్లుగా చేస్తున్న ఈ చిత్రంలో పవన్ కూడా ఓ గీతాన్ని ఆలాపించారు. కొడకా కోటేశ్వరరావు...పల్లవితో సాగే గీతాన్ని, ఈ గీతం సిట్టింగ్స్‌ను సామాజిక మాధ్యమంలో పోస్టు చేసిందీ చిత్రబృందం. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యమందించారు. దీంతో పాటు ఈ చిత్రం స్టిల్స్ కూడా రిలీజ్ చేశారు.

అమితాబ్, రజనీ కూడా పనికిరారు

ఈ స్టిల్స్‌పై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ స్పందించారు. పవన్ చేతులు కట్టుకుని నిల్చొని ఉన్న పోస్టర్‌ను ఉద్దేశిస్తూ.. 'నేను నా గత జన్మలో కూడా ఇలాంటి అభిరుచి ఉన్న అతన్ని చూడలేదు. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ ఎందుకు పనికిరారు పీకే (పవన్‌కల్యాణ్) ముందు.. బ్రూస్‌లీకి మొగుడిలా ఉన్నాడు' అని వర్మ పేర్కొన్నాడు. పవన్ ఎడమ చేయితో కుడి చేయి మనికట్టుని పట్టుకుని కోపంగా చూస్తున్న పోస్టర్‌ను ఉద్దేశిస్తూ.. పవన్ గొప్ప అందగాడు అనే అర్థం వచ్చేలా రాశారు.


బాలకృష్ణ, నయన తార

బాలకృష్ణ, నయన తార కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'జై సింహా'. ఈనెల 12వ తేదీన విడుదల కానుంది. తన అభిమానులకు నూతన శుభాకాంక్షలు తెలియజేసూ ఆ చిత్రం పోస్టర్‌ను విడుదల చేసిందీ చిత్రబృందం. నయన, బాలయ్య ఉన్న ఈచిత్రం ఆసక్తిగా ఉంది.

రిస్కీ రోల్స్ చేయను : కృతిసనన్


కృతి సనన్

కృతిసనన్...బాలీవుడ్ గ్లామర్ హీరోయిన్స్‌లో ఈమె ఒకరు. ఈ భామ చిత్రసీమకొచ్చి నాలుగేళ్ల అవుతుంది. ఈ సందర్భంగా ఆమె ఆదివారం మాట్లాడుతూ " యాక్టర్‌ని అవుతానని నేను ఎప్పుడూ అనుకోలేదు. బీటెక్ చదువుతున్నప్పుడు కూడా హీరోయిన్ అవ్వలనుకోలేదు. అనుకోకుండా సినీ ఇండస్ట్రీలోకి వచ్చాను. ఇప్పటికి నాలుగేళ్లు అవుతుంది. నాలుగు గొప్ప చిత్రాల్లో నటించడం నిజంగా గొప్పగానే భావిస్తున్నా. వ్యక్తిగా, నటిగా నేను చాలా పరిణితి చెందాను. ప్రతి సినిమా నుంచి చాలా విషయాలను నేర్చుకుంటూ ఉంటున్నా. ఓ యాక్టర్ ఎలా ఉండాలో నేను శిక్షణ పొందాను. పరిణితి అనేది చాలా ముఖ్యం. అది నా మొదట సినిమాకు ఇప్పటికీ నాలో చాలా కనిపిస్తుంటుంది. నేను నటిగా నా అభిప్రాయాన్ని చెబుతున్నా. రిస్కీ రోల్స్ చేయడానికి నేను ఆసక్తి చూపించను. విభిన్నంగా ఉండే పాత్రల్లో మాత్రం మెప్పించడానికి ప్రయత్నిస్తా. కానీ అటువంటి పాత్రలు రావడం అవసరం కూడా.

19న చెర్రీ ముహూర్తం

రామ్ చరణ్, బోయపాటి శ్రీను పేర్లు చెబితే మనకు మాస్ గుర్తొస్తుంది. ఎందుకంటే బోయపాటి తీసిన ఏ సినిమా చూసిన పోరాటాలే పోరాటాలు. చెర్రీ చిత్రాల్లోనూ వాటికి కొదవుండదు. అటువంటిది వీరిద్దరూ కలిసి సినిమా చేస్తే ఇక ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఎప్పటి నుంచో చెర్రీ బోయపాటి కాంబినేషన్‌లో సినిమా వస్తుందని ప్రచారం జరుగుతున్నా అధికారికంగా వెల్లడికాలేదు. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ లాంఛనంగా మొదలైంది. కానీ రెగ్యులర్ షూటింగ్ ఎప్పుడన్నది చెప్పలేదు. కొత్త సంవత్సరం సందర్భంగా చెర్రీ వివరాలు వెల్లడించాడు. ఈనెల 19వ తేదీ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని స్పష్టం చేశాడు. చెర్రీ సరసన అను ఇమ్మాన్యుయేల్ కథానాయికగా చేయనుంది. వచ్చే దసరాకు విడుదల కానున్న ఈ సినిమాను దానయ్య నిర్మిస్తున్నాడు. చెర్రీ సుకుమార్ దర్శకత్వంలో చేస్తున్న 'రంగస్థలం' ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

రామ్ చరణ్


మహి వి రాఘవ్ దర్శకత్వంలో 2015లో 'భలే మంచి రోజు' తీశారు. గత ఏడాది 'ఆనందో బ్రహ్మ'తో మెప్పించారు. ఈ ఏడాది మరో సినిమా చేస్తున్నట్టు ప్రకటించారు. విజయ్ చిల్లీ, శశి దేవి రెడ్డి దీనికి నిర్మాతలు.

'సూర్య' టీజర్

అల్లు అర్జున్ తాజా చేస్తున్న సినిమా 'నా పేరు శివ నా ఇల్లు ఇండియా'. ఈ సినిమా టీజర్‌ను కొత్త సంవత్సరం సందర్భంగా ఈ రోజు విడుదల చేస్తున్నట్టు ట్విట్టర్‌లో తన అభిమానులతో పంచుకున్నాడు. రచయిత వక్కంతం వంశీ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. బన్ని మిలట్రీ ఆఫీసర్‌గా చేస్తున్న ఈ సినిమాలో అనుఇమ్మాన్యుయేల్ కథానాయిక. అర్జున్ కీలకపాత్రలో నటిస్తున్నాడు. కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా బన్ని తన కుటుంబ సభ్యులతో చిన్న ట్రిప్ ప్లాన్ చేశాడు. ఆ ట్రిప్ నుంచి తిరిగొచ్చిన తర్వాత జనవరి 4 నుంచి యథావిధిగా షూటింగ్ పాల్గొంటాడు. అల్లు అర్జున్ ఇందులో ఆర్మీ అధికారిగా కనిపించనున్నారు. రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష, శ్రీధర్ లగడపాటి, బన్ని వాసులు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విశాల్–శేఖర్ స్వరాలు సమకూరుస్తున్నారు. వేసవిలో విడుదల చేయనున్నారు.


అల్లు అర్జున్

విలువలపై బ్రిడ్జ్ కట్టారు


రాహుల్ రవీంద్రన్, చాందినీ

రాహుల్ రవీంద్రన్, చాందినీ, మనాలీ రాథోడ్ హీరో హీరోయిన్లుగా చేస్తున్న సినిమా 'హౌరా బ్రిడ్జి'. ఈఎంవీ ఈ స్టూడియోస్ ప్రై.లిమిటెడ్ బ్యానర్ పై రూపొందుతోంది. రేవన్ యాదు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి చేసుకున్నాయి. సెన్సార్ కార్యక్రమాలకు సిద్ధమైంది. ఈనెల ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ 'హౌరా బ్రిడ్జ్' అనే టైటిల్ పెట్టడం వెనక పెద్ద రీజన్ ఉంది. అదేమిటన్నది ఇప్పుడే చెప్పలేం. హ్యూమన్ రిలేషన్స్‌కి ఈ కథ బ్రిడ్జ్ గా ఉంటుంది. ఇందులో మరో బ్రిడ్జ్ కూడా ఉంటుంది. అది ఏంటనేది ప్రస్తుతానికి సస్పెన్స్. చాందినీ చౌదరి ఇందులో చాలా మంచి క్యారెక్టర్లో నటించింది. మనాలీ రాథోడ్‌కి ఈ సినిమా చాలా మంచి పేరు తెస్తుంది. దర్శకుడు రేవన్ చాలా క్లారిటీతో ఉన్నాడు. అద్భుతమైన విజువల్స్ మిమ్మల్ని వండర్ చేస్తాయి. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ కు, సాంగ్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. నా కెరీర్లో అందరూ మెచ్చుకునే చిత్రంగా నిలుస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

ఈ 'దేశ దిమ్మరి' ప్రకృతి ప్రేమికుడు

సవీణ క్రియేషన్స్ పతాకంపై బాలీవుడ్ నిర్మాత సావి గోయల్ నిర్మిస్తున్న చిత్రం 'దేశదిమ్మరి'. నగేష్ నారదాశి దర్శకత్వంలో తనీష్ హీరోగా రూపొందనున్న ఈ చిత్రం చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటుంది. సుభాష్ ఆనంద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో సుమన్, ముకుల్ దేవ్, ఫిష్ వెంకట్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మానవత్వ విలువలను చాటి చెప్పే చిత్రమిది. ప్రకృతి మన అవసరాలను తీరుస్తుంది తప్ప.. అత్యాశను కాదు అనే సిద్ధాంతాన్ని నమ్మే ఓ యువకుడి కథే ఈ దేశ దిమ్మరి. డబ్బుతో అవసరం లేకుండా జీవనం సాగించే ఓ వైవిధ్యభరితమైన కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.



ప్రేమికుల 'హార్ట్ బీట్ '


ధృవ, వెంబ

ధృవ, వెంబ జంటగా రూపొందిన చిత్రం 'హార్ట్ బీట్'. దేవాస్ మీడియా ఎంటర్ టైన్మెంట్ పతాకంపై తెరకెక్కుతోంది. శ్యామ్ దేవభక్తుని నిర్మాత. ద్వారక్ రాజా దర్శకత్వం వహిస్తున్నాడు. డిఫరెంట్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకొని క్లీన్ యు సర్టిఫికేట్ అందుకొంది. ఇటీవల విడుదలైన టీజర్, పోస్టర్స్ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుందని చిత్రబృందం పేర్కొంది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు ప్రకటించింది.

నిర్మాత శ్యామ్ దేవభక్తుని మాట్లాడుతూ "16 ఏళ్లమ్మాయి తనకంటే వయసులో పెద్దవాడైన యువకుడిని మనస్ఫూర్తిగా ప్రేమిస్తే ఎలా ఉంటుంది అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కిన చిత్రమిది. ఎక్కడా అసభ్యతకు, అశ్లీలతకు తావులేకుండా చాలా ఆసక్తికరంగా తెరకెక్కించాం. మా డైరెక్టర్ చిత్రాన్ని తెరకెక్కించిన విధానం అన్నీ వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుంది. హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కించాం' అని అన్నారు.

S & D

రూపాయి





కొత్త సంవత్సరం ఇంటి కోసం

కొత్త సంవత్సరం మొదలవ్వగానే.. ప్రతి ఒక్కరూ కొన్ని కొత్త లక్ష్యాలను సంకల్పించుకుంటారు. వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే అంశాలు కొన్నయితే.. ఆర్థికపరమైన అంశాలు మరికొన్ని. అలా నెరవేర్చుకోవాలనే కలల్లో సొంత ఇంటి కల ఒకటి. ఈరోజుల్లో.. ఉద్యోగ, ఉపాధి, వ్యాపారరంగాల్లో ఉన్నవారికి సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడం అనేది ఏమంత కష్టం కాదు. సులభవాయిదా పద్ధతుల్లో దాదాపు అన్ని బ్యాంకులూ గృహరుణాలను అందజేస్తున్నాయి. అయితే ఈ గృహరుణాలను పొందే విషయంలో ఎలాంటి ఆర్థికప్రణాళిక అవసరం? అందుకు కావాల్సిన అర్హతలు, నియమ, నిబంధనలు ఏమిటి? అనే విషయాలు ఈ వారం 'రూపాయి'లో చర్చిద్దాం!!

దాదాపు అన్ని జాతీయ బ్యాంకులు, ప్రయివేట్ బ్యాంకులు ఇంటి రుణాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాయి. దీనికి కారణం ఒక్కటే. లోన్ తీరే వరకూ ఆయా స్థిరాస్తులు బ్యాంకు పరిధిలో ఉండటంతోపాటు వినియోగదారుల నుంచి దీర్ఘకాలపు ఆదాయ ప్రయోజనమూ దక్కుతుంది. అయితే బ్యాంకుల నుంచి గృహ రుణాలు (హౌసింగ్ లోన్స్) పొందేందుకు కొన్ని నియమాలు, షరతులు కచ్చితంగా పాటించాలి. అంటే ఆదాయవనరుల ఆధారంగా ఏ తరహా రుణం వస్తుందన్నది ముందుగా తెలుసుకుని, బ్యాంకుల్ని సంప్రదిస్తే, ఇంటి రుణాలు పొందడం సులభతరం.

అర్హతలేంటి?

ఇంటి రుణం విషయంలో కస్టమర్ అర్హత, రీపేమెంట్ ఈ రెండు అంశాలను బ్యాంకులు ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటాయి. అందుకే గృహరుణం తీసుకోవాలనే ఆలోచన రాగానే లోన్ తీసుకోవడానికి మీకున్న ఆదాయవనరులు, తిరిగి చెల్లించే అవకాశాలను ముందుగా పరిశీలించుకోవాలి. అందుకు సంబంధించిన పత్రాలతో బ్యాంకులను సంప్రదిస్తే, ఇంటి రుణం పొందేందుకు ఎలాంటి అవకాశాలు ఉన్నాయో తెలుసుకోవచ్చు.

గృహ రుణాల్లో రకాలు

ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల గృహ రుణాలు అందుబాటులో ఉన్నాయి. రెగ్యులర్ గృహ రుణాలు, హోం ఎక్స్‌టెన్షన్ రుణాలు (గృహ విస్తరణ రుణం), హోం ఇంప్రూవ్‌మెంట్ రుణాలు (గృహ ఆధునీకరణ రుణం), హోం మార్ట్‌గేజ్ రుణాలు (ఇంటి తనఖా), నాన్ రెసిడెన్షియల్ ప్రాపర్టీ రుణాలు (గృహేతర ఆస్తులపై రుణాలు) ఇలా రకరకాల పేర్లతో గృహ రుణాలు ఉంటాయి. అయితే ఎలాంటి రుణం తీసుకోవాలి అనే విషయంలో పూర్తి అవగాహన ఉండాలి. ఇందుకు సంబంధిత నిపుణుల సూచనలూ అవసరం.



ఇంటి రుణం కోసం ప్రయత్నం చేసేవారిలో చాలామందికి అసలు ఇంటి రుణం ఎవరికి ఇస్తారు? ఎంత మొత్తంగా ఇస్తారు? అనే అనుమానం కలుగుతూ ఉంటుంది. వేతన జీవులు అంటే ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాలు చేసేవారు, అలాగే స్వయం ఉపాధి పొందుతున్నవారు, బృంద సభ్యులతో కూడిన సహకార గృహనిర్మాణ సంఘాలు, కార్పొరేట్ సంస్థలకు బ్యాంకులు గృహ రుణాలు అందిస్తాయి. కస్టమర్ కొనుగోలు చేస్తున్న లేదా నిర్మిస్తున్న ఇంటి వ్యయంలో గరిష్టంగా 80 శాతం విలువకు మాత్రమే రుణం పొందే అవకాశం ఉంది. రీ పేమెంట్ సామర్థ్యం, వయసు, విద్యార్హతలు, స్థిరమైన, క్రమమైన రాబడులు, లోను తీసుకుంటున్న వ్యక్తిపై ఆధారపడిన కుటుంబసభ్యులు, ఆస్తులు, రుణాలు, డబ్బు ఆదా చేసే అలవాట్లను పరిగణనలోకి తీసుకోవాలి. దాన్నిబట్టి ఎంత రుణం మంజూరు చేయాలో బ్యాంకులు నిర్ణయిస్తాయి. వ్యక్తిగత ఆదాయ వనరులతో జీవిత భాగస్వామి ఆదాయాన్నీ బ్యాంకులు పరిగణనలోకి తీసుకుంటాయి. భార్యాభర్తల ఇద్దరి ఆదాయాన్ని కలిపి చూపించగలిగితే రుణం పొందే అవకాశాలు మెరుగవుతాయి.

కాలపరిమితి

గృహ రుణాల కాలపరిమితి కనీసంగా ఏడాది నుంచి 20 ఏళ్ల వరకూ ఉంటుంది. కొన్ని సంస్థలైతే 25 ఏళ్ల కాలపరిమితి వరకూ రుణాలు మంజూరు చేస్తుంటాయి. కానీ, రుణ కాలపరిమితి ఆ వ్యక్తి రిటైర్ అయ్యే నాటికి ముగిసేలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఉద్యోగస్తుల విషయంలో అయితే రుణం తీసుకున్న వ్యక్తి 60 ఏళ్లకు రిటైరైతే అదే ఏడాదిగానీ, అంతకంటే ముందే గానీ రుణ కాలపరిమితిలోపు రుణం మొత్తం పూర్తయ్యేలా వాయిదాలను లెక్కగడతారు. ఉద్యోగులు కాకుండా స్వయం ఉపాధి పొందిన వారైతే రిటైర్‌మెంట్ వయసును 65 సంవత్సరాలుగా పరిగణిస్తారు. రీపేమెంట్ కాలపరిమితిని నిర్ణయించుకునేటప్పుడు రిటైర్‌మెంట్ వయసునూ పరిగణనలోకి తీసుకోవాలి. రిటైర్‌మెంట్‌ను బట్టి, అలాగే భవిష్యత్తులో సమకూరే అదనపు ఆదాయ వనరులను బట్టి రుణ కాలపరిమితిని నిర్ణయించుకోవాలి.

ఉండాల్సిన డాక్యుమెంట్స్

వినియోగదారుడి వివరాలు అంటే సొంత చిరునామా రుజువులు, వృత్తి, ఉపాధి రుజువుల పత్రాలు. ఇళ్లు కొనుగోలు చేస్తున్న లేదా నిర్మిస్తున్న ప్రదేశ వివరాలు. సాధారణంగా ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఐడి ప్రూఫ్ పత్రాలు, ఉద్యోగస్తులైతే శాలరీ స్లిప్, ఫాం-16, ఐడి కావాలి. వ్యాపారవేత్తలైతే బ్యాలెన్స్ షీట్, పి అండ్ ఎల్ ఖాతా, బ్యాంక్ స్టేట్‌మెంట్లు సమర్పించాల్సి ఉంటుంది. ఏ ప్రాపర్టీ కొనుగోలు చేయాలో ముందే నిర్ణయించుకున్నట్లయితే దానికి సంబంధించిన పత్రాల ఫొటో కాపీ కూడా అవసరమవుతుంది.

సిబిల్ స్కోర్ బాగుండాలి



రిస్కును తగ్గించుకునే కోణంలో దాదాపు అన్ని హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు గృహ రుణాల దరఖాస్తులను చాలా నిశితంగా ఒకటికి పదిసార్లు పరిశీలిస్తాయి. రుణం ఇవ్వడానికి అన్ని అర్హతలూ సరిగ్గా ఉన్నాయా లేదా అనే అంశాన్ని మొదటి వడపోతలో తెలుస్తాయి. అంటే మనం సమర్పించిన పత్రాల ఆధారంగా దీన్ని అంచనా వేస్తాయి. కనీస అర్హతలు లేనట్టయితే లోన్ ఇవ్వడానికి నిరాకరిస్తాయి. అన్ని కోణాల్లో వెరిఫికేషన్ (పరిశీలన) పూర్తయ్యి, గుడ్ క్రెడిట్ అని భావిస్తే, గృహ రుణాన్ని మంజూరు చేస్తాయి.

నచ్చిన ఇల్లు చూసి, కొనడానికి సిద్ధపడిన వెంటనే రుణం కోసం ప్రయత్నం చేస్తే వెంటనే ఇంటి రుణం వచ్చే అవకాశాలు ఉండకపోవచ్చు. ఎందుకంటే లోన్ కోసం దరఖాస్తు చేసుకున్న వెరిఫికేషన్ పీరియడ్ అనేది ఉంటుంది. వెంటనే లోన్ వచ్చేదీ, రానిదీ తెలకపోవొచ్చు. అందుకే అలాంటి పరిస్థితి ఎదురుకాకుండా ఉండాలంటే ఇంటి గురించి ఒక ఆలోచన రాగానే కనీసం ఐదారు నెలల ముందు నుంచే గృహ రుణం సమకూర్చుకోవడం



కోసం ఎలాంటి ఆర్థికపరమైన అర్హతల్ని పెంచుకోవాలి? అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి వాటిపై దృష్టి సారిస్తే.. లోన్ కావాల్సిన సమయానికి ఎలాంటి సమస్యలూ తలెత్తవు. గృహరుణాల విషయంలో ఇలాంటి ప్రాథమిక అంశాలపై ముందుగానే అవగాహనకు రావడం శ్రేయస్కరం.

మిగతా రుణాలతో పోల్చుకుంటే.. ప్రాపర్టీ ఆధారంగా ఇచ్చే గృహరుణాలను సులభంగానే బ్యాంకులు మంజూరు చేస్తుంటాయి. బ్యాంకురుణం లేదా హౌసింగ్ లోన్ ద్వారా సొంత ఇళ్ళు సమకూర్చుకోవాలనే ఆలోచన ఉంటే మాత్రం కనీసం ఏడాది ముందుగానే రుణం పొందేందుకు అవసరమయ్యే పత్రాలు, సిబిల్ స్కోర్ వంటి విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ.. ఆర్థిక ప్రణాళికతో ముందడుగు వేస్తే ఇంటిరుణం పొందడం సులభతరమే.

- వి.చైతన్య

చిల్లరతో.. ఎంతో ఉపయోగం

"వంద రూపాయల నోటు మారిస్తే.. ఏం మిగలడం లేదండీ.. బాబూ!" అని ఇప్పుడు అందరం అనుకోవడం సర్వసాధారణం. వెనుకటి రోజుల్లో ఐదు రూపాయలతో సంతకు వెళ్తే, భుజాన్నెత్తుకుని తీసుకొచ్చేంత బరువుగల కూరగాయలు, సరుకులతో ఇంటికొచ్చేవారట! పైగా ఆ ఐదు రూపాయల్లో పావలానో, అర్ధరూపాయో మిగుల్చుకుని మరీ వచ్చేవారట! కాలం మారింది. ఇప్పుడు సంచి నిండా డబ్బులతో వెళ్తేగానీ పట్టెడు కూరగాయలైనా రాని పరిస్థితి. వంద, ఐదొందల రూపాయల నోట్లు మారిస్తే.. నిమిషాల్లో అక్కడికక్కడే అయిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చిల్లర డబ్బులకు బాగా డిమాండ్ పెరుగుతోంది. చిల్లరంటే.. రూపాయి, ఐదు, పది రూపాయల నాణాలు మొదలుకొని పది, ఇరవై, ఏభై రూపాయల నోట్లు కూడా చిల్లర కిందకే లెక్క.

దైనందిన జీవితంలో చాలాచోట్లకు ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. సిటీ బస్సులు, లోకల్ ట్రెయిన్లు, ఆటోలు, రిక్షాలను ఆశ్రయిస్తాం. ఇలాంటప్పుడు చిల్లర ఎక్కువ అవసరంపడుతుంది. నోట్లను మాత్రమే దగ్గర ఉంచుకోవడంవల్ల ప్రయాణాల్లో చిల్లర సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. షేరింగ్ ఆటో, సిటీబస్ వంటి ప్రయాణాల్లో చిల్లర సమస్య కారణంగా మనకు న్యాయంగా రావాల్సిన ఒకటి, రెండు రూపాయలు నష్టపోతాం. ఒకటి, రెండు రూపాయలు అనేవి ఆ సందర్భంలో పెద్దగా నష్టంగా అనిపించకపోవచ్చు. అలా చిల్లర వదులుకోవడం అలవాటుగా మారితే మాత్రం క్రమంగా, మనకు తెలియకుండానే కనిపించని నష్టంగా మారొచ్చు. అందుకే నోట్లతోపాటు కచ్చితంగా చిల్లర నాణేలను అందుబాటులో ఉంచుకోవాలి. దీంతో క్రయ, విక్రయాల్లో ఎవ్వరిపై భారమూ పడదు. నష్టమూ ఉండదు.




రోజువారీగా జేబులో మిగిలిన చిల్లర డబ్బుల్ని ఎప్పటికప్పుడు డబ్బాలో వేసిపెట్టు కుంటే.. బయట కెళ్ళేటప్పుడు తగిన చిల్లర తీసికెళ్ళడానికి సౌకర్యంగా ఉంటుంది. ★

చిన్నారి



చుక్కలు కలపండి



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోని చుక్కలను కలిపి రంగులు వేయండి!

పొడుపు కథ

రవ్వంత గింజను
మొలకెత్తి పెరుగుతాను.
శాఖకో ఊడనిస్తాను.
మహావృక్షాన్నవుతాను...?

జోక్ :

టీచర్ : రవి! నిన్న స్కూలుకు ఎందుకు రాలేదురా?
రవి : కుక్క కరిచింది టీచర్
టీచర్ : కుక్క ఎక్కడ కరిచిందో చూపించు?
రవి : ఆ కుక్కకు పళ్లు లేవు టీచర్

కరెంటు తీగలు ఎందుకు లూజుగా ఉంటాయి?



పిల్లలూ..! మనం దారిన వెళ్లేటప్పుడు చాలాసార్లు టెలిఫోన్, కరెంట్ పోల్స్ చూస్తూ ఉంటాం. వాటి తీగలను ఎప్పుడైనా గమనించారా? అవి చాలా లూజుగా వేలాడుతూ ఉంటాయి. వాటిని గట్టిగా బిగించి కట్టవచ్చు కదా! మరి అలా ఎందుకు చేయడం లేదో మీకు తెలుసా? అలా చేయకపోవడానికి శాస్త్రీయ కారణాలూ ఉన్నాయి.



కరెంటు లేదా టెలిఫోన్ తీగలు సహజంగా అల్యూమినియం లేదా ఇనుముతో తయారవుతాయి. ఈ లోహపు తీగలు వేసవి కాలంలో ఎండవేడిమికి వ్యాకోచిస్తాయి. ఒకవేళ పోల్స్ వేసేటప్పుడు తీగలను గట్టిగా బిగించినట్లయితే శీతాకాలంలో సంకోచించినప్పుడు పోల్స్ విరిగిపోవటంగానీ లేదా తీగలు తెగిపోవటంగానీ జరుగుతుంది. అందువల్ల ఈ లోహపు తీగలు సంకోచించటానికి వీలుగా కొంత వదులుగా కడతారు. ఇదే విధంగా మనం గమనిస్తే రెండు రైలు పట్టాల మధ్య కొంత ఖాళీ ఉంటుంది. అలాగే కాంక్రీటు రోడ్డు వేసేటప్పుడు ఒక స్లాబ్‌కి మరో స్లాబ్‌కి మధ్య ఖాళీ వదులుతారు. ఘన పదార్థవ్యాకోచ సంకోచాలకు అనువుగా ఉండటానికి ఈ ఖాళీలను వదులుతారు. ★

పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ! మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బొల్లన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లికథలు వేసిన నాటకాలు ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు, మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాలగురించి చిన్నారి పేజీలో పంచుకోండి. వాటిని మీపేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యంపోకండి. నిజమే. అందుకే మీలోదాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం...

పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.

చిరునామా
చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

కెరటంలా..!



తెలుసుకోవాలనే మనస్సుతో
ఆలోచించాలనే భావనతో
సృష్టించాలనే దృక్పథంతో
సముద్ర కెరటంలా
పడిలేస్తూ అయినా లక్ష్యం కోసం
ముందుకు దూసుకుపోవాలి.



ఎ.అపర్ణ,
శ్రీ ఆదర్శ జూనియర్ కళాశాల,
తిమ్మపురం గ్రామం,
ఎస్.రాయవరం మండలం,
విశాఖజిల్లా.

S & D

అగ్రస్థానంలో స్మిత్

- రెండో ర్యాంక్‌లో కోహ్లి
- ఐసిసి టెస్టు ర్యాంకులు

న్యూఢిల్లీ : 2017లో చివరిసారిగా ఆదివారం విడుదల చేసిన ఐసిసి టెస్టు బ్యాట్స్‌మెన్ల జాబితాలో ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ తన అగ్రస్థానాన్ని మరింతగా నిలబెట్టుకున్నాడు. ఏకంగా 947 రేటింగ్ పాయింట్లతో స్మిత్ దూసుకొనిపోతున్నాడు. ఈ ర్యాంకుల్లో ఇప్పటి వరకూ సర్ డాన్ బ్రాడ్‌మన్ (961)వే అత్యధిక పాయింట్లు. ఇప్పుడు ఈ పాయింట్లకు స్మిత్ చేరువ అవుతున్నాడు. కాగా, తాజా జాబితాలో 893 పాయింట్లతో విరాట్ కోహ్లి రెండో స్థానంలో వున్నాడు. చటేశ్వర పూజార (873) మూడో స్థానంలో వున్నాడు.

ఈ ఏడాది టెస్టుల్లో అత్యధిక పరుగులు (1,305) చేసిన బ్యాట్స్‌మెన్‌గా స్మిత్ నిలిచాడు. 76కు పైగా సగటుతో స్మిత్ ఈ పరుగులు చేశాడు. అలాగే ఒకే ఏడాదిలో 1000కి పైగా పరుగులు చేయడం స్మిత్‌కు ఇది వరసగా నాలుగో ఏడాది. ఈ ఘనత సాధించిన రెండో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. గతంలో మాథ్యు హైడెన్ ఈ ఘనత సాధించాడు. అయితే వరసగా నాలుగేళ్ళు 1000కు పైగా పరుగులు చేసిన తొలి ఆస్ట్రేలియా కెప్టెన్‌గా స్మిత్ నిలిచాడు. 2014లో స్మిత్ 81కు పైగా సగటుతో 1146 పరుగులు చేశాడు. 2015లో 73కు పైగా సగటుతో 1,474 పరుగులు చేశాడు. ఇక 2016లో 71కు పైగా సగటుతో 1,079 పరుగులు చేశాడు.కాగా, ఐసిసి టెస్టు బౌలర్ల జాబితాలో ఇంగ్లాండ్‌కు చెందిన జేమ్స్ అండర్సన్‌ను అగ్రస్థానంలో వున్నాడు. రెండో స్థానంలో రబడ వుండగా, మూడు, నాలుగు స్థానాల్లో భారత్‌కు చెందిన జడేజా, అశ్విన్ వున్నారు. ఐదో స్థానంలో హజ్లేవుడ్ నిలిచాడు.

అలాగే, టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో బంగ్లాదేశ్‌కు చెందిన షకీబ్ అల్ హసన్ తొలి స్థానంలో వున్నాడు. రెండు, మూడు స్థానాల్లో జడేజా, అశ్విన్ వున్నారు.

అదేవిధంగా, ఐసిసి టెస్టు జట్ల జాబితాలో భారత్ అగ్రస్థానంతో 2017 ఏడాదిని ముగించింది. తరువాత స్థానాల్లో దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లు వున్నాయి. ఆస్ట్రేలియా జట్టు ఐదో స్థానంలో వుంది.



సెయిలింగ్ విశ్వవిజేత భారత్

భారత్‌కు పతకాల పంట



భారత్ విజేతకు గోల్డ్ మెడల్ అందజేస్తున్న యాటింగ్ అసోసియేష్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ అసూల్ ఆనంద్



ప్రజాశక్తి - ముత్తుకూరు

కృష్ణపట్నం పోర్టులో ఆదివారం జరిగిన సెయిలింగ్ పోటీల్లో భారత్ విశ్వవిజేతగా నిలిచింది. కృష్ణపట్నం పోర్టులో డిసెంబర్ 27నుంచి 31వరకు జరిగిన అంతర్జాతీయ సెయిలింగ్ పోటీల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రతి ఈవెంట్‌లో భారత్ తన ప్రతిభ కనబరచింది. ఇంటర్నేషనల్ సెయిలింగ్ పోటీ ఇంటర్నేషనల్ యూత్ సెయిలింగ్ కాంపిటీషన్ 2017ను తొలిసారిగా పోర్టులో నిర్వహించారు. ఈపోటీల్లో 11 దేశాల సెయిలర్‌లు పాల్గొన్నారు. చివరి రోజున ఆటగాళ్లు ఎక్కువ మంది లేకపోవడంతో పోర్టు కెనాల్‌లో జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి గోల్డ్ మెడల్, రెండో బహుమతి సిల్వర్ మెడల్, మూడో బహుమతి బ్రాంజ్ మెడల్స్‌ను అందజేశారు. జూనియర్ విభాగమైన గ్రీన్ విభాగంలో భారత్‌కు చెందిన సచిన్, విశ్వనాథ్, ఆనంద్‌లు మొదటి, రెండవ, తృతీయ స్థానాల్లో గెలుపొందారు. సీనియర్ విభాగమైన ఆప్టిమిస్ట్ విభాగంలో ఇండోనేషియాకు చెందిన రమధన్ టిట్టూ మొదటి స్థానంలో గెలుపొందారు. స్విర్జర్లాం డ్‌కు చెందిన అలెగ్జాండర్ బైదిన్ రెండస్థానంలోను, తృతీయస్థానంలో ఇండియాకు చెందిన ఇరా దుర్గాప్రసాద్‌లు గెలుపొందారు. 420(డబుల్స్) విభాగంలో భారత్‌కుచెందిన అనిన్యచౌహాన్, విష్ణుసుజేష్‌లు మొదటిస్థానంలో గెలుపొందారు. ద్వితీయ స్థానంలోభారత్‌కు చెందిన భరత్, అభిషేక్ పాండ్యేలు ద్వితీయ స్థానంలో గెలుపొందారు. తృతీయస్థానంలో భారత్‌కు చెందిన పునీత్‌కుమార్ సాహా, అమిత్ సాహాలు గెలుపొందారు. ఈవిభాగంలో మూడు స్థానాల్లో భారత్ సెయిలర్‌లు గెలుపొందారు. లేజర్ రేడియల్ విభాగంలో భారత్‌కు చెందిన విష్ణు శ్రావణన్ మొదటిస్థానంలో గెలుపొందాడు. ద్వితీయ స్థానంలో కెనడాకు చెందిన టటీ స్టీఫెనుక్ గెలుపొందాడు. తృతీయస్థానంలో భారత్‌కు చెందిన గోవింద్‌బైరాగి గెలుపొందారు. లేజర్ 4.7 విభాగంలో భారత్‌కు చెందిన హర్షిత టోమర్ మొదటిస్థానంలో గెలుపొందింది. ద్వితీయ స్థానంలో ఇండోనేషియాకు చెందిన శ్యామ్ సువర్ది, తృతీయస్థానంలో ఇండియాకు చెందిన చిత్రిష్‌లు గెలుపొందారు. సెయిలర్‌లకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సేఫ్టీ బోట్స్‌ను భారీగా మొహరించాయి. గెలుపొందిన వారికి యాటింగ్ అసోసియేష్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ అసూల్ ఆనంద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెయిలింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ అజయ్ నారాయణ, కృష్ణపట్నం కోస్ట్‌గార్డ్ స్టేషన్ కమాండెంట్ అమీత్ ఉనియాల్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రమణయ్య, తమిళనాడు సెయిలింగ్ అసోసియేషన్ సెక్రటరీ అశోక్ టక్కర్, పోర్టు కెప్టెన్ ప్రతీప్ గౌర్, పోర్టు ప్రతినిధులు, వివిధ దేశ ప్రతినిధులు, సెయిలింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. నవ యుగ సెయిలింగ్ అకాడమీ, తమిళనాడు సెయిలింగ్ అసోసియేషన్ యాచింగ్ అసోసియేషన్ ఆఫ్ ఎపి (యాప్) యాచింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాలు ఆసియా సెయిలింగ్ ఫెడరేషన్ మార్గనిర్దేశానుసారం కృష్ణపట్నం పోర్టులో నిర్వహించారు. ఈఅంతర్జాతీయ పోటీలను పోర్టు సెక్యూరిటీ, అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈసెయిలింగ్ పోటీలకు స్పాన్సర్స్‌గా కృష్ణపట్నం పోర్టు కంపెనీ లిమిటెడ్, లార్సన్ అండ్‌టుబ్రో కన్‌స్ట్రక్షన్, ఐసిఎల లిమిటెడ్, సిపోర్ట్ కార్గో లాజిస్టిక్స్ ప్రయివేట్ లిమిటెడ్, ఈక్వినాక్స్ మారనెటెక్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ వ్యవహరించింది. టీటీ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సర్వీసెస్ మద్దతునిచ్చిందని నిర్వహకులు తెలిపారు.

న్యూజిలాండ్‌లో పాక్ క్రికెట్ జట్టు

ఈ నెల 6 నుంచి వన్డే సిరీస్

అక్లాండ్ : వన్డే, టీ20 సిరీస్‌ల కోసం న్యూజిలాండ్‌కు పాకిస్తాన్ క్రికెట్ జట్టు చేరుకుంది. ఈ నెల 6 నుంచి పాక్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ఈ వన్డే సిరీస్ తరువాత, మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభమవుంది. ఈ సిరీస్‌ల కోసం లాహోర్ నుంచి దుబాయ్ మీదుగా అక్లాండ్‌కు పాక్ క్రికెట్ జట్టు చేరుకుంది. కాగా, ఈ విమానం ప్రయాణంలో భారత మాజీ క్రికెటర్ రాహుల్ ద్రావిడ్‌ను పాక్ క్రికెటర్లు కలుసుకున్నారు. రాహుల్ తమకు శుభాకాంక్షలు తెలిపాడని, ఒక సెల్ఫీని అల్‌రౌండర్ మహమ్మద్ హఫీజ్ పోస్ట్ చేశాడు.

నేడు కివీస్, విండీస్ రెండో టీ20

న్యూజిలాండ్, వెస్టిండీస్ క్రికెట్ జట్ల మధ్య సోమవారం రెండో టీ20 మ్యాచ్ జరగనుంది. మూడు మ్యాచ్‌ల ఈ టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ విజయం సాధించింది. బై ఓవెల్‌లో జరిగే నేటి మ్యాచ్‌లోనూ విజయం సాధించింది సిరీస్‌ను సొంతం చేసుకోవాలని కివీస్ జట్టు ఉత్సాహంగా వుంది. కాగా, ఈ పర్యటనలో ఇప్పటికే జరిగిన రెండు టెస్టు మ్యాచుల్లోనూ, మూడు వన్డే మ్యాచ్‌లోనూ వెస్టిండీస్ ఓటమి చవిచూసింది.

విదర్భకు భారీ ఆధిక్యం

అక్షయ్ వాద్కర్ శతకం

ఇండోర్ : ఢిల్లీ జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో విదర్భ జట్టు భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. మూడో రోజైన ఆదివారం ఆట ముగిసే సరికి విదర్భ తన తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 528 పరుగులు చేసింది. జట్టు వికెట్ కీపర్ అక్షయ్ వాద్కర్ (133) శతకంతో అజేయంగా నిలిచాడు. దీంతో ప్రస్తుతానికి ఢిల్లీపై విదర్భ 233 పరుగులు ఆధిక్యంతో వుంది.

నాలుగు వికెట్ల నష్టానికి 206 పరుగులు ఓవర్‌నైట్ స్కోరుతో ఆదివారం ఆటను ప్రారంభించిన విదర్భ జట్టులో 78 పరుగులు వ్యక్తిగత స్కోరు వద్ద వసీం జాఫర్ 6 వికెట్‌గా అవుటయ్యాడు. అప్పుడు విదర్భ స్కోరు 246 పరుగులు. ఈ దశలో అక్షయ్ వాద్కర్- ఆదిత్య సర్వాతే జోడి ఢిల్లీ బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. 79 పరుగులు (154 బంతుల్లో 11 ఫోర్లు) చేసిన తరువాత ఆదిత్య జట్టు స్కోరు 415 పరుగులు వద్ద ఏడో వికెట్‌గా అవుటయ్యాడు. ఈ జోడి ఏడో వికెట్‌కు 169 పరుగుల భాగస్వామం నమోదు చేసింది. ఈ సీజన్‌లో విదర్భకు ఇది ఏడో వికెట్‌లో అత్యుత్తమ భాగస్వామం. ఆట ముగిసే సరికి అక్షయ్ 133 పరుగులు (243 బంతుల్లో 1 సిక్స్, 16 ఫోర్లు), సిద్దేశ్ నెరాల్ 56 పరుగులు (92 బంతుల్లో నాలుగు సిక్స్‌లు, నాలుగు ఫోర్లు)తో అజేయంగా వున్నారు. ఇంకా రెండు రోజులు ఆట మిగిలివుంది. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ తన తొలి ఇన్నింగ్స్‌లో 295 పరుగులకు ఆలౌటయింది.రంజీ ట్రోఫీ ఫైనల్‌కు తొలిసారి చేరుకున్న విదర్భ ఫైనల్‌లోనూ అద్భుత ఆటతీరుతో అభిమానులను ఆకట్టుకుంటుంది.

2017 సంతృప్తి ఇచ్చింది

పివి సింధూ

న్యూఢిల్లీ : 2017 ఏడాది సంతృప్తి ఇచ్చిందని తెలుగు తేజం పివి సింధూ తెలిపింది. రెండు స్వర్ణ, మూడు రజత పతకాలు సాధించడం, ఇందులో ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం కూడా ఉండటం ఆనందగా ఉందని పేర్కొంది. 22 ఏళ్ల సింధూ గత ఏడాదిలో అద్భుత ప్రదర్శనతో రాణించింది. అయితే దుబాయ్ సూపర్ సిరీస్‌లో తుది విజేతగా నిలవకపోవడం కొంత అసంతృప్తి కలిగించిందని సింధూ తెలిపింది. మొత్తంగా 2017 సంతృప్తి ఇచ్చిందని, ఇందులో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతపతకమే ప్రధాన మైనదని పేర్కొంది.

2017లో సింధూ 57 మ్యాచుల్లో పాల్గొని 44 మ్యాచుల్లో విజయం సాధించింది. ఇది చాలా విజయవంతమైన ప్రదర్శనగా చెప్పకోవాలి. ఏడాది ప్రారంభంలో 6వ ర్యాంక్‌లో వున్న సింధూ మూడో ర్యాంక్‌తో ఏడాదిని ముగించింది. తన విజయంలో కోచ్ పుల్లెల గోపిచంద్, తల్లిదండ్రులు పాత్ర ఎంతో వుందని సింధూ పేర్కొంది. క్రీడలను ముఖ్యంగా బ్యాడ్మింటెన్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలనే యువతరం తనను ఆదర్శంగా తీసుకోవడం చాలా ఆనందం కలిగిస్తోందని సింధూ చెప్పింది. వచ్చే ఏడాది కామన్వెల్త్, ఆసియా గేమ్స్, ప్రపంచ చాంపియన్‌షిప్ వంటి భారీ టోర్నమెంట్లు జరగనున్నాయని, వీటిల్లో స్థిరంగా రాణించడం ప్రధానమని సింధూ తెలిపింది.

పూర్తి ఫిట్‌నెస్‌కు సమయం కావాలి

సైనా నెహ్వాల్

న్యూఢిల్లీ : పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి తనకు ఇంకా సమయం కావాలని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ తెలిపింది. మోకలి గాయం నుంచి కోలుకున్న తరువాత సైనా ప్రస్తుతం పిబిఎల్‌లో పాల్గొంటోంది. కాలు వాపుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపింది. త్వరలో జరిగే ఇండియా ఓపెన్‌కు మూడు వారాల వ్యవధిలో సిద్ధపడాల్సి వుందని చెప్పింది. ఈ సమయంలోగా ఫిట్‌నెస్ సాధించడమే తన లక్ష్యమని సైనా తెలిపింది. 2017 సెప్టెంబరు చివరి నుంచి మోకాలి గాయంతో బాధపడుతు న్నట్లు సైనా తెలిపింది. ఉత్తమ ఆటగాళ్లతో తలపడాలంటే మనం కూడా ఉత్తమ ప్రమాణాలతో వుండాలని పేర్కొంది. ఆటల్లో ఫిట్‌నెస్, సామర్థ్యం చాలా కీలకమని, వాటిని కాపాడుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపింది. అలాగే, బ్యాడ్మింటన్ ప్రపంచ సమాఖ్య (బిడబ్ల్యూఎఫ్) 2018 కాలెండర్‌పై సైనా వ్యాఖ్యానించింది. ఈ షెడ్యూల్‌తో ఒక వ్యక్తి అధిపత్యానికి ముగింపు లభిస్తుందని ఆమె చెప్పింది. ఎక్కువ టోర్నమెంట్లు వుండటం వలన, ప్రతీ టోర్నమెంట్‌లోనూ ఒక విజేత పుట్టుకొస్తాడని పేర్కొంది. 'ఎక్కువ టోర్నమెంట్లు అంటే ఎక్కువ గాయాలని అర్థం. ప్రపంచ చాంపియన్‌షిప్ తరువాత రెండు వారాల వ్యవధిలోనే ఆసియా గేమ్స్ నిర్వహిస్తున్నారు. దీంతో ఆటగాళ్లు మానసికంగా, శారీరకంగా అలసిపోతారు. వరస, వరసగా టోర్నమెంట్లు చాలా టూ మచ్‌గా వున్నాయి' అని సైనా తెలిపింది. అయితే బ్యాడ్మింటెన్ కాలెండర్‌పై ఎవరి అభిప్రాయాలు వారికి వుంటాయని, ఇది తన అభిప్రాయమని సైనా పేర్కొంది.

సవాల్‌కు మేము సిద్ధం : రవిశాస్త్రి

కేప్‌టౌన్: దక్షిణా ఫ్రికాతో కఠిన సవాల్‌కు టీమిండి యా ల్లిద్ధంగా ఉన్నట్లు కోచ్ రవిశాస్త్రి తెలిపారు. ఇంతకు ముందుతో పోలిస్తే తమజట్టు మరింత బలంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు. విదేశీ గడ్డపై పరిస్థితులను ఆకళిం పు చేసుకోవడమే పర్యా టక జట్టుకు అత్యంత కఠినమైన పరీక్ష అన్నారు. అక్కడికి చేరుకున్న తర్వాత మీడియాతో మాట్లాడుతూ కోచ్ రవిశాస్త్రి తెలిపారు. మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా జనవరి 5న తొలిటెస్ట్ కేప్‌టౌన్‌లో ఇరుజట్లమధ్య ప్రారంభం కానుంది.'భారత్ సవాల్‌కు సిద్ధంగా ఉంది. నాలుగేళ్ల క్రితం మీరిది అడిగివుంటే నేను కాదని చెప్పేవాడిని. ఇప్పటి జట్టు అనుభవం సంపాదించింది. ప్రత్యర్థి ఎవరైనా వెన్ను చూపకపోవడమే ప్రస్తుత జట్టు గొప్పతనమన్నారు. మేము తలపడే ప్రత్యర్థి టీమ్‌ను గౌరవిస్తాం. పిచ్‌ను చూసి పరిస్థితులను అన్వయించుకుంటాం. రిజర్వు బెంచ్‌లో ఫాస్ట్ బౌలింగ్ విభాగం బలం పెరిగింది. ఇరవై వికెట్లు తీయడంలో ఇదెంతో కీలకం' అని రవిశాస్త్రి అన్నారు.టీమిండియా పేస్ విభాగం బలం పెరగడంతో క్యురేటర్లు ఊరించే పిచ్‌ను తయారు చేస్తారా' అని అడుగగా... 'ప్రతి మ్యాచ్‌ను మేం స్వదేశంలో ఆడినట్టే ఆడతాం. కేప్‌టౌన్‌నూ అలాగే భావిస్తున్నాం. ముందు పిచ్‌ను పరిశీలిస్తాం. పరిస్థితులను అర్థం చేసుకుంటాం. ఎలాంటి ఫిర్యాదులు చేయం' అన్నారు.



స్వాగతం 2018

కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సిడ్నీ, సింగపూర్‌లో ఆకాశాన్ని తాకిన బాణాసంచా మెరుపులు



పలుచోట్ల రోడ్డు ప్రమాదాలు

- 9 మంది మృతి
- 12 మందికి గాయాలు



తూర్పు గోదావరి జిల్లా ప్రమాదానికి గురైన మోటారు బైక్

ప్రజాశక్తి-గుంటూరు/మైదుకూరు (కడప)/గోకవరం(తూర్పుగోదావరి)

పలుచోట్ల సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో ఆదివారం తొమ్మిది మంది మృతిచెందారు. 12 మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. తొమ్మిది మంది గాయపడ్డారు. దుర్గి మండలం అడిగొప్పల యర్రవాగు బ్రిడ్జి వద్ద రెండు వాహనాలు ఢీకొని కారంపూడికి చెందిన సయ్యద్ మస్తాన్‌వలి(33), కాకిరాలకు చెందిన సిద్దా మంగమ్మ, మరో గుర్తు తెలియని మహిళ మృతి చెందారు. క్షతగాత్రులను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాదెండ్ల మండలం సాతులూరు వద్ద జరిగిన ప్రమాదంలో ఫిరంగిపురం మండలం మేరికపూడికి చెందిన చేవూరి మస్తాన్‌రెడ్డి(40) అనే కౌలురైతు మృతి చెందాడు. పొలానికి మందులు కొనుగోలు చేసుకుని వస్తుండగా ప్రమాదం వాటిల్లింది. సత్తెనపల్లి మండలం గుడిపూడిలో ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొట్టడంతో ప్రకాశం జిల్లా పంగులూరు మండలం చంద లూరుకు చెందిన యనమల వెంకట రత్నం, బోదవాడకు చెందిన గుంజి ఆదిశేషమ్మ తీవ్రంగా గాయపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కాకినాడకు వెళ్లే ప్రధాన రహదారిపై సింగార మ్మచింత వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. గండేపల్లి మండలం మల్లేపల్లికి చెందిన గెడ్డం కిషోర్(నాని) (18), ఎజి ఆదిత్య (16), మందా రవి మోటారు సైకిల్‌పై వెళ్తూ చెట్టును ఢీకొట్టారు. కిషోర్, ఆదిత్య అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన రవిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కడప జిల్లా మైదుకూరు మండలం నంద్యాల రోడ్డులోని కాల్వ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మైదు కూరు పట్టణానికి చెందిన అయిదుగురు నంద్యాల రోడ్డులోని కాల్వకట్ట వద్ద ఆదివారం రాత్రి 9 గంటలకు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అనుకోకుండా ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన టెంపో వారిపైకి దూసుకు వచ్చింది. సంఘటనలో రామిశెట్టి రవి(40), రాముడు(51) సుబ్బరాయుడు(27) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం మైదుకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టెంపో డ్రైవర్ అతిగా తాగి వాహనాన్ని నడపడమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మైదుకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆరోగ్య సంరక్షణ నినాదంతో ఎస్‌పిఎఫ్ సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పర్యావరణ పరిరక్షణ-ఆరోగ్య సంరక్షణ అనే నినాదంతో ప్రజలను చైతన్యపరిచేందుకు ఎపి ప్రత్యేక రక్షణ దళం సైకిల్ ర్యాలీ చేపట్టింది. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు 1168కిలో మీటర్ల వరకు ఈ యాత్ర కొనసాగుతుందని ఎస్‌పిఎఫ్ విజయవాడ జోనల్ కమాండెంట్ కెఎన్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న శ్రీకాకుళంలో ఈ యాత్ర ప్రారంభమైందని, ఈ నెల 7న అనంతపురంలో ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ యాత్రలో 1,500మంది ఎస్‌పిఎఫ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. గుంటూరులో సోమవారం ఆ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి యాత్ర ప్రారంభమవుతుందని పేర్కొ న్నారు. సైకిల్ వినియోగం ద్వారా ప్రజలను చైతన్య పరచాలనే ఉద్దేశంతో ఈ యాత్రను నిర్వహిస్తున్నామని, ఇందులో ఏవరైనా పాల్గొనవచ్చునని స్పష్టం చేశారు. మూడేళ్ల నుంచి ఎస్‌పిఎఫ్ సిబ్బంది సైకిళ్లను ఉపయోగిస్తూ మంచి ఫలితాలను సాధించినట్లు వివరించారు.

2019 నుంచి సమాజసేవకు అంకితం

విలేకరుల అల్పాహార విందులో వెంకయ్యనాయుడు



ప్రజాశక్తి- ఉంగుటూరు (కృష్ణాజిల్లా)

2019 జనవరి 20 నుంచి రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుని సమాజసేవకు అంకితం కావాలని నిశ్చయించుకున్నానని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు తెలిపారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారతిట్రస్ట్‌లో ఆదివారం విలేకరులకు అల్పాహార విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజసేవతో ఆత్మసంతృప్తి కలుగుతోందని అన్నారు. విజయవాడ పత్రికలకు పుట్టినిల్లని, తానూ వాటి ద్వారానే విజ్ఞానాన్ని పెంపొందించుకున్నానని చెప్పారు. పత్రికలు సత్యానికి దగ్గరగా ఉండాలన్నారు. 1972 నుంచి తాను ప్రజా ఉద్యమాల్లో ఉన్నానని, విద్యార్థిగా జై ఆంధ్ర ఉద్యమంలో పాల్గొన్నానని, 1977లో రాజకీయ రంగప్రవేశం చేశానని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు క్రమశిక్షణ, పట్టుదలతో ప్రజా జీవితంలో అంకితభావంతో పనిచేసి అంచెలంచెలుగా ఎదిగానని చెప్పారు. దేశంలో 65 శాతం యువశక్తి ఉందని, దీనిని సరైన మార్గంలో నడిపించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. ప్రపంచమంతా ఆర్థిక మందగమనం ఎదుర్కొన్నా, భారత్ మాత్రం నిలదొక్కుకుందన్నారు. ప్రధాని మోడీ సంస్కరణలు దేశాన్ని ప్రగతివైపు నడిపిస్తున్నాయని పేర్కొన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటుధర కల్పించడం, దళారీ వ్యవస్థను నిర్మూలించడం, ఉత్పత్తిదారుడు, వినియోగదారుడికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలని అన్నారు. దీనిపై ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. గ్రామీణులకు అవసరమైన రోడ్లు, విద్యుత్, పొలాలకు సాగునీరు, పంట రక్షణ చర్యలను ప్రభుత్వాలు చేపట్టాలన్నారు. రైతు పండించిన పంటలు నిల్వ చేసుకోవడానికి గోడౌన్లు, కోల్డ్ స్టోరేజీ వ్యవస్థ తాలుకా స్థాయికి విస్తరించాలని, టమాటా, బంగాళాదుంపలు లాంటి వాణిజ్య పంటలు ఒకచోట నుంచి మరో చోటుకు తరలించడానికి రిఫ్రిజిరేటర్ రవాణా వ్యవస్థ రావాలన్నారు. అలాగే గోడౌన్లను బ్యాంకుకు అనుసంధానించాలని చెప్పారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68